తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 03.11.2025 | సంపుటి :12 సంచిక : 103 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

మన అతివలు

# జగజ్జేతలు

## చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు

## తొలిసారి మహిళల ప్రపంచకప్ టైటిల్ కైవసం






- ఫైనల్‌లో సౌతాఫ్రికాపై 52 పరుగుల తేడాతో గెలుపు
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మ, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ షెఫాలీ..
- ఫైనల్ మ్యాచ్‌లోబ్యాటింగ్,బౌలింగ్‌లోనూ అదరగొట్టిన ఇరువురు

**భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ కలను తొలిసారి సాకారం చేసుకున్నారు. ముంబయి వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్‌లో విజయంతో మైదానంలోని ఆటగాళ్లతో పాటు, టీవీ, మొబైల్ తెరలకు అతుక్కుపోయిన అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ ఉద్విగ్న క్షణం కోసం ఏళ్లతరబడి ఎదురుచూసిన భారతావని ఒక్కసారిగా పులకించిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన 50 ఓవర్లలో 298/7 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) చెలరేగారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌట్ అయింది. లారా వోల్వార్ట్ (101) పోరాటం చేసినా మిగతావారు విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5, షఫాలీ వర్మ 2, శ్రీ చరణి ఒక వికెట్ తీశారు.**

**ముంబయి(జనంసాక్షి):** సెమీస్‌లో సూపర్ విక్టరీతో ఫైనల్‌లో అడుగుపెట్టిన భారత్.. ఫైనల్‌లోనూ మరుపురాని ప్రదర్శన చేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (87బీ 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58,58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (45,58 బంతుల్లో 8 ఫోర్లు) రాణించడంతో దక్షిణాఫ్రికాకు భారత్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం 299 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు పరిమితం అయింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. అనెరి డెర్క్‌సెన్ (35), తజ్మిన్ బ్రిట్స్ (23), సునె లూస్ (25) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5, షెఫాలీ వర్మ 2, శ్రీ చరణి ఒక్కో వికెట్ తీశారు.



**బౌలింగ్‌లోనూ అదరగొట్టిన దీప్తి శర్మ, షెఫాలీ..**

భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణా ఫ్రికాకు తొలి వికెట్‌కు 51 పరుగులు చేసింది. తజ్మిన్‌తో కలిసి కెప్టెన్ లారా మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే 9.3 ఓవర్ల వద్ద పరుగు తీసే క్రమంలో అమన్‌జోత్ కౌర్

మిగతా 2లో..

### ఈ విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తి

మహిళల గెలుపుపై ప్రధాని మోదీ హర్షం

2లో..

### ‘ఉమెన్ ఇన్ బ్లూ’ చరిత్ర సృష్టించింది

రాహుల్ గాంధీ

2లో..

### దశాబ్దాల కలను భారత మహిళల జట్టు నెరవేర్చుకుంది

దృఢ సంకల్పాన్ని ప్రదర్శించి టైటిల్ నెగ్గారు: సీఎం రేవంత్‌రెడ్డి

# బాహుబలి సక్సెస్



## నింగిలోకి దూసుకెళ్లిన ‘ఎల్‌వీఎం3-ఎం5’ రాకెట్

- సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టిన వాహకనౌక
- భారత భూభాగం నుంచి ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా రికార్డు

**బెంగుళూరు(జనంసాక్షి):**హిందూ మహాసముద్రంలో దేశ ప్రయోజనాలను రక్షిం చుకోవడంతోపాటు వ్యూహాత్మకంగా పైచేయి సాధించే లక్ష్యంతో భారత్ ఈ ప్రయోగం చేపట్టింది. సాగరంలో మోహరించిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, నేల మీదున్న నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికే షన్లు సాగించేందుకు ఈ ఉపగ్రహం తోడ్పాటు అందిస్తుంది. హిందూ మహాసము ద్రంలో పెరుగుతున్న చైనా నౌకాదళం కదలికలను పసిగట్టడానికి ఉపయోగపడుతుంది. 4,410కిలోల బరువున్న ఉపగ్రహం మన భూభాగం నుంచి భూఅనువర్తిత బదిలీ కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాల అన్నింటిలోకి అత్యంత బరువైనదిగా గుర్తింపు పొందనుంది.సీఎంఎస్-03 ఒక బహుళ బ్యాండ్ ఉపగ్రహం. దేశవ్యాప్తంగా, ఉపఖం డం చుట్టూ విస్తరించిన సువిశాల సాగరప్రాంతంలో టెలికమ్యూనికేషన్ సేవలను మెరుగుపరచడం

మిగతా 2లో..

# మోదీ కార్పొరేట్ ఏజెంట్

- ఓట్ల కోసం ఆయన ఏం చేయడానికైనా వెనుకాడరు
- యువత దృష్టిని మళ్లించడానికి రీల్స్ చూడాలంటున్నారు
- మహాగఠ్‌బంధన్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు
- నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు వల్ల దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకే ప్రయోజనం
- ఎన్నికల ప్రచారంలో రాహుల్

**పట్నా(జనంసాక్షి):**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానిపై విమర్శలు చేశారు. ఆదివారం బిహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ మాట్లాడుతూ.. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఏం చేయడానికైనా వెనకాడబోరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ బిహార్‌కు వచ్చి అనేక ప్రసంగాలు, వాగ్దానాలు చేస్తారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని రాహుల్ విమర్శించారు.బిహార్‌లో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం గురించి ప్రశ్నలు లేవనెత్తకుండా.. యువత దృష్టిని మళ్లించడానికి వారిని రీల్స్ చూడాలని మోదీ కోరుతున్నారని రాహుల్ అన్నారు. రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నలంద వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని బిహార్‌లో ప్రారంభిస్తామన్నారు. ఇండియా కూటమిని ఎన్నుకుంటే రాష్ట్రంలో రైతులు, కార్మికులు, దళితులు, బలహీనవర్గాలకు



బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి చేపల వేటలో రాహుల్

మిగతా 2లో..

# ఆపరేషన్ సిందూర్‌తో షాకిచ్చాం

- ‘జంగల్‌రాజ్’ను బిహార్ ప్రజలు మర్చిపోలేదు
- ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారు
- చొరబాటుదారులను తరిమికొట్టాలి
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- కాంగ్రెస్, ఆర్‌జేడీపై విమర్శల వర్షం




**పట్నా(జనంసాక్షి):**‘ఆపరేషన్ సిందూర్’ షాక్ నుంచి పాకిస్థాన్, కాంగ్రెస్‌లు ఇంకా కోలుకోలేకపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ ఆపరేషన్ సమయంలో దాయాది దేశంలో ఉగ్రస్థావరాలపై బాంబులు పడుతుంటే.. ఇక్కడ కాంగ్రెస్ రాజకుటుం బం నిద్రలేని రాత్రులు గడిపిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆరాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ‘జంగల్‌రాజ్’ను బిహార్ ప్రజలు మర్చిపోలేదని, ఆ నేతలు చరిత్రలోనే అత్యంత దారుణమైన ఓటమిని చవిచూడబోతున్నారని చెప్పారు.“ఆర్జేడీకి అనుకూలంగా సీఎం అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ అనుకోలేదు. తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించేందుకు హస్తం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా లేదు. కానీ.. కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి మరీ ఆర్జేడీ ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారు. మహా కుంభమేళాను ఇరు పార్టీల నేతలు అవమానించారు. ఓ కాంగ్రెస్ నేత ఛఠ్ పూజను అపహాస్యం చేశారు.

మిగతా 2లో..

# మమ్మల్ని నిరంతరం ఘర్షణల్లో ఉంచాలనేది భారత్ ప్రణాళిక

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలు



**ఇస్లామాబాద్(జనంసాక్షి):**భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలు చేసింది. అఫ్గాన్‌తో ఘర్షణల నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌పై నిందలు మోపారు. ఘర్షణలతో తమను బిజీగా ఉంచాలనే వ్యూహాలను భారత్ అనుసరిస్తోందని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆరోపించారు. అఫ్గాన్‌తో ఘర్షణల విషయంపై ఖవాజా పదే పదే భారత్‌పై నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. అఫ్గాన్‌తో తాజా ఘర్షణలు ఆపేందుకు ఖతార్, తుర్కియే చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉన్నాయని ఖవాజా అన్నారు. అయితే, తూర్పు, పశ్చిమ సరిహద్దుల ఘర్షణల్లో తాము నిమగ్నమయ్యేలా భారత్ ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. అఫ్గాన్ ఘర్షణలు, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థాన్ మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ కాలం నుంచి భారత్ తమపై పరోక్ష యుద్ధం చేస్తోందని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. అవసరమైతే వాటిని బయటపెడతామన్నారు. ఇంతకు ముందు కూడా భారత్ తరఫున అఫ్గాన్ పరోక్ష యుద్ధం చేస్తోందంటూ ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తమ దేశంలో అఫ్గాన్ వాసులు అక్రమంగా ఉండటాన్ని పాక్ అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తిందని ఆసిఫ్ పేర్కొన్నారు. అఫ్గాన్ నుంచి ఏదైనా

మిగతా 9లో..

# హింసను సహించే ప్రసక్తే లేదు

## బిహార్ ఘటనపై ఈసీ స్పందన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటీవల జన్ సురాజ్ కార్యకర్త హత్యకు గురైన ఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. హింసను సహించేది లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనాలని బిహార్ ఓటర్లకు విజ్ఞప్తి చేసింది.“బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలను సహించే ప్రసక్తే లేదు.

మిగతా 2లో..

# ఓట్ల కోసం బెదిరింపులా!

- దమ్ముంటే సన్నబియ్యం పథకం ఆపి చూడండి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాజపాను విమర్శించి మజ్లిస్ ఓట్లు పొందాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వెయ్యకపోతే సన్నబియ్యం రద్దవుతాయని ప్రజలను సీఎం బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి బెదిరింపు రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సన్న బియ్యం పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందని,

మిగతా 2లో..

# కులగణనతో దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ

మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్(జనంసాక్షి):**కుల గణన నిర్వహించి దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు చట్టపరంగా ముందుకు వెళ్తున్నామన్నారు. బలహీనవర్గాలన్నీ ఐక్యంగా పోరాడి దీనిని సాధించుకోవాలన్నారు. మూసాపేటలోని మెజెస్టిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన మున్నూరు కాపు, కాపుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు కాపు, మున్నూరు

మిగతా 2లో..

## ప్రపంచం ముంగిట

# పెను సవాళ్లు

**అనిశ్చితులను ఎదుర్కొనేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి**

**ట్రంప్ ఎప్పుడేం చేస్తారో ఆయనకే తెలియదు: ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భవిష్యత్తులో ఎదురయ్యే అనిశ్చితులు, భద్రతా సవాళ్లను ఎదుర్కొనేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని.. పాత సమస్యలు పరిష్కరించుకునేలోపే కొత్తవి వస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాల మధ్య.. ఏ సమయం లో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ రోజు ఏం చేస్తున్నారు.. రేపు ఏం చేయబోతున్నారు..? అనే విషయం ఆయనకు కూడా తెలియకపోవచ్చని ద్వివేది వ్యాఖ్యానించారు. పాల్పడినట్లు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం అయ్యాయని అన్నారు. ఇలాంటి సమస్యలను సమర్థవం తంగా ఎదుర్కోవాలంటే సైన్యం ఆయుధపరంగానే

మిగతా 9లో..

# ఢిల్లీ తల్లడిల్లి..



- కాలుష్య వలయంలో దేశ రాజధాని
- ఆందోళన వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ
- తక్షణ చర్యలు చేపట్టాలంటూ ప్రధాని మోదీ, ఢిల్లీ సీఎంకు వినతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. కొన్ని రోజులుగా అనేక ప్రాంతాల్లో వాయు నాణ్యత పడిపోతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీ సీఎం రేఖా గుప్తాను ట్యాగ్ చేస్తూ పోస్టు పెట్టారు. బిహార్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం ఢిల్లీకి తిరిగి వచ్చిన ప్రియాంక.. దేశ రాజధానిలో కాలుష్య పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా.. నాయకులందరూ కలిసి దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ భయంకర పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకునే ఏ చర్యలకైనా మద్దతు ఇవ్వాలని

మిగతా 9లో..

# కులగణనతో దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ



కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కోకాపేటలో మున్నూరు కాపు భవనని ర్మాణం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా పొన్నం హామీ ఇచ్చారు.మరోవైపు యూసు ఫ్‌గూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ ఇన్‌ఛార్జి, ముఖ్య నేతలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. యూసుఫ్‌గూడా డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని, ఇంటింటికీ ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతి 100 ఓటర్లకు ఒక ఇన్‌ఛార్జిని ఏర్పాటు చేసి..వాళ్లంతా ఓటు వేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

# హింసను సహించే ప్రసక్తే లేదు




శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లందరికీ అవకాశం లభిస్తుంది. శాంతి భద్రతల నడుమ పోలింగ్ జరుగుతుంది" అని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. కాన్పూర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్నికల యంత్రాంగం సంసిద్ధతపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్లు, ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు, భద్రతా సిబ్బంది మొత్తం సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

**విదేశీ రాయబారులు పరిశీలన..**

దేశంలో ఎన్నికల ప్రక్రియ, భాజపా ఎన్నికల ప్రచారం తీరును పరిశీలించేందుకు పలు దేశాలకు చెందిన రాయబారుల బృందం బిహార్‌లో పర్యటిస్తోంది. జపాన్, బ్రిటన్, ఇండోనేసియా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, భూటాన్, దక్షిణాఫ్రికా దేశాల రాయబారులు ఈ బృందంలో ఉన్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవడంతోపాటు సీనియర్ పార్టీ నేతలు, ఓటర్లతోనూ భేటీ అవనున్నట్లు సమాచారం.గతంలో గుజరాత్, హిమాచ్ ప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల సమయాల్లోనూ విదేశీ రాయబారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో సందర్శించాయి. ఇదిలాఉంటే, బిహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలకు గాను రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తొలిదశ నవంబర్ 6, రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుంది.

# 'బాహుబలి' సక్సెస్

ఈ ప్రయోగం ఉద్దేశం. ప్రధానంగా నౌకాదళ అవసరాల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. దీన్ని జీశాట్-7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్-7 స్థానంలో ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. సీఎంఎస్-03లో స్వర, డేటా, వీడియో కమ్యూనికేషన్ల ను రహస్యంగా, భద్రంగా సాగేందుకు ఎక్స్ టెండెడ్ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి. విదేశీ సమాచార సేవలపై ఆధారపడటాన్ని ఈ ఉపగ్రహం తగ్గిస్తుంది. యుద్ధనౌకలు, విమానాలు, తీరప్రాంతంలోని స్థావరాల మధ్య భద్రమైన సమాచార లింక్‌లకు మార్గం సుగమం చేస్తుంది. టెలికం సంధానత పెరుగుతుంది. మెరుగైన, అధికసామర్థ్యం కలిగిన బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తుంది. మారుమూల ప్రాంతాలకు డిజిటల్ సేవల లభ్యత పెరుగుతుంది. వ్యూహాత్మక అవసరాలతోపాటు పౌర సంస్థలకూ ప్రయోజనం కలుగుతుంది. శత్రుసేనలు మన కమ్యూనికేషన్‌ను జామ్ చేసేందుకు ప్రయత్నిస్తే ఈ ఉపగ్రహం అడ్డుకుంటుంది. ఇది భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగర జలాల్లో సేవలు అందిస్తుంది.

**'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతం.. నిర్ణీత కక్ష్యలోకి భారీ ఉపగ్రహం**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైంది. 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక ద్వారా ఈ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఈ మేరకు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటన చేశారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహం బరువు 4,410 కిలోలు. భారత భూభాగం నుంచి స్వదేశీ రాకెట్ ద్వారా ఈ కక్ష్యలోకి ప్రయోగించిన శాటిలైట్లన్నింటిలోకీ ఇదే అత్యంత బరువైనది."సీఎంఎస్-03 ప్రయోగం విజయవంతం కావడం ఆనందంగా ఉంది. ఇందులో కీలకపాత్ర పోషించిన అందరికీ అభినందనలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది. శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది" అని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళం కోసం దీన్ని రూపొందించారు. సాగర జలాల్లో మోహరించిన మన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, భూ నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఈ శాటిలైట్ తోడ్పాటు అందిస్తుంది. భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగరజలాల్లో సేవలు అందించగలదు.

# మోదీ కార్పొరేట్ ఏజెంట్



అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. భారత్-పాక్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ.. ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోదీకి లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు వంటి నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చేవేనన్నారు. కానీ తాము మాత్రం చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలపై మేడిన్ బిహార్ అనే ముద్రను చూడాలనుకుం టున్నామన్నారు.

**చెరువులోకి దిగి.. రాహుల్ గాంధీ చేపల వేట**

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే బెగుసరాయ్ జిల్లాలో ఆయన మత్స్యకారులతో కలిసి చేపల వేట నిర్వహించారు. దీనికి సంబంధించిన దృశ్యాలను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీతో కలిసి రాహుల్ గాంధీ బోటు సాయంతో ఓ చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలోనే చేపలు పట్టేందుకుగానూ ముకేశ్ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు.ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చినట్లు వెల్లడించింది.

# ఓట్ల కోసం బెదిరింపులా!



రాష్ట్రం వాటా కిలోకు కేవలం రూ.15 మాత్రమేనని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న ఒకే ఒక్క పథకం 'ఉచిత బస్సు' మాత్రమేనని చెప్పారు."సన్న బియ్యం పథకం కాంగ్రెస్‌ది కాదు. సీఎంకు దమ్ముంటే బియ్యం పథకం ఆపిచూడండి. బియ్యంపై కేజీకి కేంద్రం రూ.42 ఇస్తోంది. రాష్ట్రం వాటా రూ.15 మాత్రమే. సన్న బియ్యం పథకం ఎవరిదో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. దేశవ్యాప్తంగా ఉచిత బియ్యం పథకం అమలు చేస్తున్నాం. సీఎం వ్యాఖ్యలపై భాజపా తరఫున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ఓటు వెయ్యకపోతే పథకం ఆపేస్తామని బెదిరించడం ఎన్నికల నియమావళికి వ్యతిరేకం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## జాతీయ రహదారుల కాంట్రాక్టర్లపై కొరడా


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జాతీయ రహదారులపై ప్రమాదా లు మరణాలను తగ్గించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జాతీయ రహ దారిలోని నిర్దిష్ట ప్రాంతంలో సంవత్సరంలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తే సంబంధిత కాంట్రాక్టర్లకు భారీ జరిమానా విధించాలని రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించే రహదారులకు దీన్ని వర్తింపజేయనున్నట్లు ఓ సీనియర్ అధికారి మీడియాకు వెల్లడించారు.బీవోటీ విధానంలో నిర్మించే హైవేలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్ల దేనని, వారే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి బీఓటీ పత్రాన్ని సవరించామన్నారు. "నిర్దిష్ట ప్రాంతం.. 500 మీటర్ల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టరుకు రూ.25లక్షల జరిమానా విధిస్తాము. మరుసటి ఏడాది ప్రమాదం జరిగితే ఇది రూ.50లక్షలకు పెరుగుతుంది" అని చెప్పారు. హైవే మంత్రిత్వశాఖ పరిధిలో ఇటువంటి ప్రమాద ముప్పు ఉన్న 3500 ప్రాంతాలు ఉన్నాయన్నారు.

## ఎస్ఎల్‌బీసీ పునప్రారంభానికి కసరత్తు

**హైదరాబాద్(జనంసాక్షి):**శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులు తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోంది. సోమవారం నుంచి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఎయిర్ బోర్న్ సర్వే ప్రారంభించనున్నట్లు నీటిపారు దలశాఖ అధికారులు తెలిపారు. ఎన్జీఆర్ఐ ఆధ్వర్యంలో హెలికాప్టర్ ద్వారా.. సొరంగం తవ్వాల్సిన మిగిలిన 9 కిలోమీటర్ల మేర సర్వే చేపట్టనున్నారు. ఎయిర్ బోర్న్ సర్వేతో భూగర్భంలో పరిస్థితిని అధ్యయనం చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమా ర్‌రెడ్డి సర్వేను పర్యవేక్షించనున్నారు.ఇన్‌లెట్ 14వ కి.మీ. వద్ద షియర్ జోన్ (లూస్ సాయిల్) వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ప్రమాదకర జోన్లు సొరంగం తవ్వే ప్రాంతంలో ఇంకా ఎక్కడైనా ఉన్నాయా? ఇతర భూభౌతిక పరిస్థితులు ఎలా ఉన్నాయి? నీటి ప్రవాహాలు, ఇతర భూ పొరలు ఎలా ఉన్నాయో? అధ్యయనం చేయనున్నారు.

## రసాయన పరిశ్రమలో మంటలు

**పటాన్‌చెరు(జనంసాక్షి):**హైదరాబాద్‌లోని పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఆదివారం సా యంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుం ది. రూప రసాయన పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో పరిశ్రమలో కార్మికులు లేరని తెలుస్తోంది. పటాన్‌చెరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

### రహదారుల జలమయం.. వాహనదారుల ఇబ్బందులు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, జీడిమెట్ల, లింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారుల జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

## హెజ్‌బొల్లాకు మరో ఎదురు దెబ్బ

**జెరూసలేం(జనంసాక్షి):** హెజ్‌బొల్లా హమాస్‌లపై ఇజ్రాయెల్ జరుపుతున్న భీకర దాడులతో పశ్చిమాసియా రగులుతూనే ఉంది. ఇప్పటికే ఈ మిలిటెంట్ సంస్థల అగ్రనేతలను ఐడీఎఫ్ మట్టుబెట్టింది.ఈక్రమంలోనే హెజ్‌బొల్లాకు చెందిన రద్వాన్ ఫోర్స్‌పై ఐడీఎఫ్ దాడికి దిగింది. ఈ దాడిలో రద్వాన్ ఫోర్స్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో ఒకరు హెజ్‌బొల్లాకు ఆయుధాల సరఫరా, ఉగ్రవాద మౌలిక సదుపాయాల పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించినట్టు ఐడీఎఫ్ వెల్లడించింది.ఈ దాడి శనివారం రాత్రి రమాన్ ప్రాంతంలో జరిగినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ఉత్తర కమాండ్ ఆధ్వర్యంలో వైమానిక దళాలు ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. రద్వాన్ ఫోర్స్ ఉగ్రవాదుల్ని మట్టుబెట్టాయి.

# మన అతివలు.. జగజ్జేతలు

అద్భుతమైన త్రోతో తజ్మిన్ రనౌట్‌గా వెనుదిరిగింది. అనంతరం వచ్చిన అన్నెకె బోష్‌ను శ్రీ చరణి బోల్తా కొట్టించింది. 62 పరుగుల వద్ద ఎల్బీగా వికెట్ల ముందు దొరకబుచ్చు కుంది. దీంతో దక్షిణాఫ్రికా స్వల్ప తేడాతో రెండు వికెట్లు కోల్పోవడంతో ఒత్తిడిలోకి వెళ్లింది. అయితే సునె లూస్‌తో జట్టు కట్టిన వోల్వార్ట్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. ఈ క్రమంలో 114 పరుగుల వద్ద షెఫాలీ బౌలింగ్‌లో సునె (25: 31 బంతుల్లో 4 ఫోర్లు) ఔటైయింది. స్వల్ప తేడాతో మారిజానె కాప్ (4)ను సైతం షెఫాలీ వర్మ ఔట్ చేసింది. 23వ ఓవర్ తొలి బంతికి రిచా ఘోష్‌కు క్యాచ్ ఇచ్చి కాప్ వెనుదిరిగింది. దీంతో ఆ జట్టు కష్టాల్లోకి జారుకుంది. ఆ తర్వాత వచ్చిన సినాలో జఫ్తా (16) దీప్తి బౌలింగ్‌లో ఔటైంది. దీంతో ఆ జట్టు 148 పరుగులకు సగం వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలోకి జారుకుంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అన్నెరి (35: 37 ఒక ఫోర్, 2 సిక్సులు) దూకుడుగా ఆడింది. లారా, అన్నెరి కలిసి ఆరో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో 39.3 ఓవర్ల వద్ద దీప్తి బౌలింగ్‌లో అన్నెరి బౌల్డ్ అయింది. మరోవైపు 96 బంతుల్లో కెప్టెన్ లారా శతకం చేసింది. అనంతరం వోల్వార్ట్ దీప్తి బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో దక్షిణాఫ్రికా ఓటమి ఖరారైంది. అనంతరం మరో 26 పరుగులు చేసి సౌతాఫ్రికా చివరి మూడు వికెట్లు కోల్పోయి 246 పరుగులకు ఆలౌటైంది.

### దశాబ్దాల కలను భారత మహిళల జట్టు నెరవేర్చుకుంది

**దృఢ సంకల్పాన్ని ప్రదర్శించి టైటిల్ నెగ్గారు: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):భారత మహిళల జట్టుకు హృదయపూర్వక అభినందనలు. దక్షిణాఫ్రికాతో ఉద్విగ్నంగా సాగిన ఫైనల్‌లో భారత అమ్మాయిలు ఎంతో బలం, ధైర్యం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించి టైటిల్ నెగ్గారు. భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత నాయకత్వంతో జట్టును ముందుకు నడిపించింది. దశాబ్దాల కలను భారత మహిళల జట్టు నెరవేర్చుకుంది. ఈ చిరకాల విజయం పట్ల భారత్ గర్విస్తోంది. ఫైనల్‌లో భారత ఆటగాళ్ల పోరాటపటిమ ఔత్సాహిక క్రీడాకారులకు ఒక మార్గనిర్దేశం కానుంది. ఇదే ఉత్సాహం, ఐక్యత, ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులో భారత మహిళల జట్టు మరింత ఉన్నతస్థానాలను అధిరోహిస్తుందని ఆశిస్తున్నా.

### 'ఉమెన్ ఇన్ బ్లూ' చరిత్ర సృష్టించింది

**- రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎంతో గర్వకారణమైన క్షణం ఇది. 'ఉమెన్ ఇన్ బ్లూ' చరిత్ర సృష్టించింది. అద్భుతమైన విజయంతో కోట్లాది హృదయాలను తాకారు. మీ తెగువ, పోరాటం భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టాయి. కోట్లాది అమ్మాయిల్లో ఈ విజయం స్ఫూర్తినిస్తుంది. వారు ధైర్యంగా కలలు కనేలా చేశారు. మీరు కేవలం ట్రోఫీని మాత్రమే పొందలేదు జాతీయ స్ఫూర్తిని రగిల్చారు.

**ఈ విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తి**

**మహిళల గెలుపుపై ప్రధాని మోదీ హర్షం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):మోదీ మాట్లాడుతూ ఫైనల్‌లో గొప్ప నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ఆటగాళ్లు ప్రదర్శన చేశారు. టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారు. భారత క్రీడాకారులకు అభినందనలు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆగి ఉన్న ఓ ట్రక్కును ఢీకొన్న టెంపో ట్రావెలర్ ఘటనలో 15 మంది మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు**

**జైపూర్(జనంసాక్షి):**రాజస్థాన్‌లోని ఫలోదీలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న ఓ ట్రక్కును టెంపో ట్రావెలర్ ఢీకొన్న ఘటనలో 15 మంది మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జోధ్‌పుర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.బాధితులు బికనేర్‌లోని కొలాయత్ ఆలయాన్ని సందర్శించి జోధ్‌పుర్‌కు తిరిగి వస్తుండగా.. భారత్ మాలా హైవేపై మతోడా గ్రామం వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను జోధ్‌పుర్‌లోని సూర్‌సాగర్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు.ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సాయం అందించాలని, క్షతగాత్రులకు చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం అశోక్ గహ్లోత్ సైతం విచారం వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌తో షాకిచ్చాం

ఇకపై ఎవరూ అలా చేసేందుకు ధైర్యం చేయనంతగా వారికి గుణపాఠం నేర్పాలి" "జాతీయ భద్రత, సైన్యానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'ను అమలు చేస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. ఉగ్రవాదులను వారి గడ్డపైనే శిక్షించాలని ప్రతిజ్ఞ చేశాం. 'ఆపరేషన్ సిందూర్' రూపంలో దాన్ని నెరవేర్చాం. పొరుగు దేశంలోని ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నప్పుడు.. కాంగ్రెస్ రాజకుటుంబానికి నిద్ర కరవైంది. 'ఆపరేషన్ సిందూర్' షాక్ నుంచి పాక్, కాంగ్రెస్‌లు ఇంకా కోలుకోలేదు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**'చొరబాటుదారులను తరిమికొట్టాలి'..**

ఇందిరా గాంధీ హత్య అనంతరం చెలరేగిన హింసను ప్రస్తావిస్తూ.. "1984లో దాదాపు ఇదే సమయంలో దిల్లీలో సిక్కులను ఊచకోత కోశారు. ఈ మారణ హోమం విషయంలో కాంగ్రెస్ ఇంకా క్షమాపణ చెప్పలేదు. దోషులను ప్రోత్సహిస్తోంది" అని ఆరోపిం చారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటరు అధికార్ యాత్ర'ను పరోక్షంగా ఉటంకిస్తూ.. చొరబాటు దారులను కాపాడేందుకే ఈ ర్యాలీ నిర్వహించారని, వారిని తరిమికొట్టాలన్నారు. ఎన్డీయే మేనిఫెస్టోలో నిజా యతీ, దార్శనికత కనిపిస్తోందని, ప్రతిపక్షాల హామీల పత్రం మొత్తం అబద్ధాలతో నిండి ఉందని విమర్శించారు.



# మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే

**జూబ్లీహిల్స్‌లోకాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్పాలి : కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):**రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ భ్రష్టుపట్టించిందని మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రియల్ ఎస్టేట్‌ను నాశ నం చేసిన రేవంత్ సర్కార్.. పథకాలన్నింటినీ బంద్ చేసిందని ఫైరయ్యారు. మహిళలకు రూ.4 వేలు, యువతులకు రూ. 2500, స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ నోటికొచ్చిన హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధి కారంలోకి వచ్చి ఏడు వందల రోజులైనా ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా తులం బంగారం ఇస్తామని చెప్పి.. ఇప్పుడు మెడలో చైన్ కూడా లాగేస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు కేటీఆర్. ఇప్పుడు వరుసగా జరుగుతున్న చేరికల కార్యక్రమంతో.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మెసేజ్ వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. మరో 500 రోజుల్లో ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను మళ్లీ తెచ్చుకొని రాష్ట్రాన్ని బాగుచేసుకుందామని చెప్పారు.ఇక.. ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు కేటీఆర్. బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగిన మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గోపినాథ్‌ను తలుచుకొని మాగంటి సునీత కన్నీళ్లు పెట్టుకుంటే.. దాన్ని కూడా డ్రామా అంటూ కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డ ఆయన.. అలాంటి కాంగ్రెస్‌కు మహిళలు తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు కేటీఆర్.

**పేదలపైనే హైడ్రా ఆగడాలు**

పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయం నినాదంతో హైడ్రా వెళ్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హైడ్రా చర్యలపై తెలంగాణ భవన్‌లో ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో నిర్మాణాలు మాత్రమే కనిపిస్తాయని.. ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం హయాంలో సచివాలయం, టీహబ్, వీహబ్, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించామన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల అన్యాయం జరిగిన వారికి న్యాయం చేస్తాం" అని అన్నారు.

# మెక్సికో సూపర్ మార్కెట్‌లో పేలుడు..

### 23 మంది మృతి.. 11 మందికి గాయాలు




**మెక్సికో(జనంసాక్షి):** ఉత్తర అమెరికాలోని మెక్సికోలో దారుణం చోటుచేసుకుంది. ఇక్కడి ఒక సూపర్ మార్కెట్‌లో జరిగిన పేలుడులో 23 మంది మృతిచెందగా, మరో 11 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు.హెర్మోసిల్లోలోని వాల్డోస్ స్టోర్‌లో పేలుడు సంభవించింది. గాయపడినవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై సోనోరా రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సో డ్యూరాజో ఒక వీడియో సందేశంలో తాము చూసిన బాధితుల్లో చాలా మంది మైనర్లని తెలిపారు. పేలుడుకు గల కారణాన్ని గుర్తించేందుకు, బాధ్యులను పట్టుకునేందుకు దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర, భద్రత, ఆరోగ్య సిబ్బంది నిబద్ధతతో స్పందించి, పరిస్థితిని నియంత్రించి, ప్రాణాలను కాపాడారని తెలిపారు. కాగా మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మృతులకు సంతాపం తెలిపారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే తాను సోనోరా గవర్నర్ అల్ఫోన్సో దురాజోతో సంప్రదింపులు జరిపానని, సహాయక బృందాలను అప్రమత్తం చేయాలని కార్యదర్శి రోసా ఐసెలా రోడ్రిగ్జ్‌ను ఆదేశించానని తెలిపారు.సూపర్ మార్కెట్‌లో పేలుడు జరిగిందా లేదా అనే దానిపై దర్యాప్తు జరుగుతోందని అగ్నిమాపక విభాగం చీఫ్ తెలిపారు. రాష్ట్ర అటార్నీ జనరల్ గుస్తావో సలాస్ మాట్లాడుతూ విషపూరిత వాయువులను పీల్చడం వల్ల మరణాలు సంభవించినట్లు తెలుస్తోందన్నారు. అయితే కొన్ని మీడియా నివేదికల్లో అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని పేర్కొన్నారు. పేలుడుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణం కాగవచ్చని మెక్సికన్ అధికారులు భావిస్తున్నారు. కాగా సోనోరాలోని ప్రాసిక్యూటర్ కార్యాలయం ఒక ప్రకటనలో ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగివుండవచ్చని పేర్కొంది.

# రైలులో కత్తిపోట్లు..

**9 మంది పరిస్థితి విషమం**

**లండన్‌లో చోటు చేసుకున్న దుర్ఘటన**

**యునైటెడ్ కింగ్‌డమ్(జనంసాక్షి):** లండన్‌కు వెళ్తున్న రైలులో చోటుచేసుకున్న సామూహిక కత్తిపోటు దాడులు యునైటెడ్ కింగ్‌డమ్‌ను ఉలిక్కిపడేలా చేశాయి. ఈ దాడిలో మొత్తం 10 మంది ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు అంతర్గత మంత్రి షబానా మహమూద్ ధృవీకరించారు.ఈ రైలు.. డాన్‌కాస్టర్ నుండి లండన్‌లోని రద్దీగా ఉండే కింగ్స్ క్రాస్ స్టేషన్‌కు వెళుతుండగా ఈ దాడి జరిగింది. అలారం మోగిన వెంటనే, కేంబ్రిడ్జ్‌షైర్‌లోని హంటింగ్‌డన్ రైల్వే స్టేషన్‌ను సాయుధ పోలీసులు, పోలీసు కార్లు అంబులెన్స్‌లు చుట్టుముట్టాయి. దీంతో రైలు అక్కడే నిలిచిపోయింది. బ్రిటిష్ ట్రాన్స్‌పోర్ట్ పోలీసులు (బీటీపీ) 'ఎక్స్'లో ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, ఉగ్రవాద నిరోధక విభాగాలు దర్యాప్తు ప్రారంభించాయని తెలిపారు. రైలులో ఉన్న ప్రత్యక్ష సాక్షులు ఈ ఘటన గురించి వివ రించారు. ఒక పొడవైన కత్తిని పట్టుకున్న వ్యక్తిని చూసినట్లు ఒకరు 'టైమ్స్' వార్తాపత్రికకు తెలిపారు.

# సన్నబియ్యం బాగున్నాయ్..!

## సన్నబియ్యం లబ్దిదారులతో ముచ్చటించిన ఎంపీ మల్లు రవి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బోరబండ డివిజన్‌లో రేషన్ షాప్‌ను సందర్శించి కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సన్నబియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులతో ముచ్చటించారు. బోరబండ డివిజన్ ఇంచార్జి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గొప్ప మనసుతో అందిస్తున్న సన్నాబియ్యం చాలా బాగున్నాయ్ అని ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అందించిన దొడ్డు బియ్యం, ముక్క బియ్యం అమ్ముకునే వాళ్ళమని తెలిపినట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సన్నబియ్యంతో కడుపు నిండా అన్నం తింటున్నామని, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని స్థానికులు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తామని మాటిచ్చారు.




# ఎన్నికల సేవలన్నీ ఒకే వేదికపైకి..

## 'ఈసీఐనెట్' పేరుతో ఈసీఐ అప్లికేషన్.. 40కిపైగా యాప్‌లను ఏకీకృతం

## మదర్ ఆప్ ఆల్ అప్లికేషన్‌గా ఈసీఐ నెట్ (ఈసీఐ నెట్)కు ప్రత్యేక గుర్తింపు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశంలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, నిర్వహణ, ఫలితాల వెల్లడి, అభ్యర్థుల వివరాలు, ఓటర్ల నమోదు, సందేహాల నివృత్తి.. ఇలా ఎన్నికల సేవలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉండేలా సరికొత్త డిజిటల్ వేదిక ఈసీఐ- నెట్ మొబైల్ అప్లికేషన్ ను ఇటీవలే భారత ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఇకపై ఎన్నికల సంఘానికి సంబంధించిన వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం పౌరులకు తప్పినట్లైంది.

**40 యాప్‌లతో అనుసంధానం..**

ఎన్నికల సంఘం సమాచారం కోసం ఇప్పటి వరకు ఉపయోగిస్తున్న 40 వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌ల అనుసంధానంతో 'ఈసీఐనెట్'ను ఈసీఐ రూపొందించింది. అఫిడవిట్ పోర్టల్, ఇండియా ఎ వెబ్, రిజల్ట్ వెబ్‌సైట్, ఎలక్షన్ (ఆర్కైవ్), ఈసీఐ స్వీప్, ఈసీఐ వెబ్‌సైట్, ఎలక్షన్ ట్రెండ్స్ , సీ విజిల్ పోర్టల్, ఈఎంఎస్, ఆర్టీఐ పోర్టల్, ఎన్కోర్, మీడియా వోచర్, సువిధ పోర్టల్, అబ్జర్వర్ పోర్టల్, ఎలక్షన్ ప్లానింగ్, ఐఈఎంఎస్,ఏరోనెట్ 2.0, ఓటర్స్ సర్వీస్ పోర్టల్, సర్వీస్ ఓటర్ పోర్టల్, ఈటీపీఎంబీఎస్, ఎన్జీఎస్పీ, ఎలక్టోరల్ సెర్చ్ వెబ్ సైట్లతో పాటు ఎరోనెట్ యాప్, బీఎల్‌వో యాప్, సీవిజల్, డిసైడర్, ఎన్‌కోర్ నోడల్, ఈఎసఎంఎస్, ఇన్వెస్టిగేటర్, కేవైసీ, మానిటర్, అబ్జర్వర్, సాక్ష్యం, సువిధ, ఓటర్ టర్నౌట్ తదితర అప్లికేషన్లన్నీ ఒకే గొడుగు కిందకు ఈసీఐ -నెట్ మొబైల్ అప్లికేషన్ పేరుతో ఈసీఐ తెచ్చింది. ఎన్నికల సేవలకు సంబంధించిన 40కి పైగా యాప్‌లను ఏకీకృతం చేస్తూ ఈసీఐ 'ఈసీఐనెట్' అనే కొత్త డిజిటల్ వేదికను ప్రవేశపెట్టింది. ఇక నుంచి అన్ని సేవలు ఒకే చోట లభ్యం కానున్నాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలతో ప్రారంభమైన ఈ అప్లికేషన్ సేవలు త్వరలోనే అన్ని రాష్ట్రాల్లో అందుబాటులోకి రానుంది. మదర్ ఆప్ ఆల్ అప్లికేషన్ గా ఈసీఐ- నెట్ కు ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఎన్నికల వ్యవస్థలో మరింత పారదర్శకతను పెంపొందించేందుకు అప్లికేషన్ ఎంతగానో దోహదం చేయనుంది.

## ప్రణాళికలు, పాలసీల రూపకల్పనకు..

# క్వాలిటీ సెన్సెస్ డేటా ముఖ్య పాత్ర

### రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హెూళికేరి

### సమగ్ర, క్వాలిటీ సెన్సెస్ డేటా నగరాభివృద్ధికి దోహదం చేస్తుంది

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రణాళికలు, పాలసీల రూపకల్పనకు క్వాలిటీ సెన్సెస్ డేటా ఎంతో ముఖ్యమని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హెూళికేరి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో రామచంద్రపురం డివిజన్-112 పరిధిలో నిర్వహించనున్న సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 ప్రీ టెస్ట్ కార్యక్రమం కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఈ నెల 2 నుంచి 4 వరకూ మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమంను ఆదివారం రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హెూళికేరి ప్రారంభించారు. సెన్సస్ ప్రీ టెస్ట్ డివిజన్-112 పరిధిలో ఈ నెల 10 నుంచి ఈ నెల 30 వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హెూళికేరి ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు, పాలసీ ల రూపకల్పనలో క్వాలిటీ సెన్సెస్ డేటా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అంతటి ప్రాముఖ్యత గల సెన్సస్ కార్యక్రమాన్ని ఖచ్చితత్వంతో గుణాత్మకంగా నిర్వహించాలన్నారు. 2026-27లో దేశంలో ఇంటింటికీ వెళ్లి డేటా సేకరించే ప్రధాన సెన్సస్ కార్యక్రమం ప్రపంచంలో అతిపెద్దదని ఆమె తెలిపారు. విజయవంతం కావాలంటే ఈ ప్రీ టెస్ట్ కార్యక్రమాన్ని అత్యంత జాగ్రత్తగా, క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తే సెన్సస్ ఖచ్చితంగా, నాణ్యతతో పూర్తవుతుందనీ ఆమె పేర్కొన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, జిహెచ్ఎంసి పరిధిలో జరుగుతున్న ఈ సెన్సస్ కుటుంబాల వాస్తవ స్థితిగతులను ప్రతిబింబిస్తే రాబోయే రోజుల్లో రూపొందించే నగర ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రీ టెస్ట్ కార్యకలాపాల లక్ష్యాలు, విధానాలు, సమయపాలన, డేటా సేకరణలో అనుసరించాల్సిన ప్రమాణాలపై చర్చించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు, సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్, సర్కిల్-22 డిప్యూటీ కమిషనర్ , సెన్సస్ చార్జ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రంలో మూడు ఏరియాల్లో ప్రీ టెస్ట్ కార్యక్రమం**

తెలంగాణలో సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 ప్రీ టెస్ట్ కార్యక్రమం మూడు ఏరియాల్లో జరగనుంది. అర్బన్ ఏరియా కు సంబంధించి జీహెచ్ఎంసీ పరిధిలోని రామచంద్రపురం డివిజన్-112లో రూరల్ ఏరియా లకు సంబంధించి తిప్పర్తి (నల్గొండ జిల్లా) , పినపాక ( భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా)లో ప్రీ టెస్ట్ కార్యక్రమం జరగనుంది. నవంబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు జరగనున్న ఈ ప్రీ టెస్ట్ కార్యక్రమంలో అర్బన్ ఏరియా కు సంబంధించి ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్, రూరల్ ఏరియా లకు సంబంధించి సంబంధిత జిల్లా కలెక్టర్లు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఈ ప్రీ టెస్ట్ సెన్సస్ 2026-27 ప్రధాన సెన్సస్‌కు ముందు పరీక్షాత్మక దశగా, సమాచార సేకరణ విధానాల ఖచ్చితత్వాన్ని పెంపొందించడానికి దోహదం చేయనుంది.

# సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి 10 కోట్ల నిధులు

### మంజూరు జిఓ విడుదల



సంగారెడ్డి ప్రతినిధి (జనంసాక్షి) : సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం అభివృద్ధి కోసం 10 కోట్లు నిధులు మంజూరుకు జిఓ విడుదలైంది. క్రీడల అభివృద్ధి కోసం ఇండోర్ స్టేడియంలో సైనాథటిక్ కోర్టులు బాస్కెట్ బాల్ వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబ్బడి,హాండ్ బాల్, అధునాతన హంగులతో ఇండోర్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, లైటింగ్ అథ్లెటిక్ కోర్ట్ వివిధ క్రీడల అభివృద్ధి అంబెద్కర్ స్టేడియంలో జరుగుతుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. అడిగిన వెంటనే 10 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా టెక్స్‌టైల్ పార్కు పనులను చేపట్టాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 2(జనంసాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో వరద నీరు చేరిన పరిస్థితిని పరిశీలించి శాశ్వత పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టర్ టెక్స్ టైల్ వద్ద గల నాలను, రాళ్ళమాటు చెరువు మత్తడిని కలెక్టర్ పరిశీలించారు. టెక్స్టైల్ పార్క్ పరిసరాలను కలెక్టర్ పరిశీలించి వర్షపు నీరు పార్క్ ప్రాంతంలోకి ఎలా ప్రవేశించిందని, దానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాళ్ల మాడు చెరువు, పార్కు కు పై భాగంలో ఉన్న బొల్లి కుంట, సంగెం గ్రామాల నుండి వరద నీరు ప్రవహించి టెక్స టైల్ పార్క్ లో చేరుకున్నదని అధికారులు వివరించారు. పరిశ్రమల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా నాలా రిటేనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టుటకు చర్యలు అధికారులను సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మరల తలెత్తకుండా తగిన శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సంగెం మండలానికి వెళ్లే రహదారిలో గల కల్వర్టును కలెక్టర్ పరిశీలించి కల్వర్టును బలోపేతం చేయుటకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ సునీత, ఆర్ అండ్ డిఈ, డీఈ వేణు, తాహసిల్దారులు రియాజుద్దీన్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# దున్నపోతుకి వినతి

### ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదలకు డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దున్నపోతుకి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతన బకాయిలు విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మొద్దు నిద్ర వీడి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 8500 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున విద్యార్థి లోకాన్ని కదిలించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, జిల్లా సహాయ కార్యదర్శి రజినీకాంత్ నాయకులు అర్జున్ , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌కి మద్దతుగా కృష్ణకాంత్ పార్క్‌లో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించి, ప్రజలతో మాట్లాడి మద్దతు కోరారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్.. వారివెంట బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడతా

### పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్యవైశ్య సంఘం పురానాపూల్, కార్వాన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవన్ కార్వాన్‌లో జరిగిన శ్రీ మ్యాడం గోవిందరాజు గుప్త, కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆర్య వైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని, రాజకీయంగా ఆర్థికంగా ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్యులు అన్ని స్థానాల్లో నిలబడి ఆర్య వైశ్యుల సత్తా చాటాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్య వైశ్యులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. దేశంలో 70% పన్నులు ఆర్య వైశ్యులులే చెల్లిస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పురాణాపూల్ కార్వాన్ అధ్యక్షులు మేడం గోవింద రాజ్ గుప్త, ప్రధాన కార్యదర్శి నీలా నరసింహ గుప్త, కోశాధికారి బచ్చు భాస్కర్ గుప్త అదనపు ప్రధాన కార్యదర్శి అయిత కిషోర్ కుమార్ గుప్త, సహాయ కోశాధికారి పోమ్మయ్యగారి శ్రీకాంత్ గుప్త, గుండా సురేష్ గుప్త, మాజీ అధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్త, మాజీ అధ్యక్షులు యాద శ్రీనివాస్ గుప్త, కమిటీ సభ్యులు ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.





# విశిష్ట విద్యావేత్త డాక్టర్ రమేష్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ అడిషనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కే రమేష్ విద్యారంగానికి చేసిన సేవలు అభినందనీయమని సీనియర్ ఐఏఎస్ అధికారి అధర్ సిన్హా అన్నారు. గుర్రం గూడ క్లబ్ హౌస్‌లో జరిగిన రమేష్ పదవీ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రమేష్ విద్యా రంగానికి సంబంధించి వివిధ పత్రికల్లో అనేక వ్యాసాలు రాశారు అన్నారు. నవోదయ విద్యాలయ సమితి రిటైర్డ్ జాయింట్ కమిషనర్ టిసిఎస్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ రమేష్ మొదటి నుండి దూరదృష్టి గల అధ్యాపకుడన్నారు. సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ ఖమ్మం నవోదయ విద్యాలయ సర్వతోముఖ వికాసానికి కృషి చేయడంతో పాటు విద్యార్థులను రాబోయే తరానికి అనుగుణంగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశాడని గుర్తుచేశారు. అలాగే ఉపాధ్యాయ వర్గం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇగ్నోతో వారికి అనుసంధానం కల్పించి తగిన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. కవి, రచయిత ప్రసాదమూర్తి మాట్లాడుతూ డాక్టర్ కే రమేష్ నిరంతర విద్యార్థి అని అభినందించారు. ప్రముఖ నాయకులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రమేష్ చిన్నతనం నుంచే కష్టపడే స్వభావం కలవాడని విద్యారంగానికి రమేష్ చేసిన సేవల్ని గుర్తించి ప్రభుత్వం ఆయనను ఏదేని ఒక విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా నియమించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రమేష్ రాసిన ఏ లైఫ్ లీవ్‌లైవ్లీ అనే గ్రంథాన్ని ఆయన మనుమరాలు అనన్య ఆవిష్కరించారు. కాగా ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా, రిటైర్డ్ డిసి ఏ. వై రెడ్డి, ఎన్. ఐ .ఓ .ఎస్ రీజనల్ డైరెక్టర్లుగా పనిచేసిన అనిల్ కుమార్, రాజారెడ్డి, పాలెం ప్రిన్సిపాల్ స్వామి, అధ్యాపకులు సురేష్, భారతి, మట్టా రెడ్డిలతో పాటు న్యాయవాది రామచంద్రారెడ్డి, ఆచార్య అంజయ్య ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు విచ్చేసిన అతిధులు డాక్టర్ కె .రమేష్, పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించారు.

# పేదలకు ఒక న్యాయం పెద్దలకు మరొక న్యాయమా?

### గాజుల రామారం 307 సర్వే నెంబర్‌లో అరికపూడి గాంధీ స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



**కుత్బుల్లాపూర్ నవంబర్ 02 (జనంసాక్షి) :** హైడ్రాధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలకు రక్షకులుగా, పేదల భక్ష కులుగా వ్యవహరిస్తున్నారని బి ఆర్ ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైడ్రా అధికారులపై మండిపడ్డారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం సర్వేనెంబర్ 307 ప్రభుత్వ భూమిలో శేలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కబ్జా చేసుకున్న స్థలాన్ని హైడ్రాధికారులు స్వాధీన పరచుకోకపోవడాన్ని నిరసిస్తూ స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి కేపీ వివేకానంద ఆధ్వర్యంలో కబ్జా స్థలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పీకర్ మధుసూదనా చారి,మాజీ మంత్రులు, శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, టిఆర్ఎస్ అధికార ప్రతినిధి కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు,ఎమ్మెల్యే కృష్ణారావు, సునీత లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డిలు హైడ్రా అధికారులకు వ్యతిరేకంగా ఫ్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబ సభ్యులపై 307 సర్వే నెంబర్ లో దాదాపు 11 ఎకరాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నిర్మాణాలకు కూల్చివేతలలో పేదలపై చూపిస్తున్న ప్రతాపం పెద్దలపై చూపించక పోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. హైడ్రాధికారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసిన బడా బాబులకు అండగా నిలుస్తుందని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఆరికపూడి గాంధీ 1100 కోట్ల విలువగల ప్రభుత్వ భూములను తన ఖజానాలో వేసుకున్నాడని వారు దుయ్యబట్టారు. ఎమ్మెల్యే గాంధీ కబ్జా చేసుకున్న 11 ఎకరాలను వెంటనే స్వాధీన పరుచుకుని పేద ప్రజలకు పంచి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ,శేర్లింగంపల్లి, కూకట్పల్లి కార్పొరేటర్లు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాంటీబయోటిక్స్‌ను జాగ్రత్తగా వాడాలి

### ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్

### 'బగ్ బస్టర్స్ 5', ఏఎంఆర్ అవేర్నెస్ రన్



**హైదరాబాద్ నవంబర్ 02 (జనంసాక్షి)**

యాంటీబయోటిక్స్‌ను జాగ్రత్తగా వాడాలని, అతిగా వాడటం ప్రమాదకరమని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ తెలిపారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 'బగ్ బస్టర్స్ 5', 'రేస్ ఎగైన్స్ట్ రెసిస్టెన్స్-ఏఎంఆర్ అవేర్నెస్ 4కే ఛాలెంజ్' రన్‌ను బంజారాహిల్స్ దగ్గర ఉన్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కల్లం అంజి రెడ్డి క్యాంపస్ వద్ద ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (న్యూఢిల్లీ)ఇన్చార్జ్, యూనిట్-4, కార్నియా, క్యాటరాక్ట్, రిఫ్రాక్టివ్ సర్జరీ సర్వీసెస్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సెంటర్ ఫర్ ఆప్తాల్మిక్ సైన్సెస్ డాక్టర్ నమ్రతా శర్మ ప్రారంభించారు. డాక్టర్ భూపేష్ బగ్గా ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు వరకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల నిర్వహించిన 'బగ్ బస్టర్స్ 5' కాన్ఫరెన్స్ విజయవంతంగా జరిగింది. ఈ కాన్ఫరెన్స్లో దేశీ, విదేశీ నిపుణులు ప్రత్యక్షంగా, వర్చువల్గా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 120 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్లో ఓక్యులర్ ఇమ్యునాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ వంటి అంశాలపై పలు పేపర్లు, సెషన్లు ప్రవేశపెట్టబడ్డాయి. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ ను విచక్షణ లేకుండా వాడటం సరికాదన్నారు. ఇది మన ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుందన్నారు.

యాంటీబయోటిక్స్ ను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తీసుకోవద్ద న్నారు. మాగ్నా సెంటర్స్ ఫర్ ఒబెసిటీ, డయాబెటిస్, ఎండోక్రినాలజీ (హైదరా బాద్) పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ అతిగా వాడటం వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ ఉత్పత్తి అవుతుందన్నారు. అతిగా మందులు వాడితే అవసరమైనప్పుడు ఆ మందులు ప్రభావం చూపవన్నారు. ఫలితంగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జలుబు, దగ్గు, వైరస్, ఇతర బాక్టీరియల్ కాని వ్యాధులకు యాంటీబయోటిక్స్ వాడరాదన్నారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల అసోసియేట్ డైరెక్టర్, సూపర్ హీరోస్ అగైనెస్ట్ సూపర్ బగ్స్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ పొన్నారి గొట్టిపాటి మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు, సిజేరియన్ డెలివరీ వంటి అత్యవసర చికిత్సల సమయంలో ఇన్ఫెక్షన్లను నియంత్రించడంలో యాంటీ బయోటిక్స్ కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అయితే, ఇవి అతిగా వాడటం వల్ల ఈ అద్భుత ఔషధాలు తన ప్రభావాన్ని కోల్పోతున్నాయని తెలిపారు.

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో కార్నియా, యాంటీరియర్ సెగ్మెంట్ విభాగంలో కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్టా పని చేస్తున్న డాక్టర్ భూపేష్ బగ్గా అంతర్జాతీయ లాభాపేక్ష లేని వైద్య-విజ్ఞాన సంస్థ ఓక్యులర్ మైక్రోబయాలజీ అండ్ ఇమ్యునాలజీ గ్రూప్ (ఓఎంఐజీ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గ్రూప్లో కంటి సంబంధిత జీవాణువులు (బగ్స్), వాటి చికిత్సపై పరిశోధనలు చేసే ప్రపంచవ్యాప్త నిపుణులు, వైద్యులు, శాస్త్రవేత్తలు సభ్యులు గా ఉన్నారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల డైరెక్టర్ ఎమెరిటస్, ల్యాబొరేటరి సర్వీసెస్ డాక్టర్ సావిత్రి శర పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాష్ట్ర రెఫరెండమా?

తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. నవంబర్ 11న జరగబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక ఇప్పుడు కేవలం ఒక నియోజకవర్గపు ఎన్నిక కాదుబీ అది రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో ఒక రాజకీయ సంకేతంగా మారింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపాలన చేపట్టినప్పటి నుంచి, ప్రభుత్వానికి ఇది మొదటి ప్రజా పరీక్షగా మారింది. కాబట్టి ఈ ఉపఎన్నికను చాలా మంది పరిశీలకులు "రెఫరెండం" అంటే ప్రభుత్వ పనితీరు మీద ప్రజల తీర్పు ౹గా భావిస్తున్నారు.

జూబ్లీహిల్స్ అనే పేరుకి తగినట్లుగానే ఇది హైదరాబాద్ నగరపు ప్రతిష్ఠాత్మక నియోజకవర్గం. ఇక్కడ మధ్యతరగతి, ఉన్నత తరగతి ఓటర్లే ఎక్కువ. కొత్త తెలంగాణలో ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలకు ప్రతీకగా నిలిచిన ఈ ప్రాంతం రాష్ట్ర ఆర్థిక దిశను, అభిప్రాయ ధోరణిని ప్రతిబింబించే ప్రాంతం. అందువల్ల ఈ ఉపఎన్నిక ఫలితం కేవలం స్థానిక అభ్యర్థుల పట్ల కాకుండా, మొత్తం తెలంగాణ రాజకీయ దిశను సూచించే సూచికగా పరిగణించబడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కోసం ప్రజల మొదటి పరీక్ష: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివిధ రంగాల్లో చురుకుదనం చూపడానికి ప్రయత్నించింది. ప్రజా రవాణా, విద్య, ఉద్యోగ నియామకాలు, రైతు రుణమాఫీ, మహిళల కోసం చెల్లింపులు వంటి అనేక వాగ్దానాలు చేసింది. కానీ ఆ వాగ్దానాల అమలులో ఆలస్యం, పాలనలో నిబంధనలపరమైన తడబాట్లు, నిరసనలు, సిబ్బంది బదిలీల చుట్టూ వచ్చిన వివాదాలు ఇవన్నీ ఈ మధ్యలో ప్రభుత్వానికి విమర్శల వర్షాన్ని తెచ్చాయి.

కాంగ్రెస్ నాయకులు మాత్రం ఈ ఉపఎన్నికను "ప్రజా మద్దతు యొక్క ధృవపత్రం"గా చూస్తున్నారు. "ప్రజలు ఇంకా రేవంత్ పాలనకు అవకాశం ఇస్తారు, అభివృద్ధి దిశలో ముందుకు వెళ్తాం" అని కాంగ్రెస్ శిబిరం నమ్ముతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వ్యక్తిగతంగా ప్రచారంలో పాల్గొని ఈ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆయన ప్రచారం కేంద్ర బిందువుగా "గత పది సంవత్సరాల అవినీతి యుగానికి ముగింపు ఇచ్చింది కాంగ్రెస్" అనే భావనను ప్రజల్లో బలంగా నాటే ప్రయత్నం చేశారు.

అయితే, ప్రజలు ఈ ఎన్నికను వాస్తవానికి ప్రభుత్వం చేసిన పనుల ఆధారంగా కాకుండా, ప్రతిపక్షాల పట్ల ఉన్న విసుగు లేదా ఆసక్తి ఆధారంగా తీర్పు ఇవ్వవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**బీజేపీకి ఇది ప్రతిష్ఠా :**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి జూబ్లీహిల్స్ ఒక ప్రత్యేక సవాల్. 2023 ఎన్నికల్లో నగరంలోని పలు నియోజకవర్గాల్లో బీజేపీకి మంచి ఓటు శాతం వచ్చింది, కానీ అధికారానికి మాత్రం దూరంగా నిలిచింది. ఈసారి జూబ్లీహిల్స్ ఉపఎన్నికను వారు "రాష్ట్ర రాజకీయ పునరాగమనం"గా ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్వేల్‌లో జరిగిన సమావేశంలో "ఇది కేవలం ఒక నియోజకవర్గపు పోటీ కాదు, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రజల తీర్పు" అని ప్రకటించారు. "ప్రజలు ఇప్పుడు మళ్లీ బీజేపీ వైపు చూస్తున్నారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధిని రాష్ట్రం అడ్డుకుంటోంది" అనే నినాదంతో వారు ప్రచార్షన్ని ముమ్మరం చేశారు. బీజేపీ వ్యూహం స్పష్టంగా ఉంది ౹ జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వం చేస్తున్న పనులను రాష్ట్ర ప్రజల మనసులో గుర్తు చేస్తూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని "వాగ్దానాల సర్కార్"గా చూపడం. బీఆర్ఎస్ – మునుపటి ఆధిపత్యం కోల్పోతుందా?

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని పార్టీకి ఈ ఎన్నిక "పునరుజ్జీవన యత్నం"గా మారింది. గత ఎన్నికల్లో ఎదురైన భారీ ఓటమి తర్వాత పార్టీకి ఉత్సాహం తగ్గింది. కానీ ఈ ఉపఎన్నికను వారు మళ్లీ శక్తిని కూడగట్టుకునే అవకాశంగా చూస్తున్నారు. కేటీఆర్ బహిరంగ సభల్లో మాట్లాడుతూ "జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల రెఫరెండం అవుతుంది" అని అన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ప్రజలు కాంగ్రెస్ పాలనలో నిరాశకు గురవుతున్నారు, రాష్ట్రం నిధుల కొరతతో బాధపడుతోంది, పథకాలు నిలిచిపోయాయి కాబట్టి ఈ ఉపఎన్నిక ద్వారా ప్రజలు ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలి. బీఆర్ఎస్ వ్యూహం కూడా ప్రత్యేకం.




వారు కాంగ్రెస్‌ను ప్రజా వాగ్దానాల అమలులో విఫలమైందని చూపుతూనే, బీజేపీపై కూడా "మోసం చేస్తున్న జాతీయ పార్టీ"గా దాడి చేస్తున్నారు. ఈ విధంగా రెండు పార్టీల మధ్య తమ స్థానాన్ని పునరుద్ధరించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

**ఐఎంఐఎం - గణితాన్ని మార్చే మౌనశక్తి:**

హైదరాబాద్ రాజకీయాల్లో మజ్లిస్ పార్టీ ప్రాముఖ్యత ఎప్పుడూ ఉంటుంది. ఈసారి వారు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని మద్దతు ఇవ్వాలని ప్రకటించారు. అధికారికంగా తమ అభ్యర్థిని నిలబెట్టకపోవడం ద్వారా వారు ఓటు విభజనను నివారించే వ్యూహాన్ని అవలంబించారు. ఈ నిర్ణయం వల్ల బీజేపీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది, ఎందుకంటే ముస్లిం ఓటు కాంగ్రెస్ వైపు మరింత బలపడవచ్చు. అదేవిధంగా మద్దతు నగరంలో కాంగ్రెస్‌కు ఒక ప్రతీకాత్మక బలం ఇస్తుంది. అయితే అదే సమయంలో, బీజేపీ దీనిని "సౌకర్య రాజకీయం"గా చూపిస్తూ విమర్శిస్తోంది.

**ప్రజాభిప్రాయం - ఓటర్ల మౌనస్వరూపం:**

జూబ్లీహిల్స్ ఓటర్లు సాధారణంగా చదువుకున్న, ఆర్థికంగా బలమైన వర్గం. వారిలో చాలా మంది పార్టీ రేఖలకు అతీతంగా ఆలోచిస్తారు. వారికి మౌలిక సదుపాయాలు, రోడ్లు, ట్రాఫిక్, నీరు, పన్నులు వంటి అంశాలే ముఖ్యమవుతాయి. అందువల్ల ఈ ఉపఎన్నికలో స్థానిక అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. కాని ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రాజకీయ వేడెక్కిన వాతావరణం కారణంగా, చాలా మంది ఈ ఎన్నికను ప్రభుత్వం మీద ఒక మినీ ప్రజాభిప్రాయ సేకరణ గా చూస్తున్నారు.

ఓటర్లు ప్రశ్నిస్తున్నారు ౹ రేవంత్ ప్రభుత్వం వాగ్దానాలు నెరవేర్చిందా? రైతు రుణమాఫీ ఎక్కడుంది? మహిళలకు ఇచ్చిన హామీలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? ఈ ప్రశ్నలు ఎన్నికలో తారసపడే ప్రధాన అంశాలు.

**రాజకీయ సూచనలు - భవిష్యత్తు దిశ**

- ఈ ఉపఎన్నిక ఫలితం ఏదైనా రాగలదు, కానీ దాని ప్రతిధ్వని మొత్తం రాష్ట్ర రాజకీయ పటంలో వినిపిస్తుంది.
- కాంగ్రెస్ విజయం సాధిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరింత ధైర్యంతో ముందుకు సాగుతుంది. అది వారికి రానున్న ఎన్నికలు, తదుపరి లోక్‌సభ పోరులో బలాన్ని ఇస్తుంది.
- బీజేపీ గెలిస్తే, అది కేవలం ఒక సీటు గెలుపు కాదుబీ అది రేవంత్ పాలనకు ఒక గట్టి హెచ్చరికగా మారుతుంది.
- బీఆర్ఎస్ గెలిస్తే, మాజీ సీఎం కేసీఆర్‌కు ఇది మళ్లీ ప్రజల మధ్య ప్రవేశించే ద్వారం అవుతుంది. ఈ కారణాల వల్లే రాజకీయ విశ్లేషకులు అంటున్నారు "జూబ్లీహిల్స్ ఉపఎన్నిక చిన్నదైనా, దాని ప్రభావం పెద్దది."
- రాష్ట్ర ప్రజాస్వామ్యం యొక్క బలాన్ని పరీక్షించే క్షణం ఇది. ప్రజలు ఏ పార్టీకి ఓటు వేసినా, ఆ ఓటు ఒక సంకేతాన్ని ఇస్తుంది ౹ పాలన పట్ల సంతృప్తి ఉందా, లేక అసంతృప్తి ఉందా అనే సంకేతం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో తెలంగాణ రాజకీయ దిశ ఏవైపు తిరుగుతుందో వచ్చే వారాల్లో స్పష్టమవుతుంది. ఈ ఎన్నిక కేవలం ఒక నియోజకవర్గపు తీర్పు కాదు, అది ప్రజల మనసులోని రాజకీయ స్పందనకు ప్రతిబింబం. అందువల్లే ఇది నిజమైన అర్థంలో "రెఫరెండం" అని చెప్పవచ్చు రేవంత్ ప్రభుత్వంపై ప్రజల తొలి తీర్పు, భవిష్యత్తు రాజకీయ సమీకరణాల తొలి సంకేతం.

**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం.**

# "మత మౌఢ్యం లౌకికతకు" గొడ్డలిపెట్టు



శాస్త్రం, సాంకేతికత ఎంత పెరిగినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాలలో విజృంభిస్తున్నా... మన దేశ ప్రజల్లో మత మౌఢ్యం వీడటం లేదు. భారత్‌లో రాజకీయ పార్టీలు దీనికి ప్రత్యక్షంగా , పరోక్షంగా కూడా దోహదం చేస్తున్నాయి. లౌకిక రాజ్యంలో సైంటిఫిక్ టెంపర్‌ను పెంచాల్సిన విద్యావ్యవస్థలో నానాటికీ మత భావాలు విస్తరిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ (బీజేపీ) మద్దతుతో ఇది జరుగుతోంది. ఇది జాతీయ సమైక్యతకు గొడ్డలి పెట్టు లాంటిది. ఈ విషయాన్ని ఉదాహరణలతో విశ్లేషించి చూస్తే స్పష్టమవుతుంది. భారత రాజ్యాంగం విస్పష్టంగా లౌకికతను ప్రకటించింది. ఆర్టికల్ 25-28 మత స్వేచ్ఛను ఇస్తుంది. కానీ రాజకీయాలు మతాన్ని ఓటు బ్యాంకుగా మార్చాయి. బీజేపీ హిందుత్వ ఎజెండాను నడిపిస్తోంది. రామ మందిర నిర్మాణం దానికి ఉదాహరణ. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత దేశాన్ని చీల్చింది. 2024లో మందిర ప్రారంభం మత రాజకీయాలను మరింత బలపరిచింది. ఇది శాస్త్రీయ దృక్పథాన్ని అణచివేస్తోంది.

విద్యావ్యవస్థలో మత భావాలు చొరబడుతున్నాయి. (ఎన్.సీ.ఈ.ఆర్.టీ.) పాఠ్యపుస్తకాల్లో సైతం మార్పులు జరిగాయి. "డార్విన్ ఎవల్యూషన్ థియరీని" తొలగించారు. 2023లో 10వ తరగతి పాఠ్య పుస్తకం నుంచి దీన్ని తీసేశారు. బదులుగా పురాణ కథలను చేర్చారు. "వేద కాలం ఆధునిక సాంకేతికతలను" కలిగి ఉందని పసిపిల్లలకు అసత్యాలు పాఠ్య పుస్తకాల ద్వారా స్కూళ్ల లో చెబుతున్నారు. "ఆధునిక విమానాలు, ప్లాస్టిక్ సర్జరీలు" వేదాల్లో ఉన్నాయని ప్రచారం. ఇది మిథాలజీని సైన్స్‌గా చూపిస్తోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన స్థానంలో అశాస్త్రీయ భావాలు చోటు చేసుకొంటున్నాయి.

ఉన్నత విద్యలో కూడా మత ప్రభావం. ఐఐటీలు, ఐఐఎం లు లౌకికంగా ఉండాలి. కానీ యోగా, వేద మంత్రాలు తప్పనిసరి అవుతున్నాయి. 2016 లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజీసీ) యోగాను ప్రోత్సహించింది. ఇప్పుడు హిందూ ఆచారాలు క్యాంపస్‌ల్లో విస్తరిస్తున్నాయి. ఇది మైనారిటీ విద్యార్థులను అసౌకర్యపరుస్తోంది. ముస్లిం, క్రిస్టియన్ విద్యార్థులు వివక్షకు గురవుతున్నారు. జాతీయ సమైక్యత దెబ్బతింటోంది.

**రాజకీయ పార్టీలు మతాన్ని ఉపయోగిస్తున్నాయి :**

బీజేపీ గో-రక్షకులను ప్రోత్సహిస్తోంది. గోమాంసం ఆరోపణలపై మతపరమైన మూక దాడి హత్యలు (లించింగ్‌లు) జరుగుతున్నాయి. 2015 నుంచి 50కి పైగా లించింగ్ సంఘటనలు దేశంలో చోటుచేసుకున్నాయి. అఖ్లాఖ్ హత్య ఉదాహరణ. ఇది మత మౌఢ్యాన్ని పెంచుతోంది. శాస్త్రం గోమాంసం ఆరోగ్యంపై చర్చిస్తుంది. కానీ మత ఆధారంగా హింస జరుగుతోంది. ఇది లౌకికతను దెబ్బతీస్తోంది.

కాంగ్రెస్ కూడా గతంలో మత రాజకీయాలు చేసింది. ఇప్పుడు బీజేపీ ని అవే కారణాలతో విమర్శిస్తుంది. అందుకే ఆ పార్టీ కి విశ్వసనీయత లేదు. ఉదాహరణకు 1984 సిఖ్ వ్యతిరేక దాడులు దాని ఫలితం. షా బానో కేసులో ముస్లిం స్త్రీల హక్కులను త్యాగం చేసింది. మత వోటు బ్యాంకు కోసం చట్టం మార్చింది. ఇప్పుడు బీజేపీ హిందూ వోట్ల కోసం చేస్తోంది. రెండూ ఒకటే. మత మౌఢ్యాన్ని పెంచటంలో రెండూ ఒకటే.

**జాతీయ విద్యా విధానం-2020లో మార్పులు :**

జాతీయ విద్యా విధానం 2020. నూతన విద్యా విధానంలో సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహిస్తానని స్పష్టంగా చెప్పింది. కానీ ఆచరణలో మాత్రం మత గ్రంథాలు చేర్చబడుతున్నాయి. భగవద్గీతను పాఠ్యాంశంగా చేయాలని ప్రతిపాదనలు వచ్చాయి. హర్యానా, గుజరాత్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రస్తుతం ఇది అమలవుతోంది. ఇది "హిందూ మతాన్ని జాతీయ మతం" గా చూపిస్తోంది. మైనారిటీలు అసహనంగా ఫీలవుతున్నారు. దీనితో జాతీయ సమైక్యతకు హాని కలుగుతుంది.

**సైంటిఫిక్ టెంపర్ అంటే ఏమిటి?**

రాజ్యాంగం ఆర్టికల్ 51ఏ(హెచ్)లో చెప్పింది. శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి. కానీ ప్రభుత్వం జ్యోతిష్యాన్ని ప్రోత్సహిస్తోంది. విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య కోర్సులు. 2001లో యూజీసీ దీన్ని అనుమతించింది. ఇప్పుడు మరిన్ని కాలేజీలలో ప్రవేశపెడుతున్నారు. ఇది మూఢనమ్మకాలను పెంచుతోంది. "కోవిడ్" సమయంలో "గోమూత్రం మందు" గా విస్తృతంగా ప్రచారం జరిగింది. శాస్త్రవేత్తలు దీనిని ఖండించారు. కానీ ప్రభుత్వ మద్దతు దీనికి ఉంది.

**మత మౌఢ్యం జాతీయ సమైక్యతను దెబ్బతీస్తోంది:**

కాశ్మీర్ ఆర్టికల్ 370 ని, రద్దు చేసిన తర్వాత మత ధ్రువీకరణ పెరిగింది. ముస్లిం వ్యతిరేక ద్వేషం పెరిగింది."సీఏఏ", "ఎన్.ఆర్.సీ" . చట్టాలు మత ఆధారంగా పౌరసత్వం. ఇది ముస్లింలను రెండో తరగతి పౌరులుగా చేస్తోంది. దేశంలో అశాంతి పెరిగింది. 2020 ఢిల్లీ అల్లర్లు ఇందుకు ఉదాహరణ. 50 మంది పౌరులు మరణించారు.

విద్యావ్యవస్థలో మత ప్రభావం విద్యార్థులను చీలుస్తోంది. స్కూళ్లలో సరస్వతి పూజలు, గణేష్ ఉత్సవాలు. ముస్లిం పిల్లలు పాల్గొనకపోతే వివక్ష. ఉత్తరప్రదేశ్‌లో మదరసాలపై ఆంక్షలు. కానీ హిందూ గురుకులాలు స్వేచ్ఛ. ఇది అసమానతను పెంచుతోంది. దానితో జాతీయ సమైక్యతా భావం బలహీన పడుతోంది.

**రాజకీయ పార్టీలు మతాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి.:**

ఎన్నికల్లో మందిర్-మసీదు చర్చలు. 2019 ఎన్నికల్లో రామ మందిర హామీ. 2024లో కాశీ, మథురా ప్రస్తావన. ఇది మత ఉద్రిక్తతలను పెంచుతోంది. శాస్త్రీయ అభివృద్ధి నిర్లక్ష్యం. అంతరిక్ష (ఇస్రో) విజయాలు ఎన్నో సాధించినా దేశంలో మత మౌఢ్యం అంతకు మించి పెరుగుతోంది.

విశ్లేషణాత్మకంగా చూస్తే వివిధ రాజకీయ పార్టీల నాయకులు మతాన్ని ఒక సాధనంగా ఉపయోగించి అధికార లబ్ధిని పొందుతున్నారు. ప్రజలు ఈ మత మూఢనమ్మకాల్లో చిక్కుకుంటున్నారు. విద్యావ్యవస్థ శాస్త్రీయంగా మారాలి. మత గ్రంథాలకు బదులు ఆధునిక సైన్స్. డార్విన్, న్యూటన్ థియరీలు తప్పనిసరి చేయాలి.

విమర్శనాత్మకంగా చూస్తే ఇది కేంద్ర ప్రభుత్వం యొక్క స్పష్టమైన వైఫల్యంగా కనిపిస్తుంది. లౌకిక రాజ్యంలో మత ప్రభావాన్ని అనుమతించకూడదు. (ఎన్.సీ.ఈ.ఆర్.టీ) పాఠ్య పుస్తకాలలో చేసిన అశాస్త్రీయ,అసంబద్ధ మార్పులను వెంటనే రద్దు చేయాలి. జ్యోతిష్య కోర్సులను తక్షణం నిషేధించాలి. రాజకీయ పార్టీలు మత ఎజెండాను పూర్తిగా వదిలేయాలి. లేకపోతే దేశం అనేక మతాలుగా, ప్రాంతాలుగా, వ్యక్తులుగా చీలిపోతుంది.

ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. అయోధ్య తర్వాత కాశీ గ్యాన్‌వాపి మసీదు వివాదం. కోర్టు సర్వేలు మత ఉద్రిక్తతలు. మథురా షాహీ ఈద్గా కేసు. ఇవి జాతీయ సమైక్యతకు ముప్పు. విద్యలో కొన్ని చోట్ల సూర్య నమస్కారాలు తప్పనిసరి చేయటం. ముస్లిం విద్యార్థులు అభ్యంతరం చెప్పటం. ఇది బహుళ సాంస్కృతిక వైవిధ్యం ఉన్న దేశానికి విరుద్ధం.

మరో ఉదాహరణ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం లో మహిళల ప్రవేశం. మత సంప్రదాయాలు – రాజ్యాంగ హక్కుల మధ్య లింగ సమానత్వం హక్కు, మత స్వేచ్ఛ సమస్య. సుప్రీం కోర్టు అనుమతించింది. కానీ బీజేపీ ప్రజల్లో మత భావాలను రెచ్చగొట్టింది. ఇది మత మౌఢ్యాన్ని చూపిస్తోంది. ఇందులో శాస్త్రీయ టెంపర్ కనిపించదు.

మత మౌఢ్యం ఆర్థిక అభివృద్ధికి అడ్డు. మూఢనమ్మకాలు పెట్టుబడులను తగ్గిస్తాయి. మత కల్లోలాలు,అల్లర్లు చోటుచేసుకుంటే విదేశీ కంపెనీలు భారత్ కు రావాలీ అంటే భయపడతాయి. మతపరంగా ఒక వర్గం మరో మైనార్టీ వర్గంపై మూక దాడులు (లించింగ్) జరుగుతే , భారత దేశ ప్రతిష్ట, ఇమేజ్ అంతర్జాతీయంగా దెబ్బతీస్తాయి. దేశంలో ప్రజల మధ్య శాంతి యుత సహజీవనం,సఖ్యత, జాతీయ సమైక్యత లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదు.

దీనికి పరిష్కారం ఏమిటి?

విద్యావ్యవస్థను లౌకికీకరించాలి. శాస్త్రీయ ఆలోచనలు తప్పనిసరి చేయాలి. మతం అనేది భారత ప్రజలు వ్యక్తి గత హక్కు. అది కుటుంబ జీవితానికి పరిమితం అయినది. ఇతర మత విషయాల్లో జోక్యం చేసుకోరాదు. ఇష్టం అయిన మతాన్ని అనుసరించవచ్చు. శాంతి యుతంగా ప్రచారం చేసుకోవచ్చు. ఏ మతంతో సంబంధం లేకుండా నాస్తికులు ఉండే హక్కును భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించింది. రాజ్యానికి, ప్రభుత్వానికి ప్రజల మత విషయాలలో జోక్యం చేసుకో రాదు. మతం పౌరులు ఇండివిడ్యుల్ రైట్,(ఛాయిస్) రాజకీయాలు మతరహితం కావాలి. ప్రజల అపోహలు తొలగించి ప్రజలందరి మధ్య సమ భావం,సమ దృష్టితో ఐక్యంగా ఉండేలా చూడాలి. మీడియా మత మౌఢ్యాన్ని ఖండించాలి. లేకపోతే భారత్ వెనక్కి వెళ్తుంది.

చివరిగా, శాస్త్రీయ జ్ఞానం ప్రపంచం అంతటా పురోగమిస్తున్నా మన భారత దేశంలో మత మౌఢ్యం పెరుగుతోంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వ మద్దతు వీటికి దొరకటం శోచనీయం. విద్యావ్యవస్థలో మత భావాలను చొప్పించే మార్పు, చేర్పులు అనవసరం. జాతీయ సమైక్యతను దేశ ప్రజలు, ప్రభుత్వాలు కాపాడాలి. ప్రజలందరి మధ్య ఎలాంటి బేధం భావం లేకుండా సమ భావంతో వారిలో లౌకిక భావాలు, సైంటిఫిక్ టెంపర్ ను పెంచితేనే దేశం బలపడుతుంది. అన్ని రంగాల్లో పురోగతిని సాధిస్తుంది.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# ప్రకృతితో సామరస్యంగా ఉంటేనే సుస్థిరాభివృద్ధి

**(03 నవంబర్ : "అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం")**

జీవుల ఉనికి ఉన్న భూమి ఉపరితలం, పైన ఉన్న గాలి, భూమి లోపలి భాగాలు కలిగిన భూభాగ ప్రాంతాన్ని "జీవావరణం లేదా బయోస్ఫియర్" అని పిలుస్తాం. నేలపై ఉన్న మట్టి, జలం, గాలి కలిసిన పొర కలిగిన ప్రదేశంలో జీవులు మనుగడ సాగిస్తాయి. సూక్ష్మ జీవుల నుంచి అతి పెద్ద జంతువులు, వృక్షాల వరకు అనేక రకాల జీవరాసులు కలిగిన ప్రదేశమే జీవావరణంగా పేర్కొనబడుతుంది. అతి ముఖ్యమైన వనరులకు జీవావరణం ఆలవాలంగా నిలుస్తున్నది. జీవావరణం ద్వారా ఆహారం, ఔషధాలు, నిర్మాణ వస్తువులు, ఇంధనాలు లభిస్తాయి. ఒక్క ఉప్పు తప్ప మిగిలిన అన్ని రకాల ఆహార పదార్థాలు జీవావరణం నుంచే లభిస్తాయి. పర్యావరణంలో జీవావరణం(బయోస్ఫియర్)తో పాటు జలావరణం (హైడ్రోస్ఫియర్), శిలావరణం(లిథోస్ఫియర్), వాతావరణం(అట్మాస్ఫియర్) అనబడే నాలుగు విభాగాలు ఉంటాయి.

**అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం-2025 ఇతివృత్తం:**

యునెస్కో చొరవతో 2022లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 03 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ బయోస్ఫియర్ రిజర్వ్స్)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 ఇతివృత్తంగా "ప్రకృతితో సామరస్యం – సుస్థిరాభివృద్ధి" అను అంశాన్ని తీసుకొని కోల్పోయిన జీవ వైవిధ్యాన్ని పునఃప్రతిష్టాపన చేయడానికి పథక రచన, అమలుకు పానుకోవడం తక్షణ అవసరంగా భావించాలి. జీవ వైవిధ్యానికి నెలవులుగా "జీవావరణ నిల్వలు లేదా బయోస్ఫియర్ రిజర్వ్స్(బిఆర్)" సేవలు అందిస్తున్నాయి. పలు రకాల జంతువులు, వృక్షాలకు చిరునామాలుగా జీవావరణ నిల్వలు పని చేస్తున్నాయి. మానవాళికి ఆర్థిక, సామాజిక సుస్థిరాభివృద్ధితో పాటు అరుదైన జీవరాశులను, అంతరించే దశలో ఉన్న జీవులను కాపాడడానికి జీవావరణ నిల్వలు ఉపకరిస్తున్నాయి. బయోస్ఫియర్ రిజర్వ్స్ ద్వారా అన్ని రకాల జీవజాతుల పరిరక్షణ, భూభాగాలను కాపాడడం, మానవుల కదలికలు, జీవవ్యవస్థలు, పర్యవేక్షణ, శిక్షణలు, విద్య లాంటి ప్రయోజనాలు ఉన్నాయి.

**భారత్‌లో 12 జీవావరణ నిల్వలు:**

ప్రపంచవ్యాప్తంగా 136 దేశాల్లో 759 జీవావరణ నిల్వలతో 74.42 లక్షల చదరపు కిమీ విస్తీర్ణంలో విస్తరించగా ఆయా ప్రాంతాల్లో 275 మిలియన్ల ప్రజలు నివసిస్తున్నారు. ఇండియాలో 60,000 చదరపు కిమీ విస్తీర్ణంలో 18 బయోస్ఫియర్ రిజర్వ్స్ ఉన్నాయి. ఈ 18 జీవావరణ నిల్వల్లో 12 మాత్రమే "మ్యాన్ అండ్ బయోస్ఫియర్ ప్రోగ్రామ్(ఎంఏబి)" అంతర్జాతీయ గుర్తింపును పొందాయి. వీటిలో ముఖ్యమైనవి నిలగిరి ప్రాంత రిజర్వ్స్, గల్ఫ్ ఆఫ్ మున్నార్, సుందర్‌బన్, నందా దేవి, నొక్రెక్, పచ్‌మర్హి, సిమిలిపాల్, అతనక్మార్, గ్రేట్ నికోబార్, అగస్త్యమాల, కంచన్ జోంగా, పన్నా అనబడే 12 ఉన్నాయి. జీవావరణ నిల్వలతో జీవ వైవిధ్యం/జీవ వ్యవస్థలు కాపాడబడడం, సాంస్కృతిక వారసత్వం కాపాడడం, సమాజ సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వడం, స్థానిక ప్రజల జీవనశైలిని మెరుగుపరుచుకోవడం, అంతర్జాతీయ యంత్రాగం ఏర్పాటు చేయడం, శాస్త్రీయ పరిశోధనలు చేయడం, వాతావరణ సానుకూల మార్పులు, పర్యవేక్షణ, విద్య, శిక్షణ లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. జీవావరణ నిల్వల్లో కోర్ ఏరియా, బఫర్ జోన్, ట్రాన్సిషన్ ఏరియా అను మూడు భాగాలు ఉన్నాయి.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

**సుడులదారులు**

నీతి పాలన
అందరి అభిమతం
ఆశల తోట
కథాభూషణం
సత్యహరిశ్చంద్రుడు
నిత్యస్మరణం
న్యాయ పాలన
గంతలు లేని రాజ్యం
ధర్మపతాకం
చెమట కష్టం
పొట్టకూటికి యద్ధం
నిజసంపద

**రేడియమ్**
**9291527757**


# వెనుకబడిన వర్గాలకే ఓటేయండి

బీహారులో సుపరిపాలన అని చెప్పుకోవడమే తప్ప గత పదకొండేళ్ళుగా నడుస్తోంది దుష్టపాలన మాత్రమే, వీళ్ళు చెప్పేది అబద్దాలు, చేసేది మోసాలు, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటారు, అదానీ అంబానీల అభివృద్ధి కోసం పనిచేస్తారు, రాజ్యాంగాన్ని నమ్మరు, దేశ స్వతంత్ర పోరాటం లో వీళ్ళెక్కడా లేరు, ఈ భారత వ్యతిరేక శక్తులు దేశంలోని మూలవాసులైన యస్సీయస్టీ ఓబీసీ మైనారిటీలపై పెత్తనం చెలాయించడానికి మాయమాటల తో మోసగిస్తున్నారు. ఈ దుష్టశక్తులకు ఓటేయవద్దు, వెనుకబడిన వర్గాల నేతలకు ఓటేయండి, వెనుకబడిన వర్గాల రాజ్యాధికారమే మన ప్రగతి వికాసాలకు గ్యారంటీ అన్నారు జస్టిస్ ఈశ్వరయ్య.

బీహారులోని పాట్నాలో నవంబర్ 1వ తేదీన జరిగిన పత్రికాసమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ మనువాదుల ప్రభుత్వం అనేక అబద్దాలు చెప్పిందని, అనేక గ్యారంటీలు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం చేసిన మోసాల చిట్టా విప్పడానికే తాను బీహారు వచ్చానని అన్నారు. మోదీ పేదకుటుంబాలను ఆదుకుంటానని చెప్పిన మాట ఏమయ్యిందని ప్రశ్నించారు. బీహారులో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, దేశంలో ఎక్కడా లేని దైన్యం ఇక్కడే తాండవిస్తుందని, దీనికి కారణం ఎన్డీయే ప్రభుత్వమేనని విమర్శించారు. గత ఎన్నికల్లో బీహారుకు లక్ష కోట్లు ఇస్తామని మోడీ చెప్పారు. ఎంత ఇచ్చారు? అంతా మోసమే అన్నారు

బీహారు నుంచి శ్రామికులు వివిధ రాష్ట్రాలకు వెళ్ళి పొట్టపోసుకుంటున్నారని, బీహారు శ్రామికులు కష్టజీవులు, నిజాయితీపరులు, నైపుణ్యం కలిగిన వారు, వారికి బీహారులో పని దొరికితే దూరాన ఉన్న తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎందుకు వలస వెళతారని ప్రశ్నించారు.

మోడీ సర్కారు మధ్యతరగతి ప్రజలను మభ్యపెట్టి వారి ఓట్లు కొల్లగొట్టి వారిని మోసగించిందని అన్నారు. మహిళా సాధికారత గురించి మాయ మాటలు చెప్పారని, కాని అత్యాచారాలు లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని వేలెత్తి చూపారు. నిరుద్యోగం ఎన్నడు లేనంతగా పెరిగిందని, యువత దిక్కుతోచని స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు లేవు, ఉపాధి లేదు ... ప్రభుత్వం పకోడీలు అమ్ముకోవడం కూడా ఉపాధే అని అపహాస్యం చేస్తుందని ప్రభుత్వ వైఖరిని నిలదీశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ మాటలేమయ్యాయని నిలదీశారు. ప్రతి ఒక్కరి ఖాతాలో పదిహేను లక్షలు జమ చేయిస్తానని మోడీ చెప్పారు. ఏమయ్యింది? ఇలాంటి అబద్దాలు చెప్పి ప్రజలను మోసగించారని, ఈ పదకొండు సంవత్సరాల్లో పేదరికం పెరిగింది, నిరుద్యోగం పెరిగింది, శాంతిభద్రతలు క్షీణించాయి. రైతుల ఆత్మహత్యపెరిగిపోయాయని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేసిందేమీ లేదని, వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి రైతుల నడ్డి విరిచే ప్రయత్నం చేసిందని, రైతులు గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్నారని, రైతు ఆందోళనతో దిగి వచ్చి వ్యవసాయ చట్టాలను



వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. మనువాదుల ప్రభుత్వంలో ఆరెస్సెస్ విధేయులైతే చాలు పదవులు దొరుకుతున్నాయని, సిబిఐ, ఇన్కం టాక్స్, విజిలెన్స్, జుడిషియరీ, ఎగ్జిక్యూటివ్ అన్నీ ఆరెస్సెస్ హస్తగతమయ్యేలా చేశారని విమర్శించారు.

ఇరవై సంవత్సరాలుగా నితీష్ కుమార్ బీహారు ముఖ్యమంత్రిగా ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నిస్తూ సుపరిపాలన కాదు ఇది దుష్టపాలన అన్నారు. ప్రభుత్వ స్కూళ్ళలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎలాంటి సదుపాయాలు లభించడం లేదు. అంతా ప్రయివేటు పరం చేసి ప్రజలను జలగల్లా రక్తం పీల్చేస్తున్నారని వివరించారు. దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయినా నాణ్యమైన విద్య పేదలకు అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటు అంటూ, అందుకే రిజర్వేషన్లు అవసరమని, రిజర్వేషన్లు పేదబడుగు వెనుకబడిన వర్గాల హక్కు అని నినదించారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో కుట్ర ఉందన్నారు. ఇది సవర్ణ స్త్రీలకు లభించే రిజర్వేషన్లు మాత్రమేనని, ఇందులో వెనుకబడిన వర్గాల స్త్రీలకు ప్రయోజనమేమీ లేదని చెప్పారు. అందుకే లాలూ ప్రసాద్ యాదవ్ వంటి నేతలు మహిళా రిజర్వేషన్లలో యస్సీ యస్టీ ఓబీసీ వర్గాల మహిళలకు ప్రత్యేక కోటా కావాలని డిమాండ్ చేసి పోరాడారని వివరించారు.

అన్నాహజారే ఆందోళన చేసిన లోక్ పాల్ ఉద్యమం ఏమయ్యిందని ప్రశ్నించారు. లోక్ పాల్ ఇప్పుడు కంటితుడుపు చర్యగా కూడా మిగల్లేదని చెప్పారు. దేశంలో ఉన్నది మోడీ సర్కారు కాదు, ఇది ఆరెస్సెస్ సర్కారు. నాగపూర్ రిమోట్ కంట్రోల్ తో నడిచే సర్కారని విమర్శించారు.

ఈ సర్కారు ప్రజలను మోసగించే సర్కారు. అందుకే బీజేపీ కూటమికి ప్రజలు ఓటేయరాదని చెప్పారు. బీజేపీ కూటమికి ఓటేయడమంటే మన పిల్లల భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవడమే అన్నారు. ప్రజలకు సేవ చేసే వారికి ఓటేయాలని, కే.యస్.పి.యాదవ్ ప్రజాసేవకు నడుం కట్టిన నాయకుడని, యస్సీయస్టీ వెనుకబడిన వర్గాల కోసం పనిచేసే నాయకుడని చెప్పారు. కే.యస్.పీ.యాదవ్ ను గెలిపిస్తే ఇక్కడి నుంచి ఒక మార్పు మొదలవుతుందన్నారు. బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం చేజిక్కే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఆర్జెడీకి ఓటేయడం ద్వారా ఈ దుష్టపాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. నితీష్ కుమార్ ఇక్కడ కులగణన చేయించి తర్వాత మోడీకి మద్దతుగా కేంద్రంలో సపోర్టు ఇచ్చారని విమర్శించారు. బీహారులో నితీష్ కుమార్ కులగణన చేయించినా తర్వాత తమిళనాడు మాదిరిగా చట్టం చేయలేదని వేలెత్తి చూపించారు. కులగణన తర్వాత ప్రయోజనాలు లభించాలంటే అధికరణ 31 సి ప్రకారం చట్టం చేయాలి. షెడ్యూల్ 9 క్రింద చేర్చాలి. తమిళనాడులో ఇలా చేయడం వల్లనే అక్కడ 69 శాతం రిజర్వేషన్లు లభిస్తున్నాయి. కాని నితీష్ కుమార్ 9వ షెడ్యూల్ గురించి నోరిప్పలేదు. తన అధికారం కోసం బీజేపీ చెప్పినట్లు తలూపారని విమర్శించారు. అందువల్ల ఎన్డీయేకు ఓటు వేయడం అంటే బీజేపీని మరింత బలపరచి దోచుకునే వీలు కల్పించడమే అన్నారు.

బీహారులో కూడా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు పెంచి షెడ్యూల్ 9లో చేర్చాలని, తేజస్వీ యాదవ్ ఆ హామీ ఇస్తున్నారని వివరించారు. నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం, ఇంటింటా ఉద్యోగం, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్ లో చేర్చడం వంటి హామీలతో ఆర్జెడీ ముందుకు వచ్చిందని, కాబట్టి బీహారు ప్రజలు వెనుకబడిన వర్గాల మేలు కోరే వారికి, వెనుకబడిన వర్గాల నేతలకు ఓటేయాలని పిలుపునిచ్చారు. యస్సీ, యస్టీ, ఓబీసీ, మైనారిటీ 85 శాతం ఉన్నారని, మన ఓట్లు మన నేతలకు వేసుకుంటే మన రాజ్యం వస్తుంది. మన రాజ్యం వస్తే, మనకు రాజ్యాధికారం లభిస్తే మన రిజర్వేషన్లు మనమే సాధించుకోవచ్చని అన్నారు.

**- జస్టిస్ ఈశ్వరయ్య,**
**మాజీ కార్యనిర్వహక ప్రధాన న్యాయమూర్తి,**
**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, మాజీ చైర్‌పర్సన్,**
**వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్**

# ముగ్గురిని హత్య చేసి తాను ఆత్మహత్య

- తప్పించుకున్న మరో బాలిక
- ఇంట్లో ఉరేసుకుని నిందితుడు ఆత్మహత్య
- కుటుంబ కలహాలే హత్యకు కారణం
- వికారాబాద్ జిల్లాలో ఘటన





**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనం సాక్షి) :** రోజురోజుకు అక్రమ సంబంధం అనుమానం పేను భూతం అవుతుంది. దీంతో మానవ సంబంధాలు మంట కలిసి పోతున్నాయి. వివాహేతర సంబంధ భూతం పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతున్నాయి. పరాయి వ్యక్తుల మోజులో పడి జీవిత భాగస్వాములు ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. ఈ విపరీత పోకడలు కుటుంబంలోని వారిని బలి తీసుకుంటున్నాయి. క్షణిక ఆవేశంతో తన వారిని కడతెరిచే స్థాయికి వెళుతున్నాయి. క్రూరంగా వ్యవహరిస్తూ కట్టుకున్న ఆలీతో సహా కుటుంబ సభ్యులను కడతేర్చి కాటికి పంపుతున్నారు. ఇలాంటి సంఘటన వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో ఆదివారం జరిగింది. కుల్కచర్ల మండల కేంద్రంలో ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. కట్టుకున్న భార్యను కూతురిని వదినను అతి కిరాతకంగా హత్య చేసి నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఈ ఘటనలో మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. పరిగి డిఎస్పి శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్ల గ్రామానికి వేపూరి యాదయ్య (38) అనే వ్యక్తి ఆయన భార్య అలివేలు(32) చిన్న కూతురు శ్రావణి (10) వదిన హనుమమ్మ (40)ను ఆదివారం తెల్లవారుజామున కత్తితో నరికి అతికిరాతకంగా హత్య చేసి తాను ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలియజేశారు. పెద్ద కూతురు అపర్ణను హత్య చేయడానికి ప్రయత్నించడంతో తప్పించుకొని పరారీ అయినట్లు డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. అపర్ణకు స్వల్ప గాయాలయ్యాయని పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలియజేశారు. ఆదివారం తెల్లవారుజామున 100 డయల్ కు ఒక వ్యక్తి ద్వారా సమాచారం వచ్చిందని కుల్కచర్ల గ్రామానికి వెళ్లి చూడగా అప్పటికే నలుగురు వ్యక్తులు విగతగా పడి ఉన్నారని అన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలియజేశారు. గ్రామస్తులు ప్రత్యక్ష సాక్షి యాదయ్య పెద్ద కూతురు అపర్ణ తెలియజేసిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు రోజులుగా యాదయ్య కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని అన్నారు. భార్య అలివేలుపై అనుమానంతో తరచూ వేధిస్తూ యాదయ్య గొడవ చేసేవాడని తెలిసింది. యాదయ్య పోరు భరించలేక అలివేలు గ్రామంలోని ఒక పెద్దాయన దగ్గరకు వెళ్లి తమ గోడు వినిపించింది. భార్య అలివేలు జాడ తెలియకపోవడంతో పెద్ద కూతురు సహాయంతో బంధువుల దగ్గర పొరుగింటి వారి దగ్గర భార్య ఆచూకీ కోసం యాదయ్య పొద్దంతా ప్రయత్నించాడు. కానీ భార్య ఆచూకీ దొరకలేదు. సాయంత్రం ఒక పెద్దాయన నుంచి వాళ్ల ఇంటికి రావాలని యాదయ్యకు ఫోన్ కాల్ వచ్చింది. అక్కడికి వెళ్లి చూడగా భార్య అలివేలు వదిన హనుమమ్మ కనిపించింది. పిలిచిన పెద్దాయన ఇరువురు గొడవ చేసుకోవద్దని సర్ది చెప్పి పంపించాడు. భోజనాలు ముగించుకుని అందరూ ఇంట్లో నిద్రపోయారు. కానీ యాదయ్య ఇంటికి ఆలస్యంగా వచ్చి వదిన హనుమమ్మతో గొడవపడ్డాడు. ఆ గొడవలో తన వెంట తెచ్చుకున్న కొబ్బరి బోండాలు నరికే కత్తితో వదినపై దాడి చేసి నరికి వేశాడు. తర్వాత భార్య అలివేలుపై దాడి చేసి హత్య చేశాడు. వదిన హనుమమ్మ భార్య అలివేలు చనిపోయిన తర్వాత ఇద్దరు పిల్లలను ఎవరు చూస్తారని ముందుగా చిన్న కూతురుపై దాడి చేసి హత్య చేశాడు. పెద్ద కూతురును హత్య చేయడానికి ప్రయత్నిస్తే తీవ్ర భయాందోళనకు గురైన యాదయ్య పెద్ద కూతురు తలుపు చిలుకు తీసుకొని ఇంట్లో నుంచి పారిపోయింది. హత్య చేసిన విషయాన్ని తన కూతురు పోలీసులకు గ్రామస్తులకు తెలియజేస్తే చంపేస్తారని భయంతో ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియగానే పరిగి డిఎస్పి శ్రీనివాస్ గ్రామంలో భారీగా పోలీసులను మోహరించారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఇంట్లో గొడవలు ఉంటే ఒక కుటుంబం పై దాడి చేయాలి కానీ వదిన హనుమమ్మను కూడా హత్య చేయడం పట్ల ఇంకేమైనా కారణాలు ఉన్నాయన్న విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్ని కోణాల నుంచి కేసు దర్యాప్తు చేసి హత్యలకు గల మిస్టరీని చేదిస్తామని పరిగి పోలీసులు తెలియజేశారు.

### హత్య వివరాలు వెల్లడించిన అపర్ణ

కుల్కచర్ల మండలం ట్రిపుల్ మర్డర్ లో సంచలన విషయాలు చెప్పిన హత్య నుండి తప్పించుకున్న పెద్ద కూతురు అపర్ణ అమ్మ నాన్న నిత్యం గొడవ పడేవారని రాత్రి కూడా గొడవ పడ్డారని,పెద్దమ్మ హన్మమ్మ ను సర్ది చెప్పేందుకు అమ్మ అలవేలు ఊరి నుండి పిలిచిందని అపర్ణ తెలిపింది. రాత్రి అందరూ పడుకున్నాక తెల్లవారుజామున మొదట పెద్దమ్మ హన్మమ్మ పై కొడవలితో దాడి చేస్తుండగా అమ్మ అడ్డు పడిందని... దీంతో అమ్మపై కూడా దాడి చేసి ఇద్దరిని హత్య చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తర్వాత క్రూరత్వం లో మానవత్వం గుర్తుకొచ్చిన యాదయ్య తన సొంత పిల్లలపై ప్రేమ నటించినట్టు తెలుస్తోంది. అందరూ చనిపోయక మీరు ఎలా బతుకుతారు అని మొదట చిన్న కూతురు శ్రావణి పై దాడి చేసి హత్య చేశాడని... అనంతరం తనపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఇళ్ళు గడియ తీసి బయటకు పారిపోయి పక్కింటి వారికి హత్యల విషయం చెప్పానని అపర్ణ తెలిపింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారని...చికిత్స కోసం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపింది.

## శ్రీఆదిత్య మూసీ ఆక్రమణలపై సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం



**రాజేంద్రనగర్, నవంబర్ 2 (జనం సాక్షి) :** నార్సింగి మూసీ నది పరీవాహక ప్రాంతంలో శ్రీ ఆదిత్య కేడియ రియల్టర్స్ సంస్థ చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ, "మూసీ నది లోపలే భారీ కట్టడాలు జరుగుతున్నాయి. కానీ హైడ్రా అధికారులు పెద్ద బిల్డర్లపై చర్యలు తీసుకోవడానికి భయపడుతున్నారా? పేదవాళ్లపైనే కఠినంగా వ్యవహరిస్తున్నారా?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం పెద్ద బిల్డర్లకు కొమ్ముకాస్తోందని, అక్రమ నిర్మాణాలపై హైడ్రా నిర్లక్ష్యం నిందార్హమని ఆమె విమర్శించారు. పరిశీలనలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, నవీన్ రెడ్డి, రోహిత్ రెడ్డి, పట్లోళ్ల కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద యువకుడి ప్రాణాలు కాపాడిన ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి

- కిడ్నీ మార్పిడికి సొంత నిధులు



**చౌటుప్పల్, నవంబర్ 2 (జనం సాక్షి) :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడికి అండగా నిలబడి, తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు.చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామానికి చెందిన 26 ఏళ్ల నిరుపేద యువకుడు నెల్లి గణేష్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు.గణేష్‌కు కిడ్నీ మార్పిడి చికిత్స చేయిస్తేనే ప్రాణాలు నిలబడతాయని వైద్యులు తెలిపారు.అయితే, ఈ చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, వ్యవసాయ కూలీలైన గణేష్ తల్లిదండ్రులు అంత మొత్తాన్ని భరించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. దీంతో వారు భగవంతునిపై భారం వేసి కాలం వెళ్లదీస్తున్నారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తుండటంతో, స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. తన సిబ్బందిని ఆసుపత్రికి పంపించి, కిడ్నీ మార్పిడి చికిత్సకు కావలసిన ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు.అంతేకాకుండా, తన సొంత డబ్బు పన్నెండున్నర లక్షల రూపాయలను కామినేని ఆసుపత్రికి చెల్లించి, గణేష్‌కు కిడ్నీ మార్పిడి చికిత్స చేయించారు. చికిత్స అనంతరం రాజ్ గోపాల్ రెడ్డి స్వయంగా కామినేని ఆసుపత్రికి వెళ్లి గణేష్ బాగోగులు తెలుసుకున్నారు. తన కుమారుడికి సొంత ఖర్చులతో కార్పొరేట్ వైద్యం అందించి, పునర్జన్మ ప్రసాదించినందుకు గణేష్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల భయంతో కాంగ్రెస్ దాడులు

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



**మణుగూరు, నవంబర్ 2 (జనం సాక్షి) :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరు అంబేద్కర్ సెంటర్ లో ఆయన మాట్లాడుతూ ఎవరి వద్ద ఆధారాలు ఉన్నా తీసుకురమ్మనండి,"చట్టాల మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. నేనే ఆఫీసు అప్పగించి వెళ్తాను," న్యాయపరంగా తీసుకోండి భౌతిక దాడులతో భయం భ్రాంతులకు గురి చేస్తే ఊరికేనేది లేదని స్పష్టం చేశారు. మణుగూరులో జరిగిన బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు సమన్వయంగా ఉండాలని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని భరోసా కల్పించారు. "టీఆర్ఎస్ (బీఆర్ఎస్) దేశంలోనే అతిపెద్ద పార్టీ. 60 లక్షల మంది సభ్యత్వం కలిగిన ఈ పార్టీని ఇలాంటి దాడులతో ఎవ్వరూ బలహీనపరచలేరు," అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పినపాక నియోజకవర్గానికి వస్తారని వెల్లడించారు. గత నెల రోజులుగా పినపాక నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై తాను సోషల్ మీడియాలో డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహించి ప్రజా సమస్యలను ప్రశ్నించడమే అధికార పార్టీ నాయకులకు నచ్చలేదని, అందుకే కుట్రపూర్వకంగా కార్యాలయంపై దాడి చేశారని పేర్కొన్నారు.తాను కార్యాలయంలో లేని సమయంలో మా కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి, విలువైన ఫర్నిచర్, ల్యాప్‌టాప్‌లు, పార్టీ జెండాలకు పెట్రోల్ పోసి నిప్పు అంటించటంతో సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రేగా తెలిపారు. పినపాక నియోజకవర్గానికి వచ్చిన "100 కోట్ల డిఎంఎఫ్టీ నిధుల వినియోగంపై ప్రశ్నించినందుకే నాపై ఈ దాడులు జరిగాయి. ఈ నిధులు పాలేరు వెళ్తున్నాయా? లేక కొడంగల్‌కి వెళ్తున్నాయా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి," అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు భౌతిక దాడులకే దిగజారడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది. మీరు చేసిన నష్టం వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కతలలో రుద్ర మైసమ్మ తల్లిని కూల్చివేస్తే ఉద్యమమే..

- బజరంగ్దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివరాం



**మోమిన్‌పేట, నవంబర్ 2 (జనం సాక్షి) :** మోమిన్‌పెట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో మాదిగోని గుట్ట ప్రాచీన మైన గుడి చరిత్ర పరిసర ప్రాంత ప్రజలు కార్యకర్తలు హిందూ బంధువులు బజరంగ్దళ్ రాష్ట్ర అధ్యక్షులు శివరాంతో కలసి వచ్చి గుడి చరిత్ర వివరంగా వారికి జరిగిన అన్యాయాలను వివరించారు. సమాజానికి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాదిగోనీ గుట్టలో రుద్ర మైసమ్మతల్లీ చాలా పవిత్రమైన దేవస్థానం కూల్చడం కుట్ర చేస్తే ఇక ఉద్యమమే అని అన్నారు. అభివృద్ధి పేరుతో మైసమ్మ ఆలయాన్ని కూల్చివేస్తామనడం సరైనది కాదని టీజీఐఐసీ అధికారులు కూల్చివేతకు గురి చేస్తే బజరంగదళ్ ఎట్టి పరిస్థితుల్లోనైనా పోరడడానికి సిద్ధంగా ఉన్నాం అని హెచ్చరించారు. 198 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో అనాదిగా మైసమ్మ గుడి ఉందన్నారు. ఇక్కడ కొలువైన మైసమ్మ తల్లిని తరాలుగా కొలుస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి భూమిని రైతులకు కేటాయించడంతో దశాబ్దాలుగా గ్రామ రైతులు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల పారిశ్రామిక అభివృద్ధి కోసం ఈ భూమిని ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంనికి సేకరించి టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. కాగా పరిశ్రమల అభివృద్ధి కోసం పనులు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మైసమ్మ గుడిని తొలగించేందుకు ఐఐసి అధికారులు సిద్ధమయ్యారని అన్నారు. తరాలుగా తాము కొలుస్తున్న అమ్మవారి గుడిని తొలగించడం సరైనది కాదని ఐఐసీ అధికారులకు పనులు నిలిపివేయవలసిందిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా గుడికి కేటాయించిన 11 ఎకరాల భూమిని భూమి పోయిన రైతులకు ప్రతి ఇంట్లో ఒక జాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు కొప్పుల రాజశేఖర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జి శివరాజ్ ప్రధాన కార్యదర్శి మాధవి కార్యదర్శి లక్ష్మయ్య సోషల్ మీడియా ఇన్చార్జి రాఘవేందర్ మీడియా ఇన్చార్జి మోహన్ రెడ్డి విజయలక్ష్మి పట్టణ ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాస్ సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి కొండల్ రెడ్డి శ్రీనివాస్ శ్రీకాంత్ ఎన్కతల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 466 మంది



**శేరిలింగంపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భాగంగా శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు ట్రాఫిక్ విభాగం పోలీసులు కమిషనరేట్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 466 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం...శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భారీగా వాహనదారులు, వ్యక్తులు మద్యం సేవించి పట్టుబడడం జరిగింది. వారాంతపు డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు భారీగా పట్టుబట్టడం జరిగిందని తెలిపారు. మొత్తం 466 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 344 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 15 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా ఏకంగా 104 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతున్న డ్రైవర్లు మరియు ముగ్గురు హెవీ వెహికల్ లను నడిపిస్తున్న డ్రైవరు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పట్టుబడిన వారందరినీ హైకోర్టు లో ప్రవేశపెట్టగా 336 మంది డిడి కేసులను డిస్పోస్ చేయగా ఇందులో 285 మందికి నగదు పెనాల్టీని విధించగా 32 మంది జైలు శిక్షతోపాటు జరిమానా మరియు సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొనడానికి కోర్టు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. పాలు అవ్వడం జరిగిందన్నారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మద్దులపల్లి విద్యార్థిని చరితశ్రీ ఎంపిక



**ఖమ్మం రూరల్, నవంబర్ 2 (జనం సాక్షి) :** ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన మాదరబోయిన చరితశ్రీ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. చరితశ్రీ ఖమ్మం నగరంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతుంది. అండర్-14 బ్యాడ్మింటన్ పోటీల్లో చరితశ్రీ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా చరితశ్రీ ని పాఠశాల ఉపాధ్యాయులు,మిత్రులు,బంధువులు అభినందించారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**సూర్యాపేట, నవంబర్ 2 (జనంసాక్షి) :** వినియోగదారులకు మెరుగైన సేవలను అందించి వారి ఆదరాభిమానాలు పొందాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్ పూల సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్యాపేట మొబైల్స్ అండ్ ఆన్ లైన్ సర్వీసెస్ షాపును నిర్వాహకులు సందనబోయిన మధుకృష్ణ, అబ్దుల్ రియాజ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ సేవలు ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగమయ్యాయని, ఈ తరహా సర్వీస్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు అన్ని రకాల మొబైల్ రిపేరింగ్ సేవలు, ఆన్‌లైన్ ఫెసిలిటీస్ ఒకే చోట అందుబాటులోకి రావడం సంతోషకరమని తెలిపారు. యువత వ్యాపార రంగంలోకి అడుగుపెడుతూ స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.అంజద్ అలీ, నూర్ భాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మీరా,మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ఆకుల లవకుశ, షాప్ నిర్వాహకులు సందనబోయిన మధు, షేక్.అబ్దుల్ రియాజ్, ఆయూబ్ ఖాన్, పందిరి మల్లేష్,లక్ష్మణ్, మురళీ, శ్రీను, చందన్, బిక్షం, వీరయ్య, వెంకన్న, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీనవర్గాల సమగ్ర సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



**శేరిలింగంపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే బిఆర్ఎస్ ప్రభుత్వ అంతిమ లక్ష్యం అని, గత రెండు ప్రభుత్వాల హయామ్ లో ఇది నిరూపితమైందని, భవిష్యత్తులో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు ముఖ్యమంత్రిగా మరో మారు కెసిఆర్ ప్రమాణ స్వీకారం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధివైపు మళ్లి ఇస్తారని భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) నాయకురాలు, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ప్రాంతం నుండి భారీగా నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లి ఆదివారం తెలంగాణ భవన్లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆమె గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నవతారెడ్డి తో పాటు కీలకమైన నాయకులకు కేటీఆర్ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అంతా బిఆర్ఎస్ పార్టీ దేనిని, కొంతమంది అవకాశవాదులు, స్వార్థపరులు కెసిఆర్ ప్రభుత్వం తొలగిపోగానే ఇతర పార్టీలవైపు వెళ్లిపోయారని, అలాంటి వారికి రాజకీయంగా పుట్టగతులు లేకుండా పోతాయని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం శేరిలింగంపల్లిలో నవతారెడ్డి మాట్లాడుతూ 2014, 2018 లో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అందాయని, తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద సొంతిల్లు, ఉపాధి, ఆరోగ్య భద్రతను కలిగి ఉండాలన్న సంకల్పంతో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎన్నో సాహసోపేతమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరచడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రాష్ట్రంలోని పేదవారు సొంత ఇంటికి యజమాని కావాలన్నదే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి రాష్ట్ర పురపాలక శాఖామంత్రి కెటిఆర్ ఎనలేని కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రప్రథమ ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు చేసిన పరిపాలన విధానం యావత్ భారతదేశంలో 'న భూతో... న భవిష్యత్' అన్న చందంగా ఉందని అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రపంచ దేశాల అధినేతలు కొనియాడడం జరిగిందని నవతారెడ్డి గుర్తుచేశారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల అద్భుత పరిపాలనలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలు, అనితరసాధ్యమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ సాధారణ తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ అవకాశవాద రాజకీయాలను పెంచి పోషిస్తుందని, జూబ్లీహిల్స్ ఎన్నిక ద్వారా తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పదలుచుకుందామని నవతారెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటినుండే మరో మారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్, కీలక బాధ్యతలలో కేటీఆర్ పాత్ర కోసం, బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అవిశ్రాంత సైనికులుగా పోరాడనున్నామని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, మహిళలు, నవత రెడ్డి అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యా సంస్థల బంద్‌కు పిడిఎస్‌యు సంపూర్ణ మద్దతు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో 8,500 కోట్ల స్కాలర్షిప్,రీయింబర్స్‌మెంట్ బకాయలను వెంటనే విడుదల చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ అన్నారు. ఈ నెల 3 నుండి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం చేపట్టిన విద్య సంస్థల బంద్ కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది. నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ భగత్ సింగ్ నగర్ భగత్‌సింగ్ భవన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ కళాశాలలు స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ పై ఆధారపడి నడుస్తున్నవే ,అలాంటి కళాశాలలో వేలాది మంది విద్యార్థులు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి విద్యని అభ్యసిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉన్నది.ఇప్పటికీ విద్యార్థులకు రావాల్సిన 8,500 కోట్లు పెండింగ్లో ఉన్నవి నేటికి ప్రభుత్వం విడుదల చేయడం లేదు.అప్పుడు ప్రతిపక్షంలో




ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పెండింగ్ స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే క్లియర్ చేస్తామని చెప్పిన ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు విప్పడం లేదంటే ప్రభుత్వ విద్యపై వారికి ఉన్న స్రవంతి ప్రేమను చూపిస్తున్న పరిస్థితి స్పష్టంగా అర్థం అవుతున్నది. సంవత్సరాల తరబడి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రాక కళాశాలలో మూసి వేసుకునే పరిస్థితికి నెట్టబడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 3 నుండి కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ బంద్ కు పిలుపునిచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించకుండా కళాశాలలపై విసిటింగ్ పేరుతో దాడులకు పూనుకోవడం సరైనది కాదు. నిధులు లేవంటూ లక్షల కోట్ల రూపాయలను పక్కదారి పట్టిస్తూ,విద్య వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ,పైసలు ఉన్నోడు చదువుకోవాలి పైసలు లేనోడు పనిచేసుకోవాలనే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు.తక్షణమే ప్రభుత్వం దిగివచ్చి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి,కళాశాలల యాజమాన్యం కు,పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో (పిడిఎస్‌యు) జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి మహేష్ జిల్లా నాయకులు సురేష్, నాయకులు మైపాల్, మణికంఠ, గురు రాజుతోపాటు తదితదారులు పాల్గొన్నారు.

## మెంతా తుఫాను జాతీయ విపత్తుగా ప్రకటించాలి




**సంగారెడ్డి, నవంబర్ 2 (జనం సాక్షి) :** మెంతా తుఫాను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, జిల్లాలో నష్టపోయిన వరి పత్తి రైతాంగానికి ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారం అందించాలని, బికెఎంయు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.గంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కూరుస్తున్న మెంతు తుఫాన్ వల్ల జిల్లాలోని అనేక మండలాల్లో పత్తి, వరి పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. తడిచిన వరి, పత్తి పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.12 వెలు చెల్లించాలని, అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతాంగానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ తుఫాన్ బీభత్సం వల్ల అనేక గ్రామీణ ప్రాంతంలో ఇల్లు కూలిపోయాయి తినవస్తులు ఆహార పదార్థాలు కొట్టుకుపోయాయి కూలిపోయిన ఇళ్ళను ఇందిరమ్మ పథకం కింద చేర్చి ఇళ్లు నిర్మించాలి ఇవ్వాలి. బాధిత కుటుంబాలకు ఆర పదార్థాలు వస్తువులు ప్రభుత్వం ఉచితంగా అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి సాధిక్‌అలీ, శివలిల, బుజమ్మ, సరస్వతీ, రాజమ్మ, దేవిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు



**మెదక్, నవంబర్ 2 (జనం సాక్షి) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లాలోని నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 18,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వరి ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు. రైతులు పంట తెచ్చిన రోజు రిజిస్టర్లలో ఏ రోజు తెచ్చారు, తెచ్చినప్పుడు ఎంత తేమశాతం ఉంది అనే వివరాలను నమోదు చేసుకుని, సీరియల్ నెంబర్ల వారీగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. బరువు కొల్చే యంత్రాలు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకొని ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ కలెక్టర్‌కు ఘనంగా సన్మానం

**మక్తల్, నవంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో ఎంపికై సూర్యాపేట జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రవితేజకి మక్తల్‌లో ఘన సన్మానం జరిగింది. తమ అమ్మమ్మ గ్రామమైన మక్తల్‌కు వచ్చిన సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ రవితేజతో పాటు ఆయన ఈ స్థాయికి రావడానికి వెన్నుదన్నుగా నిలిచిన వారి అమ్మ అరుణమ్మ, తాతయ్య రిటైర్డ్ ఎస్టబ్ల్యూట రామచంద్రప్ప, కుటుంబ సభ్యులు గుడిగండ్ల నర్సిములును కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్విరాజ్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల నుండి కష్టపడి చదివి ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగిన రవితేజని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్ కోరుకున్న ఆశయాల మార్గంలో సమాజంలోని దళిత, బహుజన, బలహీన, పేద వర్గాల ప్రజల విద్య, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తూ, 'పేదల కలెక్టర్'గా ప్రసిద్ధి చెందిన ఎస్ఆర్. శంకరన్ లా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం డిప్యూటీ కలెక్టర్ రవితేజ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే తనకు స్ఫూర్తి అని, తప్పకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



అంబేద్కర్ సంఘం మక్తల్ ప్రధాన కార్యదర్శి బండారి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గోలపల్లి నారాయణ, కోరి మారెప్ప, కెఎన్పిఎస్ నాయకులు బండారి నర్సప్ప, మల్లేపల్లి రవి, పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి, స్వేరో రవికుమార్, అంబేద్కర్ యువజన సంఘం సహాయ కార్యదర్శి రవి కుమార్, కోశాధికారి త్రిమూర్తి, కార్యవర్గం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర్లకు గుట్టలపై హక్కులు కల్పించాలి

- జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య



**వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) :** వడ్డెరలకు గుట్టలపై హక్కులు కల్పించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య అన్నారు, ఆదివారం మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో వడ్డెర గ్రామ నూతన కమిటీని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నూతనంగా ఎన్నికైన వడ్డెర సంఘం గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం గ్రామంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నో ఏండ్లుగా కులవృత్తి నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న వడ్డెరలను, దేవర్ల గుట్టపై రాయి కొట్టకుండా నిషేధించడంపై మండిపడ్డారు, దేవర్ల గుట్టపై చెట్టు నరకడం, మట్టి తీయడం ఇవేవీ ఈ ఫారెస్ట్ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న వడ్డెర కమ్యూనిటీ హాల్ పనులు మొదలు పెట్టాలని స్థానికులకు సూచించారు. వడ్డెర హక్కుల సాధన కోసం తమ వంతు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు, వడ్డెరుల కులవృత్తికి చేయూతను అందించాలని గుట్టలపై హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మనిగిళ్ళ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్టగిరి వెంకటయ్య, నాయకులు ఈశ్వర్, శేఖర్, గణేష్ చెంద్రయుడు, నూతనగ్రామ అధ్యక్షులు యం. కురుమన్న, ప్రధాన కార్యదర్శి మొగులయ్య, రామకృష్ణ, ఆంజనేయులు, బాలయ్య, యాదయ్య,కురుమయ్య, నాగరాజు, వెంకటేష్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ ఉపసభపతి. యం. పద్మదేవేందర్ రెడ్డి

**మెదక్ ప్రతినిధి, నవంబర్ 2 (జనంసాక్షి) :** ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ ఉపాసభాపతి ఎం పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు.జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా మాజీ ఉపసభాపతి యం. పద్మ దేవేందర్ రెడ్డి, పార్టీ ప్రజా ప్రతినిధులు,శ్రేణులతో కలసి ప్రత్యేక వ్యూహాలతో ప్రచార పర్వాన్ని సాగిస్తున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ..ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తూ ముందుకు వెళ్ళుతున్నారు. ఎర్రగడ్డ డివిజన్ లోని సుల్తాన్ నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఐరన్ షాపులో రజక మహిళలతో మాట్లాడారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులతో పటు మెదక్ నాయకులు అహ్మద్,లింగా రెడ్డి, జుబేర్ అహ్మద్,కుమార్ యాదవ్,రాజ్ కుమార్, నరేష్,రంజిత్ ,లడ్డు తదితరులు ఉన్నారు.

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎర్రగడ్డ డివిజన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇంటింటికీ తిరిగి ఓటర్లకు తెలియజేస్తూ...కారుగుర్తుకు , మాగంటి సునీతకు ఓటు వేయాలని అడిగారు.



## గ్రామగ్రామాన బీసీ ఉద్యమ కమిటీల ఏర్పాటు



**రాజాపూర్, నవంబర్ 2 (జనంసాక్షి) :** బీసీ ఉద్యమ కమిటీ రాజాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి, అగ్రహారం పొట్లపల్లి, కల్లేపల్లి గ్రామాల్లో గ్రామ కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్ రాజ్యాంగ బద్దంగా, చట్టబద్ధంగా విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని అది సాదించే వరకు మాపోరాటం ఆగదని అన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ రావలసిన హక్కు అని అది ప్రభుత్వాలే చట్టబద్ధంగా ఇవ్వాలని బీసీ సంఘాల నాయకులు బీసీ ఉద్యమ సంఘం ద్వారా డిమాండ్ చేశారు. రంగారెడ్డిగూడ గ్రామ అధ్యక్షుడిగా పవన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గా మల్లేష్ యాదవ్, గుండ్లపొట్లపల్లి అధ్యక్షుడిగా బ్రహ్మచారి, ప్ర.కార్యదర్శి శేఖర్, అగ్రహారం పొట్లపల్లి అధ్యక్షుడు శ్రీరాములు, ప్ర.కార్యదర్శి యాదయ్య, కల్లేపల్లి అధ్యక్షుడు రామకృష్ణ, ప్ర.కార్యదర్శి దశరథ్ లను అలాగే పూర్తి కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజాపూర్ మండల బీసీ ఉద్యమ కమిటీ సభ్యులు శ్రీశైలం యాదవ్, నరహరి, కృష్ణయ్య, లక్ష్మయ్య, నర్సింహులు, లింగం, శేఖర్, యాదగిరి గౌడ్, శివప్రసాద్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రేమ్ కుమార్, శ్రీను, ఆంజనేయులు, శంకరయ్య, వెంకటయ్య తదిరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పెద్ద రాములు ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ

**వీపనగండ్ల, నవంబర్ 2 (జనం సాక్షి) :** కామ్రేడ్ పెద్ద రాములు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఆదివారం వీపనగండ్ల మండల కేంద్రంలోని సిపిఎం సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ అమరజీవి పెద్ద రాములు సంస్మరణ సభను నిర్వహించడం జరిగింది.ఈ సభకు మండల కార్యదర్శి డి. బాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి హాజరై మాట్లాడుతూ గ్రామంలో తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించారని, తన జీవిత ప్రస్థానం ఎన్నో దాడులు ఎదుర్కొని సిపిఎం పార్టీని నిర్మాణం చేశారన్నారు.ఈ ప్రాంతంలో కామ్రేడ్ నరసింహ అనేకమంది చేసిన త్యాగాల నుంచే భవిష్యత్తు ఉద్యమ మొలకలు వచ్చాయన్నారు.పెద్ద రాములు ఆశయాల కోసం పునరంకితం కావడమే అందరికీ మార్గం కావాలన్నారు.ప్రజా ఉద్యమాలే గీటురాయిగా ముందుకు సాగాలన్నారు.ఈ సభలో సిపిఎం ఉమ్మడి మాజీ మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి కిల్లే గోపాల్,వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి జబ్బార్, సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,నాగిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఎస్.గోపి మండ్ల రాజు, జిల్లా కమిటీ సభ్యులు మహబూబ్ బాషా, మండ్ల కృష్ణయ్య,బాల్య నాయక్, రమేష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవి ప్రసాద్ గౌడ్,డి. కృష్ణయ్య, జెవివి రాష్ట్ర నాయకులు జితేందర్, కురుమయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆది, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మురళి,గ్రామ నాయకులు సిహెచ్



వెంకటయ్య, అశన్న,ఈశ్వర్,వెంకటేశ్వర్లు గౌడ్,రామకృష్ణ,నవీన్, పార్టీ,ప్రజాసంఘాల నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భూభారతి స్పెషల్ డ్రైవ్‌తో సత్ఫలితాలు

- స్పెషల్ డ్రైవ్ లో వివిధ స్థాయిలలో 2573 దరఖాస్తులు క్లియర్
- 1012 దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనం సాక్షి) :** భూభారతి దరఖాస్తుల పరిష్కారం కోసం చేపట్టిన 10 రోజుల స్పెషల్ డ్రైవ్ తో సత్ఫలితాలు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం పై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించడానికి జిల్లాలో 22 అక్టోబర్ నుండి 01 నవంబర్ వరకు(10) రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గడిచిన 10 రోజుల్లో, తాసిల్దార్ ల



పరిధిలో 183, ఆర్డీవోల పరిధిలో 661 మరియు జిల్లా కలెక్టర్ స్వయంగా 168 ఫైల్స్ క్లియర్ చేసి జిల్లా మొత్తం లో 1012 దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇదే సమయంలో 1424 ఫైల్స్ తాసిల్దార్లు వాళ్ల పరిధిలో విచారణ పూర్తి చేసి ఆర్డిఓ లకు పంపడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా 76 ఫైలు ఆర్డివోలు అడిషనల్ కలెక్టర్కు మరియు 61 ఫైల్లు అడిషనల్ కలెక్టర్ నుండి కలెక్టర్కు వెళ్లడం జరిగిందని తెలిపారు. మొత్తం జిల్లాలో ఈ 10 రోజుల వ్యవధిలో సుమారుగా 1012 దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించడం, అదేవిధంగా 1561 దరఖాస్తులను పై లెవెల్ కి పంపడం ద్వారా, స్పెషల్ డ్రైవ్ లో మొత్తం 2573 ఫైల్స్ వివిధ స్థాయిలలో క్లియర్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, సమస్త రెవెన్యూ సిబ్బందిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు అన్నింటిని సాధ్యమైనంత త్వరగా నిజాయితీగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.

## రైతుల ఇబ్బందులను తీర్చిన జిల్లా పర్యాటక అధికారి కల్వరాల నరసింహా



**వీపనగండ్ల, నవంబర్ 2 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు వెలుగొండ రహదారికి ఇరువైపుల అధిక సంఖ్యలో ముళ్ళకంప చెట్లు ఉండడంతో పొలాలకు వెళ్లే రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు.రైతులు తమ ఇబ్బందులను జిల్లా పర్యటక అధికారి కల్వరాల నరసింహా దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారి వెంటనే తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు.స్పందించిన మంత్రి కంపదారు చెట్లను వెంటనే తొలగించాలని రైతుల ఇబ్బందులను తీర్చాలని నరసింహకు తెలిపారు.మంత్రి ఆదేశాల మేరకు ఆదివారం రహదారి ఇరుపక్కల పెరిగిన ముళ్ళకంప చెట్లను జెసిబి సహాయంతో తొలగించారు. తమ సమస్య పైన స్పందించి వెంటనే సమస్య తీర్చినందుకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు, నరసింహకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కొత్త గొల్ల స్వాములు, అక్కల బాబు గౌడ్, పొచమోని వెంకటయ్య,పొచమోని స్వాములు, రాజు యాదవ్, రంగపురం రాముడు,పెబ్బేటి చిన్న వెంకటయ్య,,చింత దయాకర్, చిక్కేపల్లి వెంకటయ్య, భాస్కర్ గౌడ్, రంగపురం స్వాములు,మండ్ల రాముడు,మధుగని కురుమయ్య పాల్గొన్నారు.

# వరద ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు

**రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బి.రవీంద్ర నాయక్**

**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 2 (జనంసాక్షి):** వరద ప్రభావిత ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్యాధికారులు సిబ్బంది వచ్చేవారం రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి.రవీంద్ర నాయక్ జిల్లా వైద్యాధికాలను ఆదేశించారు. ఆదివారం హనుమకొండ వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఏ అప్పయ్య డాక్టర్ బి సాంబశివరావులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి అక్కడ తీసుకుంటున్న చర్యలు, నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. అమరావతి నగర్ ప్రగతి నగర్లను సందర్శించి అమరావతి నగర్ లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. వడ్డేపల్లి వైద్యాధికారి డాక్టర్ మాలికను గత మూడు రోజులుగా వారి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాలు , నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు , క్యాంపులకు చికిత్స నిమిత్తం ఎలాంటి సమస్యలతో వస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ డిఎంహెచ్ఓ కార్యాలయంలో డిఎంహెచ్వో, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిస్థితిని సమీక్షించిన అనంతరం వచ్చే వారం రోజులపాటు వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని , కలుషిత నీరు కలుషిత ఆహార పదార్థాల వలన అలాగే దోమల వలన వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ఉండాలని, ప్రోగ్రాం అధికారులు క్షేత్రస్థాయిలో గృహ సర్వే, వైద్య శిబిరముల నిర్వహణ, పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమన్వయంగా పని చేయించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య, వరంగల్ డిఎం హెచ్వో డాక్టర్ బి సాంబశివరావు అడిషనల్ డీఎం హెచ్వో డాక్టర్ టి మదన్మోహన్రావు , టీబీనియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తదార్ అహ్మద్ , డాక్టర్ జ్ఞానేశ్వర్,డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డివరం గల్ డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్ కొమురయ్య , డాక్టర్ మోహన్ సింగ్,డాక్టర్ విజయ కుమార్,డాక్టర్ ఉదయరాజ్ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.






# వరద ప్రభావిత బాధితులకు అన్నివిధాల సహకారం





**కమిషనర్‌తో కలిసి వరంగల్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటన**

**వరంగల్ ఎంజీఎం, నవంబర్ 2(జనంసాక్షి):** వరద ప్రభావిత బాధితులకు అన్ని విధాల సహకారం అందిస్తాం అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.ఆదివారం వరంగల్ పరిధిలో వరద ప్రభావానికి గురైన ఎన్టీఆర్ కాలనీ రామన్నపేట సంతోషిమాత కాలనీ ఫేజ్ 1 ,ఫేజ్ 2 గంగ పుత్ర కాలనీ ప్రాంతాలలో పాటు డి ఆర్ నగర్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతాలలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరదల వల్ల నష్టపోయిన గృహాలను గుర్తించి సంబంధిత సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని భారీ వర్షాల వల్ల ఏర్పడిన బురద తో పాటు చెత్త చెదారం తొలగింపు ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశం మేరకు కొనసాగుతున్న అసెస్మెంట్ ను మేయర్ కమిషనర్ ఇరువురు పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు రెవెన్యూ సిబ్బంది జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి అంచనా వేసి వాస్తవ సమాచారాన్ని అందజేయాలని వరంగల్ ప్రాంతంలో 5 జే సిబిలు హన్మకొండ ప్రాంతం లో 6 జేసీబీ లు, ట్రాక్టర్ల సహాయంతో వరద వల్ల ఏర్పడిన బురదను తొలగించడం జరుగుతుందని అన్నారు.హన్మకొండ ప్రాంతం లోని ప్రగతి నగర్ వివేక నగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ వరద ముంపుకు గురైన ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి మాట్లాడుతూ వరద ప్రభావంతో ఏర్పడ్డ బురద వ్యర్థాలను తొలగించడానికి 3 జే సిబిలు హిటాచీ యంత్రాలను వినియోగించి ట్రాక్టర్ ల ద్వారా చెత్తను తొలగిస్తున్నామని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు గోల్కొండ శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి


**వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, ధర్మసాగర్ రిజర్వాయర్ల క్షేత్రస్థాయి సందర్శన**





**వరంగల్ ఎంజీఎం, నవంబర్ 2(జనంసాక్షి):** నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.ఆదివారం హనుమకొండ పరిధి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, ధర్మసాగర్ రిజర్వాయర్లను మేయర్ ఆకస్మికంగా సందర్శించి నీటి సరఫరా తీరును పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు.తాగునీరు రంగుమారి వస్తున్నదని పలు ప్రాంతాలు నుండి ఫిర్యాదులు వచ్చిన దృష్ట్యా క్షేత్రస్థాయిలో వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్,ధర్మసాగర్ రిజర్వాయర్ ను సందర్శించి నీటిని పరిశీలించడం జరిగిందని, ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లో నుండి చెరువుల నీరు రిజర్వాయర్ లో ప్రవేశించడం వల్ల కొద్దిగా రంగు మారిందని, రెండు రోజుల్లో నీటి రంగు సామాన్య స్థితికి వస్తుందన్నారు. నీరు కలుషితం కాకుండా అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారిచేసినట్లు మేయర్ తెలిపారు.అనంతరం వివేక్ నగర్, సమ్మయ్య నగర్, అమరావతి నగర్ ప్రాంతాల్లో సందర్శించి మాట్లాడుతూ వరద నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని వరద ప్రభావిత ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టి వ్యాధులు సంక్రమించకుండా చర్యలు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఈ లు రాజ్ కుమార్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ పాల్గొన్నారు.

## గొర్రెలకు మేతగా మారిన పల్లె ప్రకృతి వనం



**శాయంపేట, నవంబర్ 2 (జనంసాక్షి):** శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో చుట్టూ సరైన కంచె, గేటు లేక పోవడంతో గొర్రెలకు మేతగా పల్లె ప్రకృతి వనం మారింది. లక్షల రూపాయల రూపాయలు ఖర్చుచేసి ప్రజలు ఆహ్లాద వాతావరణంలో సేద తీరడానికి ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం ,అధికారుల పర్యవేక్షణ లోపంతో బోర్డు లేకుండా, వికృతవనంగా మారింది.

**అధికారుల ఒత్తిడి తట్టుకోలేక**

# ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మృతి

**మహదేవపూర్ అక్టోబర్ 2 (జనంసాక్షి):** పలిమెల మండలంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మిశ్రం జాలింఫా మృతికి కారణమైన డిఎఫ్ఓ ఎఫ్డిఓ లను విధులను వెంటనే తొలగించాలని లంబాడి హక్కుల పోరాట సమి తి రాష్ట్ర అధ్యక్షులు హజ్మీర్ పుల్ సింగ్ నాయక్ తెలంగాణ ప్రజా ఫంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్, మహదేవపూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. గతవారం వారం రోజులుగా సెక్షన్ అధికారిపై మానసికంగా విధులపై ఒత్తిడి చేయడంతో అధికారుల మధ్య ఒత్తిడికి తట్టుకోలేక మృతి చెందినాడు. ఒకరైతు పోడు చేయాలని ఉద్దేశంతో 22 చెట్లను నరికి వేయగా నవీన్ రెడ్డి. సెక్షన్ అధికారి అయిన జాలింఫా పై రూ 80 వేల ఫైన్ వేశారని నిన్ను సస్పెండ్ చేస్తానని బెదిరించాడని మరో వైపు ఎఫ్డిఓ సందీప్ రెడ్డి టీం బెదిరించి నిన్ను సస్పెండ్ చేస్తామని వేధించారని ఈ ఇద్దరి అధికారుల మధ్య ఒత్తిడి తట్టుకోలేక గోండు ఆదివాసి ఉద్యోగి అయిన జాలింఫా మానసిక హత్యకు కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మాహ ముత్తారం మండలం గౌరవ అధ్యక్షులు లింగమల్ల సదవలి, మండల అధ్యక్షులు రామగిరి రాజు, రేవెల్లి లక్ష్మణ్, ఫంగ సురేందర్ పాల్గొన్నారు.



# విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం

- **పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి**
- **ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భిక్షాటన**




**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పెండిం గ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అన్నారు. ఆదివారం హనుమకొండ నగరంలోని సుబేదారి జులైవాడలో ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దనెక్కారు అన్నారు. గత మూడు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8,150 కోట్ల దాకా స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదివే విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందామంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని విద్యా సంస్థల యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు పిజి కళాశాలలు ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలో బందుకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి ,1200 కోట్ల రూపాయలను రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసింద న్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగా టం ఆడుతుందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్య రంగ సమస్య లపై అలాగే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్. జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయి. అభిషేక్, అనుపు కుమార్, పవన్ కుమా ర్, సూరజ్, రాహుల్, రణదీప్, అరుణ్ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు లేని నిరుపేద మహిళల నిరసనలు

- **ఎమ్మెల్యేకు కనిపించడం లేదా...?**
- **తొర్రూరు ఖమ్మం జాతీయ రహదారిపై కళ్ళకు గంతలతో ధర్నా**

**తొర్రూరు, నవంబర్ 02 (జనంసాక్షి) :** ఇల్లు లేని నిరుపేదలు గత ఆరు నెలలుగా తొర్రూరు పట్టణ కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంచాలని చేస్తున్న మహిళల నిరసనలు స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని సిపిఎం పార్టీ తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకూబ్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పట్టణ కేంద్రంలోని దుబ్బ తండాలో తొర్రూరు ఖమ్మం జాతీయ రహదారిపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేద మహిళలు రోడ్డుపై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎండీ యాకూబ్ మాట్లా డుతూ మహిళా ఎమ్మెల్యే ను గెలిపించుకుంటే మహిళలకు ఎంతో తోడ్పాటు అందిస్తుందని సదుద్దేశంతో తొర్రూరు ప్రాంతంతోపాటు పాలకుర్తి నియోజకవర్గం లోని మహిళలందరూ ఏకకంఠంగా భారీ మెజారిటీతో ఎమ్మెల్యేను గెలిపించుకుంటే ఆరు నెలలుగా పలు రకాల నిరసనలు అధికారులు ప్రజాప్రతి నిధులు స్థానిక ఎమ్మెల్యే కు కూడా వినతి పత్రాలు సమర్పించు కున్న నేటికీ స్పందించిన దాఖలాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూలికి పోతే గాని పూట గడవని పరిస్థితుల్లో ఉన్న నిరుపేద మహిళలు ఆరు నెలలుగా పనులు లేక ఉపవా సాలు ఉంటూ నిరసనలు తెలుపుతుంటే సాటి మహిళల కష్టాలు ఒక మహిళ ఆయన ఎమ్మెల్యేకు కనిపించకపోవడం దురదృ ష్టకరమని అన్నారు. పలు రకాలుగా వినూత్నంగా నిరసనలు తెలుపుతుంటే టీవీ ఛానళ్లు పత్రికలు ఎమ్మెల్యే చూడడం లేదా ..? అని దుయ్యబట్టారు.

ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి గత ప్రభుత్వంలో నిర్మించిన ఇండ్లను తక్షణమే పంచుతామని మహిళల దగ్గరికి వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు డోనుక దర్గయ్య, నాయకులు తిమ్మిడి రవి, దొమ్మటి సోమయ్య, మర్క శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎండి అమీర్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ లీడర్లు శోభ, ధర్మయ్య, వరలక్ష్మి శమీన పాల్గొన్నారు.



## నష్టపోయిన పంటల వివరాలను

# త్వరగా అంచనా చేసి నివేదికను అందజేయాలి

**దెబ్బతిన్న వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరిష్**

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్**





**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 2 (జనంసాక్షి) :** మొంథా తుఫాను వల్ల భారీ వరదల కారణంగా నష్ట పోయిన పంటల వివరాల అంచనాను వ్యవ సాయ అధికారులు త్వరగా పూర్తి చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆ శాఖ అధికారులను ఆదేశిం చారు. ఆదివారం హను మకొండ జిల్లా హసన్ పర్తి మండలం వంగపహాడ్ రెవెన్యూ గ్రామ పరిధి లో వరదలతో నష్టం జరిగిన వరి పంట పొలాల ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ముంపు ప్రభావంతో ఏయే పంటలకు ఎంతెంత నష్టం జరిగిందనే వివరాలను వ్యవసాయ అధికారుల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంగప హాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలో పంటలు నష్టపోయి పొలాల వద్ద ఉన్న వంగపహాడ్, బైరాన్ పల్లి గ్రామాల కు చెందిన పలువురు రైతులతో కలెక్టర్ మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుని పంటలు నష్టపో యిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్య పడొద్ద న్నారు. పంటలకు జరిగిన నష్టం వివరాల నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సంద ర్భం గా వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరద ముంపుతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సర్వే నెంబర్ల ప్రకారం అంచనా వేసి నివేదికను త్వరగా అందజేయాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నష్టపో యిన పంటల వివరాలను అంచనా వేసి నివేదిక ఇవ్వాలన్నారు. బైరాన్ పల్లి - వంగపహాడ్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు వరద ధాటికి దెబ్బతినగా జిల్లా కలెక్టర్ పరిశీలించి త్వరగా మరమ్మతులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఆదిరెడ్డి, ఏవో అనురాధ, ఏఈఓ అనూష, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 2 (జనంసాక్షి):** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసిన ట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఇటీవల కురిసిన భారీ వర్షాల తో ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు, నష్ట ప్రభావం పై ప్రాథ మిక అంచనా కోసం సర్వే చేస్తున్న కారణం గా ప్రజావాణి కార్యక్ర మాన్ని రద్దు చేసినట్లు పేర్కొ న్నారు. సోమవారం నాటి ప్రజావాణి రద్దు కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరే ట్ లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రకటనలో వెల్లడించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**చెన్నారావుపేట, నవంబర్ 2 (జనంసాక్షి):** అక్రమంగా ఇసుకను తరలి స్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ము న్నేరు వాగు నుండి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలి స్తుం డగా ఏఎస్ఐ లక్ష్మణమూర్తి పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకురాగా సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలి స్తున్న మరాఠీ కట్టయ్య, యాదగిరిలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

**నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి.**



**గూడూరు,నవంబర్02(జనంసాక్షి):** సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మండలంలోని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రైతులను కోరారు.ఆదివారం గూడూరు మం డల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోనీ పత్తి రైతులు నెక్కొండ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో భవాని కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని,మధ్య దళారులను నమ్మకుండా తేమ శాతాన్ని బట్టి ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని,పత్తి తేమశాతం 8 నుండి 12శాతం, వరకు ఉండేలా రైతులు పత్తిని సిసిఐకి తీసుకురావాలని తెలిపారు.సీసీఐలో 8 శాతం ఉండే పత్తికి రూ,,8110, 9శాతం ఉండే పత్తికి రూ,, 8028,10 శాతం ఉండే పత్తికి రూ,,7947,11 శాతం ఉండే పత్తికి రూ,,7866,12 శాతం ఉండే పత్తికి రూ,,7785 మద్దతు ధర లభిస్తుందని, రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు సమ్మెట శ్రీనివాస్ గౌడ్,కందిక సుమలత పాల్గొన్నారు.

# నస్పూర్‌లో చైన్ స్నాచింగ్



**నస్పూర్ (జనంసాక్షి):** నస్పూర్ పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది,స్థానిక వార సంత సమీపంలోని శ్రీ గణేష్ నగర్ కాలనీలో నివసించే ప్రైవేట్ స్కూల్ టీచర్ చేవెళ్ల సరస్వతి ఆదివారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళ్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల చైన్‌ను అపహరించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న డిసిపి భాస్కర్,నస్పూర్ సీఐ అశోక్,ఎస్సై ఉపేందర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
03 నవంబర్ 2025

# క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

- ఎస్సై బి. ప్రవీణ్ కుమార్



**మునగాల, నవంబర్ 2 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నరసింహపురం గ్రామంలో కార్తీక పౌర్ణమి వేడుకలలో భాగంగా ఈనెల 5వ తేదీన జరిగే కోదండరామస్వామి కళ్యాణం సందర్భంగా న్యూ జనరేషన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను మునగాల ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని, క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి క్రీడాకారుడు ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధనే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ, వీరబోయిన వినోద్, వీరబోయిన శ్రీను, వీరబోయిన ముత్తయ్య, మిడిసెనమెట్ల నరసింహారావు, కాశీ విశ్వనాథం, అల్లి చిన్న రామయ్య, నరేష్, విజయ్, సతీష్, వీరబాబు, సాయి, మురళీ, రామయ్య, వెంకటేష్, నరేష్, న్యూ జనరేషన్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి

- తెలంగాణ భవన్ పేరు మార్చి ఇందిరమ్మ భవన్‌గా ఫ్లెక్సీ ఏర్పాటు

**మణుగూరు, నవంబర్ 2 (జనం సాక్షి) :** మణుగూరు మండలంలోని బిఆర్ఎస్ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వందల సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోని ఫర్నిచర్ అంతా బయటపడేసి, ఫ్లెక్సీ చింపి పెట్రోల్ పోసి తగలపెట్టారు. ఫర్నిచర్ నిప్పంటించడంతో పెద్ద ఎత్తున మంటలు చెల్లరేగాయి .కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసిన ఫలితం లేని దుస్థితి. తెలంగాణ భవన్ లో ఉన్న టిఆర్ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలను బయటకు పంపి అడ్డుకున్న వారిని పిడు గుద్దులు గుద్ది బయటికి పంపారు. వందల సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యాలయాన్ని ముట్టడించడంతో మణుగూరు డిఎస్పి రవీంద్ర రెడ్డి తో పాటు సిఐ లు నాగబాబు, అశోక్ రెడ్డి , వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సబ్ డివిజన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని



ఆందోళన కారులను తీవ్ర స్థాయిలో అడ్డుకున్నారు. పోలీసులు ఎంత నిలువరించిన కార్య కర్తలు ఆగకుండా దూసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తమ కార్యాలయాన్ని ఆక్రమించి తెలంగాణ భవన్‌గా మార్చాడని ఈరోజుతో కార్యాలయం తమ హస్తగతమైందని టపాసులు కాల్చారు. తెలంగాణ పవన్‌పై ఎగురుతున్న బిఆర్ఎస్ జెండాలు పీకేసి,గోడలకు రంగులు మార్చి కాంగ్రెస్ జెండాలను ఎగుర వేశారు. ఆ భవనానికి ఇందిరమ్మ భవనం పేరుతో ఫ్లెక్సీ కట్టి జై కాంగ్రెస్, జై పాయం అంటూ నినాదాలు చేస్తూ ఆనందోత్సవాలు జరుపుకున్నారు.

మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ సిఐ వినోద్ కుమార్‌తో పాటు సిబ్బంది రంగంలో దిగి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి బి ఆర్ఎస్ లో చేరి ఎన్నో సంవత్సరాలుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేయటం వల్ల ఇవాళ నాయకులు, కార్యకర్తల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర, జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పినపాక, నవంబర్ 2 (జనం సాక్షి) :** పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో నవంబర్ 8, 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల అండర్-17 కబడ్డీ పోటీలు, అలాగే జనవరి నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాలుర కబడ్డీ పోటీలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పినపాక జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ పోటీల నిర్వహణకు చేపడుతున్న ప్రాంగణ నిర్మాణం, కోర్టుల స్థల వ్యవస్థాపన, వసతి, భద్రతా చర్యలు మౌలిక సదుపాయాల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో జరగబోయే ఈ కబడ్డీ పోటీలు భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీలకు వేదికగా మారబోతున్నాయి. కాబట్టి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతిష్టకు తగ్గట్టుగా ఈ కార్యక్రమాలు అత్యుత్తమ ప్రమాణాలతో



నిర్వహించాలి అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి క్రీడాకారులు, అధికారులు, వీక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశమున్నందున సదుపాయాల విషయంలో ఎటువంటి లోపాలు ఉండకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కబడ్డీ పోటీల నిర్వహణకు మొత్తం నాలుగు కోర్టులను ఏర్పాటు చేయాలని, కానీ వీక్షకుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ కంట్రోల్ దృష్ట్యా కోర్టులను సముచిత దూరంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రహరీ గోడను తాత్కాలికంగా తొలగించి పక్కనే ఉన్న అటవీ శాఖ నర్సరీ ప్రదేశాన్ని వినియోగించడం ద్వారా స్థలం విస్తరించి, పోటీలు సౌకర్యవంతంగా నిర్వహించగలమని ఆయన సూచించారు. గ్రౌండింగ్ కోసం గ్రావెల్‌ను తక్షణమే సమకూర్చి పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్, ఆరోగ్య శిబిరం, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు, పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, భద్రతా సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రతి శాఖ సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడా శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖ, పంచాయతీ రాజ్, విద్యుత్, అటవీ మరియు ఆరోగ్య శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎంపీఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏ ఈ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య



**మణుగూరు, నవంబర్ 2 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం లోని మణుగూరు పట్టణంలో చోటుచేసుకున్న దహన కాండను బిజెపి నాయకులు లింగంపల్లి రమేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పినపాక నియోజకవర్గం ఎలాంటి రాజకీయ తగాదాలు లేకుండా కలిసిమెలిసి రాజకీయ పక్షాల నాయకులు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గాన్ని కాంగ్రెస్ బిఆర్ ఎస్ పార్టీలు ప్రజలను భయందోళనలకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన హేయమైన చర్య కారణంగా ఈరోజు మణుగూరు లో 144 సెక్షన్ విధించడం జరిగింది. మీ కార్యాలయం అయితే శాంతియుతంగా మీరు ప్రవేశించే హక్కు మీకు ఉంటుంది కానీ రౌడీలాగా నిప్పు పెట్టడం అనేది ఈ సమాజమంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుంది. ఇది ప్రజా పాలన.. లేక గుండాల రాజ్యమా..ప్రజలకు అంతుచిక్కని ప్రశ్న గా మిగులుతుంది.ప్రశాంతంగా ఉన్న నియోజక వర్గం నిప్పుల కుంపటి గా దౌర్జన్యాలు దాడులు చేస్తూ రాజకీయానికి కొత్త రంగు పూస్తున్నారు.భవిష్యత్తులో కొత్తతరం నాయకులకు మీరు నేర్పించే రాజకీయ విలువలు ఇవేనా..?. అని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నిలదీసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. దీనికి కారకులు ఎవరు పార్టీ కార్యాలయాలకు సంబంధించి ఎలాంటి విభేదాలు ఉన్న పరిష్కరించుకోటానికి పోలీస్, న్యాయస్థానాలు ఉన్నాయని, శాంతియుతంగా నిరసన తెలియజేసుకునే హక్కును మనకు భారత రాజ్యాంగం కల్పించింది. కానీ ఇవాళ కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ కార్యాలయంపై చేసిన దాడిలో గుండాల దాడిగా ప్రజలందరూ చూస్తున్నారని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు చూపి ఎమ్మెల్యేతో ఆనందాన్ని పంచుకున్న రాములమ్మ



**చౌటుప్పల్, నవంబర్ 2 (జనంసాక్షి) :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామాన్ని సందర్శించినప్పుడు, ఆయనకు హృదయాన్ని తాకే అనుభవం ఎదురైంది. ఇందిరమ్మ ఇల్లు మొదటి విడత జాబితాలో మంజూరైన లబ్ధిదారురాలు బుర్ర రాములమ్మ, ఎమ్మెల్యేకు ఎదురొచ్చి మరీ అతిథిగా తన ఇంటికి తీసుకెళ్లింది. కళ్లలో ఆనందం, మాటల్లో ఆత్మీయతతో రాములమ్మ తాను కట్టుకుంటున్న ఇందిరమ్మ ఇంటిని రాజ్ గోపాల్ రెడ్డికి చూపించి మురిసిపోయింది. "మీ వల్లే నేను ఈ రోజు ఇల్లు కట్టుకోగలుగుతున్నాను. మీరు మంజూరు చేయించకపోతే సొంత ఇల్లు నా కలగానే ఉండేది," అని ఆనందంతో, అభిమానంతో చెప్పింది. రాములమ్మ ఆత్మీయ పిలుపుతో, క్షణం ఆలస్యం చేయకుండా రాజ్ గోపాల్ రెడ్డి నిర్మాణంలో ఉన్న ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుండి అందిన 4,00,000 వివరాలు, నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. రాములమ్మ మాటలకు చలించిన ఎమ్మెల్యే, ఇంటి నిర్మాణం త్వరగా పూర్తవడానికి తనవంతుగా అదనంగా రెండు లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, స్థానిక నాయకులను ఆదేశిస్తూ రాములమ్మ ఇల్లు పూర్తయ్యే వరకు పర్యవేక్షించాల్సిందిగా సూచించారు. అనంతరం పర్యటిస్తూ తంగడపల్లి రోడ్డులో గల సబ్‌స్టేషన్‌లో మొబైల్ ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు. చిన్న కొండూరు రోడ్డులో లింగారెడ్డిగూడెం మాజీ కౌన్సిలర్ కొరగొని లింగస్వామి అన్న కుమారుడు వంశీ వివాహం సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించారు. కొయ్యలగూడెంలో గ్రామ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు గంజి భానుచందర్ దంపతులను కూడా ఆశీర్వదించారు.తొమ్మిదవ వార్డులో ఇటీవల మృతి చెందిన పల్లె స్వామి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## కాంగ్రెస్ గుండాలపై కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలి

**ఆళ్లపల్లి, నవంబర్ 2 (జనం సాక్షి) :** మణుగూరులోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై ఆదివారం ఎవరు లేని టైం చూసుకొని దొంగ చాటుగా వచ్చికాంగ్రెస్ పార్టీ రౌడీలు దాడి చేసి ఆఫీసులో ఉన్న ఫర్నిచర్ కుర్చీలను తగలబెట్టి బీఆర్ఎస్ కార్యకర్తలపై కర్రలతో విచక్షణ రహితంగా కొడుతుంటే పోలీస్ వ్యవస్థ ఏమైపోయింది. ఈసందర్భంగా ఆళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ప్రెస్ మీట్ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు,మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు,మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి,మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయ చాతకాక రోడ్లన్నీ చెరువు కుంటలతో మారిపోతున్న అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన చేయ చేతకాక రౌడీలా వ్యవహరించి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల లపై దాడి చేయడం సిగ్గుచేటుగా ఉందని ఘాటుగా విమర్శించారు మణుగూరు బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ మీద్దైఅయితే లీగల్ గా కోర్టుకు వెళ్లి కొట్లాడి న్యాయపరంగా పోవాలి తప్ప పార్టీ ఆఫీసులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని ఘాటుగా విమర్శించారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక దొంగల కూటమిగా ఏర్పడి చేతకాని హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిందని అన్నారు పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయ చేతకాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మతిస్థిమితం కోల్పోయి స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలవలేమని ముందే తెలుసుకొని రౌడీల్ల మారుతున్నారని ఘాటుగా విమర్శించారు,ఇలాంటి వ్యవహారాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని మొట్టికాయలు వేశారు మా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బయటికి వస్తే మీరు రోడ్లమీద తిరగటం కూడా ఉండదని అన్నారు మణుగూరులో పోలీస్ వ్యవస్థ ఏమైంది ప్రజలను భయభ్రాంతులను చేస్తూ రోడ్లమీద రౌడీలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ గూండాలను



వెంటనే అరెస్టు చేసి వారిపై చర్య తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేమూరి రాంబాబు,వేమూరి రాంబాబు, టిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు కొమరం వెంకటేశ్వర్లు,కొమరం నరసింహారావు, చిట్టి మల్ల బాబు, నిట్ట వెంకట్రావు,కొంపెల్లిసాంబయ్య,రవి,రమేష్,,నరేష్, నవీన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మూల మలుపులు - యమపురికి రహదారులు

- మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కరువు..

**కనగల్, నవంబర్ 2 (జనం సాక్షి) :** గ్రామాలకు వెళ్లే రహదారుల పై మూల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రధాన రహదారుల కు కలుపుతూ ఏర్పాటుచేసిన రోడ్లపై ఎక్కడ కూడా మూల మలుపుల వద్ద అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా తమకేమి పట్టనట్టు వ్యవహరించడంతో ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. గత పది సంవత్సరాల క్రితం ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లను తారు రోడ్లుగా మార్చినప్పటికీ అటు తర్వాత మరమ్మతులు చేయకపోవడం, రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగించకపోవడంతో ఏ ఊరికి వెళ్లే రహదారిని చూసిన గుంతల మయంగా కంప చెట్లతో కూర్కు పోయి కనిపిస్తుందే తప్పితే కనీసం కిలోమీటర్ వరకైన ప్రయాణం సాఫీగా చేసే పరిస్థితి లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పనుల కోసం బయటి ప్రాంతానికి వెళ్లి



రాత్రి వేళలో ఇంటికి చేరుకుందామంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడపవలసిన పరిస్థితి ఏర్పడుతుంది .అయినప్పటికీ ఎంత జాగ్రత్తగా వెళ్లిన తరచూ మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతూ కాలు చేతులు విరగడం, ప్రాణాలు కూలిపోవడం లాంటి సంఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. కోల్ ఎక్కడో ఒకచోట మూలమలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురై, అంగవైకల్యం చెందడం, ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్న సంఘటనలు మన కళ్ళ ఎదుటనే కనబడుతున్నాయి. వాటిని మరమ్మతులు చేయించడానికి నిధుల కొరత కారణంగా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ముందుకు రాకపోవడం కనీసం ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంలో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు వైఫల్యం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

రహదారుల వెంట మూలమలుపులు ఉన్నచోట ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరం ఉన్నచోట కల్వట్లు నిర్మించి ప్రమాదాలను నివారించాలని అధికారులను ప్రమాద బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

# మొంథా తుఫాన్‌తో ఆగమాగమైన వరి పంట

- పొంచి ఉన్న మరో తుఫాన్
- ఇప్పటికే బురద కోతలు తప్ప మరో మార్గం లేనట్టే..
- మరో తుఫాన్ వస్తే రైతు నోట్లో మన్నే
- రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వాతావరణ పరిస్థితులు

**పెనుబల్లి, నవంబర్ 2 (జనం సాక్షి) :** పెనుబల్లి మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన వరి పంట దాదాపు కోతలకు సిద్ధం అయింది. ఈనిన వరికంకుల్లో గింజలు ముక్కులు ఎర్ర బడి అర్రు వంచాయిఅంటే దాదాపు పంట కోతలకు సిద్ధమైంట్లే, అదే సమయంలో రైతులు వరి మళ్ల ల్లో చుక్క నీరు లేకుండా బయటికి వెళ్ళగొట్టి వరి కోతలకు సిద్ధమవుతారు, మండల వ్యాప్తంగా చెరువులు, బోర్ల కింద రైతులు పండించిన వరి పంట దాదాపు ఇదే పరిస్థితికి వచ్చి కోతలకు సిద్ధంగా ఉంది, ఇదే సమయంలో మొంథా తుఫాను ప్రభావంతోకురిసిన వర్షాలకు కోతకు వచ్చిన పంట నీట మునిఆగమాగమైంది, ఈ పరిస్థితుల్లో



బురద కోతలే మనకు గచ్చ%శీ%తరమని రైతులు వాపోతున్నారు, ఇలా బురద కోతలు కోస్తే ధాన్యం రాలిపోవడంతో పాటు రెట్టింపు ఖర్చులు అవుతాయి, పశువులకు పూస వరిగడ్డి కూడా మిగలదు, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు వరి పంటలను కోస్తే పండిన పంట, పెట్టుబడులు కూడా రాకపోగా అప్పులపాలుఅవుతారు, ఇంతచేసి వ్యయ ప్రయాసలకు ఓర్చి చేతికి అంది వచ్చిన వరి ధాన్యాన్ని అమ్ముకోవాలంటే అసలు ప్రయాసలు మొదలవుతాయి, అప్పుడు అనిపిస్తుంది రైతుకు వరి పైరును కోయకుండా బురద పొలాల్లో ఉంచినా ఈ కష్టాలు ఉండేవి కావు అని, వాతావరణ మార్పులతో వచ్చి పోయే వర్షాలకు ధాన్యాన్ని రైతు వద్ద ఉంచుకోలేక పచ్చి వడ్లను అమ్మాల్సి వస్తే, మధ్య దళారీలు రైతుల పరిస్థితులను సొమ్ము చేసుకుని వారికి నచ్చిన రేటుతో రైతులు వద్ద ధాన్యాన్ని దోచుకుంటారు, వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకోలేక, మనోవేదనకు గురికాలేక మధ్య దళారి దోపిడీదారులకు బలైపోతున్నారు, కొద్దో గొప్పో వర్షాల బారి నుండి పట్టాలు కప్పి ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ కూడా కేంద్రాల నిర్వాహకులు రైతులను బహిరంగంగా నిలువు దోపిడి చేస్తారు, వరి పంట సాగు చేసే రైతులు ప్రకృతి ప్రకోపాలకు కుదేలై వరి పంటను పండిస్తే ఆ పంటను అమ్ముకోవడానికి మధ్య దళారీల, ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కాళ్ళు గడ్డాలు పట్టుకునేంత స్థాయికి దిగజారి పోవాలి దేశానికి పట్టె దన్నం పెట్టే రైతన్న...దేశానికి వెన్నెముక రైతన్న...రైతే రాజు... జైకిసాన్ ఇలాంటి గాలి కిరీటాలు మోస్తూ... గాలి పల్లకిలో ఊరేగుతున్న రైతన్న పరిస్థితి..

## ఓపెన్ టెన్త్ ఇంటర్ కోర్సుల్లో చేరుటకు ఈ నెల 7 వరకు అవకాశం



**నేరేడుచర్ల, నవంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ హైదరాబాద్ ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరుటకు చివరి అవకాశం ఈనెల 7 వరకు కలదని సెంటర్ కోఆర్డినేటర్ ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అన్నారు. పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల %యూూ% కేంద్రం నందు ఇప్పటివరకు టెన్త్, ఇంటర్ కోర్సు లందు చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తూ, ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వివిధ కారణాలవల్ల చదువు మధ్యలో ఆపిన విద్యార్థులకు, వయోజనులకు, ఓపెన్ విధానం ద్వారా టెన్త్, ఇంటర్ పూర్తి చేసి తదనంతరం కూడా చదువు కొనసాగించవచ్చని తద్వారా ఉద్యోగ అవకాశాలు, సర్వీసులో ఉన్నవారు ప్రమోషన్లు పొందవచ్చు అని ఈ సదవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ ఖాన్, కట్ట వెంకటేశ్వరరావు, కురివెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




# ఫ్రెష్.. ఫ్రెష్‌గా!

**న్యూఢిల్లీ:** ఫ్రిజ్ అంటే కేవలం చల్లగా ఉంచే పెట్టెగా మాత్రమే కాదు. ఇప్పుడది స్మార్ట్, ఫ్రెష్, ఫన్నీ అసిస్టెంట్‌గా కూడా మారింది.ఫ్రిజ్ నుంచి గుడ్లను పగిలిపోకుండా బయటకు తీసేటప్పుడు పడే టెన్షన్ కోడి గుడ్డు పెట్టేటప్పుడు కూడా పడి ఉండదేమో అని అనిపిస్తుంటుంది!ఎందుకంటే, ఫ్రిజ్‌లో గుడ్లను పెట్టడం, తీయటం ఒక పెద్ద పని, పైగా వాటికి స్థలం కూడా చాలా కావాలి. ఇక ఆ కష్టాలు మర్చిపోండి! రింకిఫై ఆటోమాటిక్ ఎగ్ రోల్‌డౌన్ వచ్చింది. ఇది నాలుగు లేయర్ల ఆటోమాటిక్ రోల్‌డౌన్ సిస్టమ్, గ్రావిటీ ఫీడ్ డిజైన్‌తో వస్తుంది. అందుకే, ఒక చివరి గుడ్డు తీసుకున్న వెంటనే మరో గుడ్డు మీ ముందుకు వస్తుంది. కాబట్టి గుడ్లను తీసుకోవడం చాలా సులభం. ఇందులో ముప్పై గుడ్ల వరకు భద్రంగా నిల్వ చేస్తుంది. వర్టికల్ స్టాక్ డిజైన్ వల్ల ఫ్రిజ్‌లో స్థలం ఎక్కువ సేవ్ అవుతుంది. హై-క్వాలిటీ ప్లాస్టిక్‌తో తయారవడంతో, దీన్ని క్లీనింగ్ చేయడం కూడా సులభం. ధర: రూ. 300.రోజూ ఉదయాన్నే పాలు అయిపోయాయి అని ఫ్రిజ్ డోర్ తెరిస్తే కాని తెలియడం లేదా? దీంతో, ఉదయం పాలకోసం వాకింగ్ తప్పడం లేదా. బాధ పడకండి. ఇప్పుడు ఈ విషయాన్ని ఫ్రిజ్ గమనిస్తుంది. 'బ్రో, ఉదయం కాఫీకి పాలు లేవు!' అని ఎప్పటికప్పుడు మీకు ఫోన్‌లో నోటిఫికేషన్ పంపిస్తుంది. ఇంకా పెరుగు, గుడ్లు, కూల్ డ్రింక్స్ అన్నీ చెక్ చేసి, ఏవి లేవో వాటన్నింటితో కలిపి షాపింగ్ జాబితాను కూడా పంపిస్తుంది. ఇలా ఫ్రిజ్ తలుపు తెరవకుండానే, లోపల ఏముందో అన్నది ఫోన్లోనే చూసుకోవచ్చు! అంతేకాదు, ఎవరు చివరి చాక్లెట్ తిన్నారో కూడా తెలుసుకోవచ్చు. ఇదంతా ఎలా సాధ్యమయ్యిందంటే? ఇందులో వై-ఫై, టచ్ స్క్రీన్, వాయిస్ కంట్రోల్ ఉన్నాయి. 'ఫ్రిజ్, కూల్ చెయ్!' అని చెబితే అది వినేస్తుంది కూడా! వివిధ బ్రాండ్ల ఆధారంగా ధర రూ. 50,000 నుంచి రూ. 1,00,000 వరకు ఉండొచ్చు.ఫ్రిజ్ తెరిస్తే కొత్తిమీర, పుదీనా, పాలకూర ఇలా ఆకుకూరలు వాడిపోతున్నాయా? పైగా ఎప్పుడూ కొత్త ఆకులు కొనుకోవడం మర్చిపోతుంటారా? టెన్షన్ వద్దు! వేకిజ్ హెర్బ్ కీపర్ తీసుకోండి. ఎందుకంటే ఇది సాధారణ కంటైనర్ కాదు. వేకిజ్ హెర్బ్ కీపర్ ఏబీఎస్ గ్రేడ్ ప్లాస్టిక్ తో తయారైంది, స్ట్రాంగ్ అండ్ సేఫ్. కొత్తిమీర, పుదీనా, కరివేపాకు ఏదైనా ఆకుకూర పెట్టి, కొంచెం నీరు వేసి మూత పెట్టండి అంతే! ఇది ట్రాన్స్‌పరెంట్‌గా ఉండటం వల్ల లోపల ఏముందనేది స్పష్టంగా చూడొచ్చు. పైగా, ఎయిర్ గ్రూవ్ ఉన్న మూత వల్ల ఆకులు తడిగా, పచ్చగా, ఫ్రెష్‌గా ఉంటాయి. ప్రతి మూడు నుంచి ఐదు రోజుల్లో నీరు మార్చినపుడు, ఆకులు మూడు వారాల వరకు పచ్చగా ఉంటాయి. ధర రూ. 350.



# పసిడి పరుగు ఎటు వైపు?

**నిపుణుల అంచనా**

డాలర్ విలువ పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ రేటు తగ్గింపు వంటివన్నీ బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమయ్యాయి.దీంతో గోల్డ్ రేటు వరుసగా రెండోవారం కూడా తగ్గుతూనే ఉంది. డిసెంబర్ నాటికి ఈ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా.రూ. 1,25,000 దాటేసిన 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు క్రమంగా తగ్గుతూ.. ఈ రోజు (నవంబర్ 02) రూ. 1,23,000 వద్ద నిలిచింది. ధరల తగ్గుదల ఇదే విధంగా కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్లో గరిష్ట స్థాయి నుంచి ఔన్సుకు 4,000 డాలర్ల స్థాయికి చేరిందని.. స్మాల్ కేస్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్ అండ్ వెల్త్ ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్ వ్యవస్థాపకురాలు సీఈఓ స్నేహ జైన్ అన్నారు.అక్టోబర్ ప్రారంభంలో బంగారం కొంతకాలం జీవిత కాల గరిష్టాలను తాకిన తర్వాత ఈ తగ్గుదల నమోదైంది. ఈ వారం పరిణామాలు బంగారం విషయంలో చాలావరకు ప్రతికూలంగా ఉన్నాయని రిటైల్ బ్రోకింగ్ %ఁ% డిస్ట్రిబ్యూషన్ సీఈఓ అండ్ పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ రైచురా అన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గాయి, ట్రంప్-జిన్‌పింగ్ చర్చలు సానుకూలంగా ఉన్నాయి. భారతదేశంలో పండుగ సీజన్ కూడా ముగిసింది. ఈ అంశాలన్నీ స్వల్పకాలంలో బంగారంపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని ఆయన పేర్కొన్నారు.రెండు వారాల పాటు ఒడిదుడుకుల తర్వాత వెండి ధరలు తిరిగి స్థిరత్వాన్ని ప్రదర్శించాయి. అక్టోబర్ నెలలో రూ. 2 లక్షలు దాటేసిన సిల్వర్ రేటు రూ. 1.66 లక్షలకు చేరింది. ఈ ధర మరింత తగ్గుతుందని వెల్త్‌ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్‌కు చెందిన జైన్ పేర్కొన్నారు. కాగా



భవిష్యత్తులో రేట్ల తగ్గుదల అనేది.. స్థూల ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటాయని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు లోహాల ర్యాలీని చల్లబరిచాయని వెంచురాలోని కమోడిటీస్ సీఆర్ఎం హెడ్ ఎన్ఎస్ రామస్వామి అన్నారు. మొత్తం మీద పసిడి ధరలలో ఊహకందని మార్పులు జరిగే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి బేస్ దిగుమతి ధరలను తగ్గించింది. బంగారం దిగుమతి ధర 10 గ్రాములకు 42 డాలర్లకు తగ్గింది. వెండి దిగుమతి ధర కేజీకి 107 డాలర్లకు తగ్గింది. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల దృష్ట్యా తీసుకున్నది. దీని ఉద్దేశం దేశీయ మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం. తద్వారా ధరలలో వ్యత్యాసం కనిపిస్తోంది.

**ప్రభుత్వ చర్య ఏంటి?**

కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండి బేస్ దిగుమతి ధరలను తగ్గించింది. బంగారం దిగుమతి ధర 10 గ్రాములకు 42 డాలర్లకు తగ్గింది. అలాగే వెండి దిగుమతి ధర కిలోకు 107 డాలర్లకు తగ్గింది.ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల దృష్ట్యా తీసుకున్నది. దీని ఉద్దేశం దేశీయ మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం.బేస్ ఇంపోర్ట్ ప్రైస్ అనేది ప్రభుత్వం నిర్ణయించే సూచిక ధర. ఇది కస్టమ్స్ సుంకాలు లెక్కించడానికి ఉపయోగిస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వం ఈ ధరను అప్‌డేట్ చేస్తుంది. బేస్ ధర తగ్గితే దిగుమతిదారులపై పన్ను భారం తగ్గుతుంది. అందువల్ల మార్కెట్లో బంగారం, వెండి ధరలు కూడా స్థిరంగా లేదా కొంత తగ్గే అవకాశం ఉంటుంది.చైనా ప్రపంచంలో అతిపెద్ద బంగారం దిగుమతిదారు. భారతదేశం రెండవ స్థానంలో ఉంది. ప్రజలు ఆభరణాలు, పెట్టుబడుల కోసం బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. బేస్ ధర తగ్గడం వల్ల బంగారం దిగుమతి ఖర్చు తగ్గి వినియోగదారులకు లాభం కలగవచ్చు. వెండి విషయంలో , భారత్ ప్రపంచంలోనే అత్యధిక దిగుమతిదారు.పలు నివేదికల ప్రకారం.. భారత్ తన బంగారంలో ఎక్కువ భాగం స్విట్జర్లాండ్ నుండి దిగుమతి చేసుకుంటుంది. ఇది దాని దిగుమతుల్లో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఆ తర్వాత అధికంగా పసిడి దిగుమతి చేసుకునేది యూఏఈ నుంచి. ఇది మొత్తం దిగుమతుల్లో 16 శాతం. ఇక దక్షిణాఫ్రికా సుమారు 10 శాతంతో మూడవ స్థానంలో ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 48 దేశాల నుండి పసిడి లోహాన్ని దిగుమతి చేసుకుంది. 2024-25లో బంగారం దిగుమతులు 27.3 శాతం పెరిగి 58 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

**ప్రస్తుత బంగారం, వెండి ధరలు**

భారత్‌లో ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,23,150 వద్ద, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,12,900 వద్ద ఉన్నాయి. ఇక వెండి ధర కేజీకి రూ.1,52,000 వద్ద ఉంది.

## నియామకాలు మళ్లీ షురూ!.. : సత్య నాదెళ్ల

ఇప్పటి వరకు ఉద్యోగులను తొలగిస్తున్న దిగ్గజ కంపెనీలు.. ఉద్యోగ నియమకాలను చేపట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులను మళ్ళీ విస్తరించడానికి సిద్ధంగా ఉందని సీఈఓ సత్య నాదెళ్ల పేర్కొన్నారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో.. కంపెనీ మరింత వృద్ధి చెందడమే లక్ష్యంగా ఉద్యోగ నియామకాలను చేపట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల.. బీజీ2 పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. కొత్తగా చేరే ఉద్యోగులకు ఏఐ గురించి బాగా అవగాహన ఉండాలని, వారికి మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ ఏఐ కోడింగ్ హెల్పర్ వంటి వాటికి సంబంధించిన యాక్సెస్ ఇవ్వనున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు ఏఐ సాయంతో.. మరింత వేగంగా పనిచేయడానికి కంపెనీ సన్నద్ధమవుతోంది స్పష్టం చేశారు.2025 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి.. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్య 2,28,000గా ఉంది. అంటే అంతకు ముందు కంపెనీ సుమారు 15,000 మంది ఉద్యోగులను తొలగించింది.

## బ్యాంకులో డబ్బు సేఫేనా?

**'రిచ్ డాడ్' అపద్ధాలు!**

ప్రఖ్యాత రచయిత, ఆర్థిక విద్యావేత్త రాబర్ట్ కియోసాకి తన బెస్ట్ సెల్లింగ్ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' కు ప్రసిద్ధి చెందారు.డబ్బు, భద్రత, విజయంపై సమాజం దీర్ఘకాల నమ్మకాల గురించి మరోసారి సోషల్ మీడియాలో చర్చను రేకెత్తించారు. రాబర్ట్ కియోసాకి తాజాగా 'ఎక్స్'(గతంలో ట్విట్టర్) లో ఒక పోస్ట్ చేశారు. "ఇప్పటివరకు చెప్పిన అతిపెద్ద అబద్ధాలు" ఇవే అంటూ కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి."వాళ్లు ఎప్పటికీ సంతోషంగా ఉంటున్నారు బాండ్లు సురక్షితం. బ్యాంకులో డబ్బు సురక్షితం. నాకు ఉద్యోగ భద్రత ఉంది. కళాశాల డిగ్రీ ఆర్థిక విజయానికి కీలకం"ఈ ట్వీట్ వెంటనే వైరల్ అయింది. ఆయన ప్రస్తావించిన ప్రతి పాయింట్ ను చర్చించడంతో వేలాది లైక్‌లు, షేర్లు వచ్చాయి. కియోసాకి సందేశం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' ప్రధాన తత్వాన్ని ప్రతిధ్వనిస్తుంది. సాంప్రదాయ ఉపాధి విద్య వ్యవస్థల కంటే ఆర్థిక స్వాతంత్ర్యం పెట్టుబడి అక్షరాస్యత సంపదకు మరింత నమ్మదగిన మార్గాలు అన్నది కియోసాకి అభిప్రాయం.

## కొత్త స్కూటర్ అమ్మకాల నిలిపివేత!

**న్యూఢిల్లీ:** ఓలా ఎలక్ట్రిక్ ట్రేడ్ సర్టిఫికేట్‌ను సస్పెండ్ చేస్తూ గోవా రవాణా శాఖ కీలక ప్రకటన చేసింది. సరైన సర్వీస్ లేకపోవడం, మరమ్మత్తు జాప్యాలపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని కొత్త స్కూటర్ల అమ్మకాలను కూడా నిలిపివేసింది. గోవాలోని మూడు సర్వీస్ సెంటర్లలో దాదాపు 2,000 ఓలా స్కూటర్లకు సరైన మరమ్మత్తులు చేయ కపోవడమే కాకుండా.. సిబ్బంది నుంచి సరైన స్పందన రావడం లేదని కస్టమర్లు చెబుతున్నారు.అస్పష్టమైన ప్రతిస్పందనలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఆలస్యమయ్యాయని కస్టమర్లు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై చర్య తీసుకోవాలని.. రవాణా శాఖకు, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు ఓలా ఎలక్ట్రిక్ వినియోగదారులు మెమోరాండం సమర్పించారు. దీంతో రాష్ట్ర వాహన్ పోర్టల్‌లోని అన్ని ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్‌లను బ్లాక్ చేస్తూ సంబంధిత శాఖ నిర్ణయం తీసుకుంది.ఈ సస్పెన్షన్ తాత్కాలికమని.. సమస్యలను పరిష్కరించిన తరువాత, దీనిని ఎత్తివేయనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ చర్య గోవాలోని ఎలక్ట్రిక్ వాహన యజమానులలో చర్చలకు దారితీసింది. చాలా మంది ఎలక్ట్రిక్ వాహన తయారీదారులకు బాధ్యత అలవాడాలని, జవాబుదారీతనం ఉండాలనే కఠినమైన చర్య తీసుకోవడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.



**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.72 | ₹ 5.74 |


**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,12,750 (22 క్యారెట్లు) | ₹ 1,23,000 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,66,000

# అమెరికాకు తొలిసారి సిరియా అధ్యక్షుడు..!

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా మధ్య భేటీ ముహూర్తం ఖరారైంది. నవంబర్ 10వ తేదీన డొనాల్డ్ ట్రంప్‌ను సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అల్ షరా వాషింగ్టన్‌లో కలవనున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.సిరియా అధ్యక్షుడు అధికారికంగా అమెరికా రాజధాని వాషింగ్టన్‌కు రావడం ఇదే తొలిసారి. అంతకుముందు ఎప్పుడూ సిరియా అధ్యక్షుడికి అమెరికా నుంచి అధికారిక ఆహ్వానం అందలేదు. దీనికి కారణం వారి మధ్య ఉన్న శత్రుత్వమే. ఇరుదేశాల మధ్య గతంలో అగ్గిపుల్ల వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత పలు దేశాల మధ్య శాంతి ఒప్పందాలు చేస్తూ వార్తల్లో



నిలుస్తున్నారు. దీనిలో భాగంగానే తమ శత్రు దేశమైన సిరియాకు ఆహ్వానం పంపినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.గతంలో అమెరికా-సిరియాల సంబంధాలు తీవ్ర ఉద్రిక్తంగా ఉండేవి. సిరియాలోని అంతర్గత యుద్ధం, ఉగ్రవాద సంస్థల ప్రాబల్యం, మానవ హక్కుల ఉల్లంఘనలకు సిరియా పాల్పడుతోందని అమెరికా విమర్శలు చేస్తూ వచ్చింది. ఆ క్రమంలోనే ఆ దేశంపై కఠినపై ఆంక్షలు విధించింది అమెరికా. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో సిరియాను తమ దారికి తెచ్చుకోవాలనే యోచనలో ఉన్నారు ట్రం?ప్. అందులో భాగంగానే సిరియా అధ్యక్ష పదవిలో ఉన్న అల్ షరాకు ఆహ్వానం వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ భేటీపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి. ప్రధానంగా ఇజ్రాయిల్, ఇరాన్, రష్యా వంటి తదితర దేశాలు ఈ భేటీని నిశితంగా గమనించే అవకాశం ఉంది.

**25 ఏళ్లలో తొలిసారి..**

ఈ ఏడాది మే నెలలో సౌదీ అరేబియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్-సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్-షారా భేటీ అయ్యారు. ఇది 25 ఏళ్లలో అమెరికా, సిరియాల మధ్య జరిగిన మొదటి సమావేశం. ఈ సమావేశం తరువాత సిరియాపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు ట్రంప్.

# వస్తువులు కాజేసి.. కటకటాల్లోకి..

- అమెరికా సూపర్‌మార్కెట్‌లో దొంగతనం చేసిన భారత యువతి
- ఆపై తాను ఏమీ చేయలేదని బుకాయింపు

**వాషింగ్టన్:** అమెరికాలో మరో భారత యువతి దొంగతనం చేస్తూ అడ్డంగా దొరికింది. పైగా తాను దొంగతనం చేయలేదని బుకాయించింది. తీసుకున్న వస్తువులకు డబ్బులు చెల్లించడం మరిచిపోయానంటూ ప్రాధేయపడింది .కావాలంటే ఇప్పుడు తీసుకున్న వస్తువులకు డబ్బులు చెల్లిస్తా. నన్ను వదిలేయండి' అంటూ చేతులు జోడించి అక్కడి పోలీసుల్ని వేడుకుంది. ఈ ఘటన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ఓ యువతి టూరిస్ట్ వీసాతో అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటన సమయంలో అమెరికాకు చెందిన ఓ రాష్ట్రానికి వెళ్లారు. అక్కడ ఓ షాప్‌లో తనకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశారు. అనంతరం, అక్కడి నుంచి వెళ్లే ప్రయత్నం చేయగా.. సదరు షాపు యజమాని ..తన షాపులో ఓ యువతి దొంగతనం చేసిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువతిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తు వీడియోలో.. ఆ యువతి ఎలా శిక్ష విధించకుండా వదిలేయమని కోరింది. తాను షాపులు వస్తువుల్ని కొనుగోలు చేశానే తప్పా.. దొంగతనం చేయలేదని, కొనుగోలు చేసిన వస్తువులకు ఇప్పుడే డబ్బులు చెల్లిస్తానని చెప్పడం ఆవీడియోలో చూడొచ్చు. కాగా, ఆ యువతి వివరాలు, ఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.



**కొద్దిరోజుల క్రితం**

కొద్దిరోజుల క్రితం మనదేశానికే చెందిన ఓ మహిళ అమెరికాలోని ఇల్లినాయిస్‌లో డిపార్టుమెంటల్ స్టోర్సుకు వెళ్లి.. ఏకంగా 1300 డాలర్ల విలువైన వస్తువులను తస్కరించడానికి ప్రయత్నించిందట. బిల్లు ఎగ్గొట్టి జారుకోవాలని చూస్తే.. చివరికి పోలీసుల పాలైంది. దొరికి పోయిన తర్వాత ఎవరు మాత్రం ఏం చేస్తారు? 'సారీ సర్.. ప్లీజ్ సర్, ఫస్ట్ టైం సర్, క్షమించండి సర్..' అని కోరినప్పటికీ పోలీసులు ఆమెను కటకటాల వెనక్కు పంపారు.

## హత్యకు ముందు సామూహిక అత్యాచారం?

**చెన్నై:** పెరంబలూర్ జిల్లాలోని కున్నం ప్రాంతానికి చెందిన ఆంథోనీ సామి. ఇతని భార్య కళావతి. ఈ దంపతులకు మీరా జాస్మిన్ (22) అనే కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.పిల్లల చదువు కోసం తిరుచ్చిలోని శ్రీనివాస నగర్‌లోని వాయలూర్ రోడ్‌లోని ఓ అద్దె ఇంట్లో ఆంథోనీ సామి నివసించారు. ప్రస్తుతం, ఆంథోనిసామి విదేశాల్లో పనిచేస్తున్నారు. మీరా జాస్మిన్ తిరుచ్చిలోని ఓ ప్రసిద్ధ కళాశాల నుంచి ఎంఎస్సీ పూర్తి చేశారు. ఆమె విశ్వవిద్యాలయ పోటీల్లో బంగారు పతకాన్ని కూడా గెలుచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉద్యోగం కోసం మీరా జాస్మిన్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తర్వాత తిరిగిరాలేదు.దీంతో తల్లి కళావతి ఆమెను సెల్ ఫోన్‌లో సంప్రదించింది. ఫోన్ పూర్తిగా మోగింది, తర్వాత కట్ అయింది. తర్వాత ఎవరూ ఫోన్ ఎత్తలేదు. దీంతో కళావతి తిరుచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా తిరుచ్చి మనచనల్లూరు సమీపంలోని సిరుకనూరు సానమంగళం రక్షిత అటవీ ప్రాంతంలో ఓ యువతి మృతదేహం పాక్షికంగా కాలిపోయి కనిపించింది. తరువాత, ఆ మృతదేహం మీరా జాస్మిన్‌ది అని దర్యాప్తులో తేలింది. మృతదేహం దగ్గర ఆమె హ్యాండ్‌బ్యాగ్, సెల్ ఫోన్, బూట్లు, బీరు బాటిళ్లు కనిపించాయి. మృతదేహం అర్ధనగ్నంగా కనిపించింది.ఆమెపై సామూహిక అత్యాచారం చేసిన తర్వాత, గొంతు నులిమి చంపి, ఆపై కిరోసిన్ పోసి నిప్పంటించారని తెలుస్తోంది. గతంలో తనలో కలిసి చదివిన స్నేహితుడితో మీరా జాస్మిన్‌కు ప్రేమ సంబంధం ఉందని, వారిమధ్య మనస్పర్థల కారణంగా విడిపోయినట్లు తెలిసింది. దీంతో తీవ్ర నిరాశ చెందిన స్నేహితుడి సోదరుడు 6 నెలల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి ప్రతీకారంగా ప్రియుడి బంధువులు ఆమెని కిడ్నాప్ చేసి హత్య చేశారా.? అనే దానిపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# 54 ఏళ్లకు ఆలయ ఖజానా తనిఖీ..

**కోట్లాది సంపద స్థానంలో ఒక బంగారం కడ్డీ, మూడు వెండి కడ్డీలు, కొన్ని ఇత్తడి పాత్రలు మాత్రమే లభ్యం.. రేకెత్తున్న అనుమానాలు**

**మథుర:** యూపీలోని బృందావన్‌లో ప్రసిద్ధి చెందిన బాంకే బిహారీ ఆలయ ఖజానా అంశం మరోమారు చర్చల్లోకి వచ్చింది. గత 54 ఏళ్లుగా సీలు వేసిన ఆలయ తోషఖానా (ఖజానా)ను గత నెలలో సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్ ఆదేశాల మేరకు తెరిచారు.అయితే, తరతరాలుగా రాజ బహుమతులు, బంగారు ఆభరణాలు, అపారమైన కానుకలు ఉన్నాయని నమ్మిన ఈ ఖజానాలో కేవలం ఒకే ఒక బంగారం కడ్డీ, మూడు వెండి కడ్డీలు, కొన్ని ఇత్తడి పాత్రలు మాత్రమే లభించడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.ఖజానాలో ఊహించిన విధంగా విలువైన బంగారు కిరీటం, రత్నాల హారం లాంటివి లేవు. ఇందుకు బదులుగా కేవలం ఒక బంగారు కడ్డీ, కుంకుమతో చారలు ఉన్న మూడు వెండి కడ్డీలు ఒక పొడవైన చెక్క పెట్టెలో లభించాయి. దీనికితోడు ఖజానాలో ఉన్న వస్తువులకు సంబంధించి దాతల రిజిస్టర్, జాబితా, లేదా విలువ కట్టే పత్రాలు కూడా మాయం కావడం గమనార్హం. దీంతో మాయమైన ఆలయ నిధి ఎక్కడ ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది స్థానికులను తీవ్రంగా కలవరపరిచింది. దీంతో వారు సీబీఐ దర్యాప్తు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు.రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి అశోక్ కుమార్ అధ్యక్షతన ఏర్పడిన సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్ ఈ ఆలయానికి చెందిన సుమారు రూ. 400 కోట్ల విలువైన ఆస్తులపై విచారణ చేపట్టింది. ఆలయానికి సంబంధించిన బ్యాంకు డిపాజిట్లు, సీలు చేసిన లాకర్లు, భూమి కమతాలు, విరాళ రికార్డులపై పూర్తిస్థాయి ఆస్తి ఆడిట్‌ను ప్రారంభించింది. ఆలయానికి మథుర,



బృందావన్‌లలో 10కి పైగా బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, వాటిలో సుమారు రూ. 350 కోట్ల నుండి 400 కోట్ల వరకు నగదు ఉన్నట్లు అంచనా. వీటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మార్చాలని ప్యానెల్ ఆదేశించింది.ఆలయ సంప్రదాయ కార్యకలాపాలను నిర్వహించే వంశపారంపర్య గోస్వామి కమ్యూనిటీ సభ్యులు ఇటీవల కొన్ని ఆభరణాలను ఎస్‌బీఐ మథుర శాఖలో జమ చేసినట్లు తెలిపారు. అయితే దీనికి సంబంధించిన పత్రాలు మాత్రం అందుబాటులో లేవు. ఈ విషయంలో పూజారులపై ఎటువంటి ఆరోపణలు చేయలేమని, తమ ఆలయం దక్షిణాది దేవాలయాల మాదిరిగా రాజులచే నిర్మితం కాలేదని, భక్తుల కానుకలతో నిర్మించారని కమిటీ సభ్యుడొకరు పేర్కొన్నారు.

## ఢిల్లీ తల్లడిల్లి..

- కాలుష్య వలయంలో దేశ రాజధాని
- ఆందోళన వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ
- తక్షణ చర్యలు చేపట్టాలంటూ ప్రధాని మోదీ, ఢిల్లీ సీఎంకు వినతి

రాజకీయ నేతలను కోరారు. ప్రతి ఏటా ఢిల్లీ పౌరులపై ఈ విష వాయువులు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని పేర్కొన్నారు. శ్వాసకోస సమస్యలతో బాధపడేవారు, పాఠశాలకు వెళ్లే పిల్లలు, వృద్ధులతో పాటు తాము కూడా ఈ విష వాయువునే పీల్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని, చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు.గత రెండు వారాలుగా దేశ రాజధానిలో గాలి నాణ్యత బాగా క్షీణించింది. ఆదివారం కూడా అలాంటి పరిస్థితే కన్పించింది. అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది.

## ప్రస్తుతం ప్రపంచం ముంగిట అనేక సవాళ్లు

కాకుండా టెక్నాలజీ పరంగానూ మరింత ముందుకు వెళ్లాలన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆధునిక ఘర్షణలను ఎదుర్కోవడానికి భారత్ సమాయత్తమవుతుందని ద్వివేది తెలిపారు. ఇందుకోసం త్రివిధ దళాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచంలోని పలు దేశాల మధ్య యుద్ధాలను ఆపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరచూ గొప్పలు చెప్పుకోవడం, ప్రపంచ దేశాలపై ఇష్టానుసారం సుంకాలు విధించడం వంటి చర్యల నేపథ్యంలో ద్వివేది ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## మమ్మల్ని ఘర్షణల్లో ఉంచాలనేది భారత్ ప్రణాళిక

చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే.. దానికి ఆ దేశమే జవాబుదారీగా ఉంచే నిబంధనలు చర్చల్లో ఉన్నాయన్నారు. తమవైపు నుంచి ఎలాంటి శత్రు కార్యకలాపాలు జరగడం లేదన్నారు. అఫ్గానే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవల పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ క్రమంలో కాల్పుల విరమణ కొనసాగింపునకు రెండు దేశాలు ఇటీవల అంగీకరించాయి. వీటి మధ్య సయోధ్య కుదిర్చేందుకు తుర్కియే, ఖతార్‌లు ప్రయత్నిస్తున్నాయి. నవంబరు 6న ఇరుదేశాల మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయి.

## కెన్యా విరిగిపడిన కొండ చరియలు..

**21 మంది మృతి**

**నైరోబీ(జనంసాక్షి):** కెన్యా: ఆఫ్రికా దేశం కెన్యాలో విషాదం చోటు చేసుకుంది. కొండచరియలు విరిగిపడి 21 మంది చనిపోగా, 30 మందికి పైగా గల్లంతయ్యారు. దక్షిణ కెన్యా ప్రాంతంలోని మారాక్‌వెట్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండచరియలు విరిగిపడ్డాయని దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి వెల్లడించారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని సదరు మంత్రి తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

# జయప్రదంగా ముగిసిన శ్రీచైతన్య స్కాలర్షిప్ టెస్ట్

- 12,519 మంది రికార్డుసంఖ్యలో విద్యార్థుల హాజరు
- విద్యార్థులకు శ్రీ చైతన్య అధినేత రమేష్ రెడ్డి అభినందనలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) :** కరీంనగర్‌లో ప్రసిద్ధిగాంచిన ఇంటర్మిడియేట్ విద్యాసంస్థల ఐఐటి, నీట్ ఆకాడమీ ఆధ్యర్యంలో పదవ తరగతి విద్యార్థులలో ప్రతిభను వెలకితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ నెల 2న, ఆదివారం రోజు నిర్వహించిన స్కాలర్షిప్ టాలెంట్ టెస్ట్ – 2025 కు రికార్డు సంఖ్యలో 12,519 విద్యార్థులు నమోదు చేసుకోని హాజరయ్యారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన పది కళాశాలలో ఈ పరీక్షను అత్యధిక నమోదు శాతంతో విజయవంతంగా నిర్వహించారు. పరీక్ష పై అత్యంత ఆసిక్తిని కనబర్చి ఉత్సాహంగా అత్యధిక సంఖ్యలో వ్రాసిన విద్యార్థులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధినేత ముద్దసాని రమేష్ రెడ్డి అభినందనలను, శుభాకాంక్షలను తెలిపారు. ఉహించని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో 12వేలకు పైచిలుకు విద్యార్థులు ప్రతిభా పరీక్షకు హాజరు అయి ఉత్తర తెలంగాణాలో ప్రతిభా పరీక్ష పట్ల విద్యార్థులకు గల ఆసక్తికి నిదర్శనమని, అందుకు గాను చాలా సంతోషంగా ఉందని అనందం వ్యక్తం చేసారు. విద్యార్థులను ప్రోత్సాహించిన తల్లిదండ్రులకు, పాఠశాల కరస్పాండెంట్లకు, అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభ, ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు ఉచిత, రాయితీలతో కూడిన నాణ్యమైన విద్యను ఐఐటి–జెఈఈ మేయిన్స్, నీట్ ఎప్సట్ శిక్షణతో కూడిన ఇంటర్మీడియట్ విద్యను కార్పోరేట్ స్థాయిలో అందంచాలనే ఉన్నత లక్ష్యంతో ఈ స్కాలర్ఫ్ టెస్ట్ నిర్వహించామని, ఈ పరీక్షలో ప్రతిభ మార్కుల ఆధారంగా




100% ఉచిత విద్యను ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి లాప్టాప్, 2 నుండి 10 వరకు బహుమతులకు టాబ్స్ , రివార్డులు అందజేస్తామని అన్నారు. ఈ పరీక్షలో హజరైన విద్యార్థులందరకీ కూపన్లను అందజేసి, లక్కీ డ్రాలో వెలుబడిన మొదటి మూడు కూపన్ లకు ప్రోత్సాహక బహుమతులను స్మార్టివి, సైకిల్, సెల్ఫోను లను అందించారు. మొదటి బహుమతి జి. వర్షిణి, జిల్లా పరిషత్ హై స్కూల్ ధర్మారం, రెండవ బహుమతి పి. శ్రీనిధి టిఎస్ మాడల్ స్కూల్, హుస్నాబాద్, మూడవ బహుమతి మహియా మహ్మద్, కాకతీయ హైస్కూల్, కరీంనగర్ గెలుచుకోనగా రమేష్ రెడ్డి చేతుల మీదుగా వారు బహుమతులను అందుకున్నారు. ఈ ప్రతిభ పరీక్ష ఫలితాలను విద్యార్థులకు 3 నుండి 4 రోజులలో ప్రకటించి తెలియ పరుచ గలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, శ్రీచైతన్య కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు

- అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్‌పై చర్యలు
- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, నవంబర్ 2 (జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలవుతున్న నిషేధాజ్ఞలను మరో నెల రోజులు పొడిగించా రు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వీధుల్లో అసభ్య పదజాలం, ఆగడాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ చర్యలు అనివార్యమని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు నవంబర్ 1 నుండి డిసెంబర్ 1 వరకు అమలులో ఉంటాయి. పరిస్థితుల బట్టి మరింత పొడిగిం చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫసలీ నిబంధనలకు అనుగుణంగా ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో అనుమతి లేని డ్రోన్ ఆపరేషన్, డీజే సౌండ్స్ వినియోగంపైనా నిషేధాజ్ఞలు పొడిగించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం అరికట్టేందుకు భారీ డీజే సౌండ్స్‌పై ఆంక్షలు విధించినట్లు వివరించారు. వివిధ కార్యక్రమాల్లో మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరని సూచించారు. ఏ ప్రాంతంలో ఎంత స్థాయి మైక్ వినియోగం అనే వివరాలు కూడా పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు కూడా నవంబర్ 1 నుండి డిసెంబర్ 1 వరకు కొనసాగుతాయి. అదేవిధంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 7(1), 2016, సెక్షన్ 22(1)(ఎ) నుండి (ఎఫ్), 22(2)(ఏ, బీ), 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫసలీ నంబర్ 11, పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 30 ప్రకారం నవంబర్ 1 ఉదయం 6 గంటల నుండి డిసెంబర్ 1 ఉదయం 6 గంటల వరకు అమలు ఉంటుంది. ఈ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. ఏదైనా కార్యక్రమం చేపడితే ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలి. బంద్ పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించేందుకు ఒత్తిడి, బెదిరింపులు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్న నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కమిషనర్ కోరారు.

## ఎలైట్ హెూటల్ ను ఘనంగా ప్రారంభించిన ప్రముఖ నటి క్యాథరీన్ ట్రెసా



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి):** తెలంగాణలో తమ నూతన హెూటల్ బ్రాంచ్ ను కరీంనగర్ – రేకుర్తి రోడ్ లో ఘనంగా ప్రారంభించినట్లు ఏ యూనిట్ ఆఫ్ ఎల్లో సాఫ్టైర్ హెూటల్ వెల్లడించింది. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ నటి రెజీనా కాసాండ్రా ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా నటి రెజీనా కాసాండ్రా మాట్లాడుతూ... కరీంనగర్‌లో ఎలైట్ హెూటల్‌ను ప్రారంభించ డం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అత్యాధునిక, ఉన్నత స్థాయి పరిమాణాలతో హెూటల్‌ను, రెస్టారెంట్‌ను రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించడం ప్రాముఖ్యతను చెప్పింది. అలాగే కరీంనగర్ స్మార్ట్ సిటీకి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. అలాగే యూనిట్ ఆఫ్ ఎల్లో స్యాఫ్టైర్ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ గోలి ప్రవీణ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తనను ఆదరించడానికి వచ్చిన అభిమానులందరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనిట్ ఆఫ్ ఎల్లో స్యాఫ్టైర్ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ గోలి ప్రవీణ్ కుమార్ మాట్లాడు తూ... ఎలైట్‌ను కరీంనగర్‌కు విస్తరించడానికి మేము సంతోషిస్తున్నామని, వీటి తో పాటు ఎలైట్ కూచిపూడి రెస్టారెంట్, బాంకెట్ హాల్ అందుబాటులో ఉందని తెలిపారు. హెూటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన బంధువులకు, ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు మహేష్ అచంతా, షఫీ, కేశవ్ అభిమానులతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫ్ ఎల్లో స్యాఫ్టైర్ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ గోలి ప్రవీణ్ కుమార్, భూపతి మధుకర్, ఉస్కామల్ల పున్నం చందు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, పొన్నం సత్యం, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాల్య వివాహా నిరోధక చట్టంపై అవగాహన



**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల నందు బాల్య వివాహ నిరోధక చట్టం 2006 అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళ సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 గురించి వివరించడం, బాల్య వివాహం చేసుకున్న వారికి విధించే శిక్షణ గురించి వాటి యొక్క నష్టాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. మానవ అక్రమ రవాణా వాటి అర్థాలను వివరిస్తూ, బేటి బచావో బేటి పడావో, ఆడపిల్ల చదువు ప్రాముఖ్యత తెలిపారు. 18 సంవత్సరాలు నిండక ముందు పెళ్లి చేసుకున్నట్లయితే వాటి వల్ల కలిగే మానసిక శారీరక ఆర్థిక అనర్థాలు, ఆడపిల్ల పుట్టడం బ్రతకడం ఎదగడం చదవడం దాని నినాదాన్ని వివరించారు. 100, 1098, 181, 112, మొదలైన టోల్ ఫ్రీ నెంబర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నషా ముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడుకేటర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక్ దీపాల పక్కనే భక్తుల క్యూ లైన్

### ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు..?

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 2 (జనంసాక్షి). కార్తీక మాసం.. పరమ పవిత్రమైన మాసంగా భక్తులు భావిస్తుంటారు. పరమశివుని అనుగ్రహం కోసం భక్తులు వేములవాడ రాజన్న ఆలయానికి అధిక సంఖ్యలో తరలి వస్తునారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే భక్తులకు భీమేశ్వరాలయంలో అభిషేకాలు, కోడె మొక్కులు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, నిత్య కళ్యాణం, ఇతర పూజ కార్యక్రమాలు కొనసాగిస్తూనే రాజన్న ఆలయంలో లఘు దర్శనం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో రాజన్న ఆలయ ముందు భాగంలో రావిచెట్టు దగ్గర రథం పై స్వామివారి దర్శనాన్ని సైతం భక్తులకు కల్పిస్తున్నారు. లఘు దర్శనం చేసుకున్న భక్తులు రథంపై స్వామివారిని దర్శించుకునేందుకు ముందు భాగం నుంచి వెళ్తుండడంతో భారీ క్యూ లైన్ ఉంటుంది. అటు నుంచి రాజన్న ఆలయంలోకి వచ్చేవారు సైతం ఇక్కడి నుంచి వస్తుంటారు. కార్తీక మాసం సందర్భంగా ఇదే ప్రాంతంలో భక్తులు అధిక సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగిస్తున్నారు.భక్తులు వచ్చే పోయే మార్గంలో కార్తీక



దీపాలను వెలిగించేటువంటి స్టాండ్ ఏర్పాటు చేయడంతో అనుకొని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని పలువురు భక్తులు ఆలయ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం చోటు చేసుకోక ముందే నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కార్తీకదీపం వెలిగించే స్టాండ్ రద్దీ లేని చోటకు తరలించడంతో పాటు భక్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కరీంనగర్‌లో షోరూమ్‌ను ప్రారంభించిన కిస్నా

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి):** తెలంగాణలో తమ 5వ ప్రత్యేక షోరూమ్‌ను కరీంనగర్ లో గౌరీశెట్టి కాంప్లెక్స్‌లో ఘనంగా ప్రారంభించినట్లు కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ వెల్లడించింది. ఈ ప్రారంభోత్సవానికి హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవాన్ని వేడుక జరుపుకోవడానికి, వజ్రాల ఆభరణాల మేకింగ్ ఛార్జీలపై 75% వరకు తగ్గింపు, బంగారు ఆభరణాల మేకింగ్ ఛార్జీలపై 25% వరకు తగ్గింపును కిస్నా అందిస్తోందని, అలాగే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులపై అదనంగా 5% తక్షణ తగ్గింపును అందిస్తోంది. కిస్నా ప్రత్యేక షాప్, విన్ ప్రచారాన్ని కూడా నిర్వహిస్తోంది, ఇక్కడ వినియోగదారులు వజ్రాలు, బంగారు ఆభరణాల కొనుగోలుపై 1000కు పైగా స్కూటర్లు , 200 కు పైగా కార్లను గెలుచుకునే అవకాశం ఉంది. హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా మాట్లాడుతూ... తెలంగాణ మాకు బలమైన, అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అని రాష్ట్రంలో మా 5వ ప్రత్యేక షోరూమ్‌తో, కిస్నా తమ లక్ష్య కేంద్రీకృత రిటైల్ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తోందని, భారతదేశ వ్యాప్తంగా ప్రతి కీలక ప్రాంతంలో తమ కార్యకలపాల ఉనికిని నిర్ధారిస్తుంది. భారతదేశంలోని ప్రతి మహిళకు వజ్రాభరణాలను అందుబాటులోకి తీసుకురావడానికి కోరదగినదిగా చేయడానికి మేము మా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నందున, ఇది మా లక్ష్యమైన 'హర్ ఘర్ కిస్నా'కి మమ్మల్ని మరింత దగ్గర చేస్తుందన్నారు. కిస్నా డైమండ్, గోల్డ్ జ్యువెలరీ సీఈఓ పరాగ్ షా మాట్లాడుతూ...



"కిస్నా పరిధిని కరీంనగర్‌కు విస్తరించడానికి మేము సంతోషిస్తున్నామని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కాదు, ప్రతి రోజు, ప్రతి మహిళ ప్రయాణంలో వజ్రాల ఆభరణాలను ఒక భాగంగా చేయడమే మా లక్ష్యం అన్నారు. కిస్నా ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్ భాగస్వాములు సాయి వరుణ్ గౌరిశెట్టి, సాయి కృష్ణ నార్లా మాట్లాడుతూ...కిస్నా యొక్క విశ్వసనీయ పనితనం, సొగసైన కలెక్షన్‌లను కరీంనగర్‌కు తీసుకురావ డానికి మేము సంతోషిస్తున్నామని, కిస్నా వంటి బ్రాండ్‌తో భాగస్వామ్యం చేసుకోవడం వల్ల నగరంలోని మా కస్టమర్లకు షాపింగ్ అనుభవాన్ని పునర్నిర్వచించగలమని అన్నారు. సమాజానికి తిరిగి ఇవ్వడంలో కిస్నా నిబద్ధతకు అనుగుణంగా, బ్రాండ్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. నిరుపేదలకు ఆహార పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం ను నిర్వహించిందన్నారు

# యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- కొనుగోలు కేంద్రం సందర్శించిన సందర్భంగా బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

**చిగురుమామిడి అక్టోబర్2 (జనంసాక్షి):** యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు సెంటర్ల వద్ద ఉన్న వరి ధాన్యాన్ని తూకం వేసి మిల్లర్లకు తరలించాలని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం చెప్పే మాటలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు,మాజీ సింగిల్ విండో చైర్మన్ కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండిపడ్డారు.ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గునుకులపల్లే గ్రామంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను రాంగోపాల్ రెడ్డి సందర్శించి, రైతులతో మాట్లాడారు.భారీ వర్షాలకు సెంటర్ లో వరి ధాన్యం మొలకలు ఎత్తి రైతులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.మరో తుఫాను వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలు సెంటర్ల వద్ద ఉన్న ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని సర్వే చేసి ఆదుకోవడంలో చేతులు దులుపుకునే



ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని,వెంటనే సర్వే చేసి అట్టి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లయితే కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందుకు వస్తుందన్నారు. ఇప్పటికే రైతులకు చాలా నష్టం జరిగిందని మరోసారి నష్టం జరగకుండా ఉండాలంటే యుద్ధ ప్రాతిపదికన తడిసిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లర్లకు తరలించాలని రాంగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బరిగెల మోహన్, గూళ్ల రాజు,బుర్ర శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కూన పోచయ్య,రైతు సంఘం నాయకులు కాంతల శ్రీనివాస్ రెడ్డి,కూన ముత్తయ్య,బజారు రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి,అల్వాల శ్రీనివాస్ రెడ్డి,కూన భూమయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం

- గతంలో ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇప్పుడు ఇచ్చేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే
- నగునూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) :** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నంగునూరులో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వంపై ఆర్థిక భారం పడ్డప్పటికీ నియోజక వర్గానికి మూడు వేల అయిదువందల ఇండ్లు కట్టిస్తున్నామని అంతేగాక మిగిలిన అర్హత గల లబ్ధిదారులకు విడుతల వారీగా ఇండ్లు నిర్మించి ఇస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సాయిల్ల మౌనికా మహేష్ ఇంటికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మణ్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల్ల రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్, ముద్దసాని యాదగిరి, బత్తిని శ్రీనివాస్, కొత్తకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలలో కర్ర రాజశేఖర్ ప్యానల్ ఘన విజయం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) :** కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కర్ర రాజశేఖర్ ప్యానల్ రాజకీయ పార్టీలకు అతీతంగా భారీ మెజార్టీతో గెలుపొందింది. బ్యాంకు డైరెక్టర్ల స్థానాల కోసం జరిగిన ఎన్నికల్లో సభ్యుల మద్దతుతో రాజశేఖర్ ప్యానల్ పూర్తి ఆధిక్యం సాధించింది. ఈ విజయంతో సహకార రంగంలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగిందని అధికారులు తెలిపారు. విజయానంతరం కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ...ఇది వ్యక్తిగత గెలుపు కాదు, సభ్యుల విశ్వాసానికి నిదర్శనం అని రాజకీయాలకు అతీతంగా సహకార స్ఫూర్తితో బ్యాంక్ అభివృద్ధి దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. రాజశేఖర్ ప్యానల్ విజయం నేపథ్యంలో బ్యాంకు సభ్యులు, సహకార సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ నిఖీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం అంతర్గం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదయ్యే కేసుల వివరాలతో పాటు, గ్రామాల వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి రికార్డ్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పెండింగ్ కేసులపై సీపీ ఆరా తీయడం జరిగింది.

# రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన యత్నం





- ఉద్రిక్తతకు దారితీసిన బీజేపీ శ్రేణుల ఆందోళన

**తంగళ్ళపల్లి నవంబర్ 02 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులో ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మానేరు వంతెన వద్ద భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తంగళ్ళపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు మానేరు వంతెన వద్దకు చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, వారు ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు విన్నమనేని శ్రీధర్ రావు మాట్లాడుతూ
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార దర్పాన్ని, బాధ్యతా రాహిత్యమైన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందనీ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తుంది అని హెచ్చరించారు. దిష్టిబొమ్మ దహనం యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నప్పటికీ, బీజేపీ శ్రేణులు తమ నిరసనను వినూత్న పద్ధతిలో తెలియజేసి ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కోలా ఆంజనేయులు, జిల్లా మీడియా కన్వీనర్ రాజు రావు, మండల ఉపాధ్యక్షుడు రెడ్డి మల్ల ఆశీర్వాద్, చిన్నం నరేష్ చిందం నరేష్, బోలగం భాస్కర్, కటకం మధుసూదన్, కన్నె అరుణ్ కుమార్, బొలగం సత్యం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాగిరెడ్డిపల్లెలో భారీ వర్షానికి
# తెగిపోయిన కట్టుకాలువ

- వరద ప్రవాహానికి 25ఎకరాల్లో కొట్టుకుపోయిన వరి పంట..
- కట్టతెగడంతో పొలంలో ఇసుక మేటలు..
- అధికారులు సర్వే చేసి పరిహారం చేయాలని రైతుల విజ్ఞప్తి..
- కూలిపోయిన మూడు వ్యవసాయ బావులు

**చిగురుమామిడి అక్టోబర్2 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో గాగిరెడ్డిపల్లి గ్రామంలో కురిసిన భారీ వర్షం రైతులకు కన్నీరు మిగిల్చింది.గాగిరెడ్డిపల్లె సంగోజిపేట చెరువు మత్తడి ప్రవాహం ఊహించని విధంగా పెరగడంతో చెరువు కింద ఉన్న వరద ఉధృతికి కట్టు కాలువ మొత్తం తెగిపోయింది.ఒక్కసారిగా వరద ప్రవాహం పెరగడం మూలంగా 25ఎకరాల్లో భారీ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదగొని మధుసూదన్, బత్తిని రాజయ్య,మల్యాల శ్రీనివాస్ కు చెందిన వ్యవసాయ బావులు సైతం ఈ వరద ప్రవాహానికి కూలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సుదగొని వీరస్వామి,మెరుగు వెంకటేశం, సుధగోని మధుసూదన్, మెరుగు అంజయ్య, మల్యాల శ్రీనివాస్,మల్యాల బిక్షపతి, బత్తిని స్వామి,గుడికందుల శ్రీనివాస్, మెరుగు సాంబయ్య,బత్తిని పరుశు రాములు లకు చెందిన దాదాపు 25ఎకరాల్లో పంట వరదకొట్టుడుకు పూర్తిగా కొట్టుకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.భారీ వర్షాలు కురిసి 5రోజులు గడిచిన అధికారులు ఎవరు తమను పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు.వరదకొట్టుడుకు విద్యుత్ వైర్లు తెగిపోయినట్లు కూడా రైతులు పేర్కొన్నారు.ప్రభుత్వం నష్టపరిహారంతోపాటు



పొలంలోకి వచ్చిన ఇసుక మేటలను తొలగించేందుకు,కుడిపోయిన బావుల్లో పూటిక మట్టి తీసేందుకు ఆర్థిక సహాయం అందజేయాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.గతంలో ఇలాగే గొలుసుకట్టు కాలువ తెగిపోవడంతో లక్ష యాభై వేల రూపాయలు అప్పు చేసి మరి పోయించడం జరిగిందని రైతులు తెలిపారు.నష్టపోయిన తమ పంట చేన్లను అధికారులు పరిశీలించి పరిహారం అందజేయాలని రైతులు దీనంగా వేడుకుంటున్నారు.

# అభివృద్ధిని మరిచి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- దేశాన్ని అగ్ర భాగాన నిలిపిన బిజెపిపై అనుచిత వాక్యాలు సరికావు
- ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా సుల్తానాబాద్ మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి కాయం. ఆటకెక్కిన ఆరు గ్యారంటీలు
- మిట్టపల్లి ప్రవీణ్ కుమార్





**సుల్తానాబాద్, అక్టోబర్ 02(జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయక ఆటకెక్కిన అవేమి పట్టించుకోకుండా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి బిజెపి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బిజెపి పై అనుచిత వాక్యాలు చేయడం సిగ్గుచేటని బిజెపి మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, సీనియర్ నేత మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. బిజెపిని విమర్శించడం మాని 6 గ్యారంటీలపై దృష్టి సారించాలని సీఎంకు హితవుపలికారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలు గడిచిన అభివృద్ధిని మరిచి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశాన్ని అగ్ర భాగాన నిలిపిన బిజెపి నేతలపై అనుచిత వాక్యాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శమని బిజెపి పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఆదివారం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పూసాల చౌరస్తా రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టి, ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు సంవత్సరాలు గడిచిన ఇచ్చిన హామీలను అమలు పరచడంలో వైఫల్యం చెంది అనతి కాలంలోనే ప్రజల మన్నలను కోల్పోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇలాంటి ముఖ్యమంత్రి గతంలో ఎప్పుడు చూడలేదని ఆరోపించారు. భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిపిన బిజెపి ప్రభుత్వంపై ,మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై, అనుచిత వాక్యాలు చేయడం సిగ్గుచేటని తక్షణమే ముఖ్యమంత్రి, మంత్రులు రేవంత్ రెడ్డి తన మాటలను వెనక్కు తీసుకొని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తున్న బిజెపి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అన్నారు. కేంద్రంలో ప్రధాని వద్దకు వెళ్లి నిధుల కోసం మోకరిల్లుతూ రాష్ట్రానికి వచ్చి బిజెపిని దూషించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాటిగా మారిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో రైతులు అకాల వర్షంతో నష్టపోతే పరామర్శించిన దాఖలాలు లేవని అన్నారు. రైతులను పట్టించుకున్న పాపాన పోని దౌర్భాగ్య ప్రభుత్వం అని, వెంటనే నష్టపోయిన రైతులకు పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. రానున్న రోజులలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, మండల ప్రభారీ కామని రాజేంద్రప్రసాద్,మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము తిరుపతి,జిల్లా కౌన్సిల్ మెంబర్ వెగోళం శ్రీనివాస్ సీనియర్ నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, మండల ప్రధానకార్యదర్శి కోట నాగేశ్వర్,ఉషన అన్వేష్,గుంటి కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్లకొండ మహేష్, మెంగాని రామకృష్ణ, పెర్క రమేష్, చిట్టవేని సదయ్య, శేఖర్ మాష్టర్,జెట్టి శ్రీనివాస్, నల్లవెల్లి శంకర్, మనోహర్,సలిగంటి కొమురయ్య, ఎల్లయ్యలతో పాటు, తదితరులు పాల్గొన్నారు.

## 17% మ్యాచర్ పేరుతో కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలి

- ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోలు వేగవంతం చేయాలి
- అన్నం పెట్టే అన్నదాతలను గోస పెట్టకండి
- ప్రభుత్వానికి కడారి సునీల్ ప్రత్యేక విజ్ఞప్తి



**సుల్తానాబాద్,అక్టోబర్ 02(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా 14 మండలాల్లో 247. పిఏసిఎస్ (పాక్స్) 85.ఐకేపీ. 3.హాక్ మొత్తం పెద్దపెల్లి జిల్లాలో 335 ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు రైతులకు అందుబాటులో ప్రభుత్వం ఏర్పటు చేసినందుకు జిల్లా అధికారులకు ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందుబాటులోకీ మార్కెట్లను తీసుకువచ్చినా ప్రజా ప్రతినిధుల రిబ్బన్ కటింగ్లకు, వేచి చూడడం, రైతులు నిరీక్షించడం బాధాకర మన్నారు. 17% మ్యాచర్ అంటూ కొర్రీలు పెట్టకుండా రైతుల ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి తరలించాలని రైతులు కన్నీరు పెట్టకుండా చూడాలని ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కడారి సునీల్ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు సగం వరకు ప్రకృతి బీభత్సానికి గురయ్యాయని మిగిలిన పంట మార్కెటుకు వస్తే మ్యాచర్ పేరుతో వెయిటింగ్ చేపించడం సరికాదని అన్నారు. కొనుగోలు స్పీడు చేయాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

- గింజ కటింగ్ లేకుండా కొనుగోల్లు
- కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణారావు



**సుల్తానాబాద్, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సూచించారు. ఆదివారం మండలంలోని ఐతురాజు పల్లి గర్రెపల్లిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యాన్ని కాంట్రాయాలని సూచించారు. గత ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను దోపిడీ చేసిందని కానీ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రైతులకు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, కల్లేపల్లి జానీ, జూపల్లి తిరుమలరావు, పులి వెంకటేశం, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రావు, గుజేటి వెంకన్న, సంఘ సీఈవో నభియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ తావాకల్ నగర్, జై ప్రకాష్ నగర్ కాలనీ,అంబేద్కర్ నగర్, ఇంజనీర్స్ కాలనీ, అలీ నగర్, సైస్ నగర్ ప్రాంతాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తన అనుచరులతో ప్రచారం నిర్వహించారు. 11వ తేదీన జరగబోయే ఉప ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ ను గెలిపించాలని కోరుతూ స్థానిక నాయకులతో కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలందరికీ ఎమ్మెల్యే విజయరమణారావు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు, డివిజన్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఆడబిడ్డకు పుట్టింట్లో సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్

- బోడుప్పల్లో 350వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్,కొత్త స్రవంతి కిషోర్ గౌడ్



**బోడుప్పల్, అక్టోబర్ 02(జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 350వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ ఎంపిటిసి నత్తి జంగమ్మ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్రవంతి కిషోర్ గౌడ్ మాట్లాడుతూ తన జీవితాన్ని త్యాగం చేసి భారతీయులకు అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన మహానాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, ఆయన ఆశయాలు ఆకాంక్షల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, విజయవంతంగా 350 వారాలుగా జ్ఞానమాల నిర్వహిస్తున్న అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ ఆడ, మగ అనే తేడా లేకుండా పుట్టింట్లో కూడా ఆడబిడ్డలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, ఆయన కల్పించిన సమాన హక్కుల ఫలితంగానే నేడు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మహిళలు రాణిస్తున్నారని మైసయ్య అన్నారు.

ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బహుజన ఉపాధ్యాయ సంఘం స్టేట్ సెక్రెటరీ ఇటుకల రవీందర్, గరుగుల యాకయ్య, సగ్గు నరసింహ, వై శ్రీనివాస్, బండారి సాయి, జడ శ్రీనివాస్ , ఏ రాజేష్, యేసు రాజు, బెక్కం శివ, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన

- ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు
- స్వామివారిని దర్శించు కున్న నేతలు, కురుమ సంఘం సభ్యులు



**తాండూరు నవంబర్ 2(జనంసాక్షి) :** పట్టణసమీపం హైదరాబాద్ రోడ్డు మార్గంలోని బీరప్ప స్వామి దేవాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాతపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయ కమిటి, తాండూరు నియోజకవర్గ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాతపన ఉత్సవాల సందర్భంగా దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో బీరప్ప స్వామి కళ్యాణోత్సవం కనుల పండుగగా జరుపుకున్నారు. కురుమ సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున దేవాలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్, పార్టీ నాయకులు, కురుమ సంఘం నాయకులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళ భక్తులు తమ ఇండ్ల నుంచి బోనాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు భావనోళ్ల హన్మయ్య, రిటైర్డ్ ఉద్యోగి హన్మయ్య, న్యాయవాది కె.గోపాల్, పూజారి పాండు, జినుగుర్తి నర్సింలు, చీమల నర్సింలు, మహిపాల్, గౌడి వెంకటేషం, గౌడి సత్యం, గౌడి రాము, నాగారం జగదీష్, నాగారం మల్లేశం, తోపాజీ రమేష్, మరాఠీ నర్సింలు, మిట్టి మహేష్, మిట్టి శ్రీశైలం, ఇందూరు మల్లేశం, బిజ్జారం కిష్టప్ప, ఖాంజాపూర్ శ్రీశైలం, శ్రీనివాస్, మాణిక్ రావు, రమేష్, ఇందూరు బాలు, దోమ శ్రీశైలం, మంబాపూర్ రాజు, బొంబాయి శివరాజ్, పల్లె వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ బాలప్ప, మాజీ సర్పంచ్ కుర్వ బాలప్ప, కాశింపూర్ మల్లేశం, దోమ భీమయ్య, గోపాలకృష్ణ, సతీష్, పగిడ్యాల శేఖర్, దాతలు జనగామ పెద్ద నర్సప్ప, చుక్క గోపాల్, రిటైర్డ్ ఉద్యోగి బండ హన్మయ్య, కుమారులు, ఏఎస్ఐ వెంకట రమణ, నర్సింలు, బీజేపీ నాయకులు బంటారం భద్రేశ్వర్, దోమ కృష్ణ, మంతటి రాజు, సందీప్, తాండూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కురుమ సంఘం పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## పేదింటి యువకుడి ప్రాణాలు కాపాడిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి

- రూ. 12,50లతో యువకునికి కార్పొరేట్ వైద్యం
- కామినేని ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించిన రాజ్ గోపాల్ రెడ్డి
- రాజగోపాల్ రెడ్డి చేసిన సహాయానికి జీవితాంతం రుణపడి ఉంటామంటున్న కుటుంబ సభ్యులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మునుగోడు నియోజకవర్గ ప్రజలు





**మర్రిగూడ, నవంబర్ 2 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు నెల్లి గణేష్(26) గత కొద్ది కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు.. కిడ్నీలు దెబ్బతిన్నాయని కిడ్నీ మారిస్తే కానీ బ్రతకడని డాక్టర్లు చెప్పారు.. కిడ్నీ మార్పిడి చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చవుతాయని కూడా చెప్పారు.. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు అంత డబ్బు తమ దగ్గర లేకపోవడంతో భగవంతునిపై భారం వేసి రోజులు వెలదీస్తున్నారు.. నెల్లి గణేష్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో విషయాన్ని స్థానిక నాయకులు మునుగోడు శాసనసభ్యుల దృష్టికి తీసుకువచ్చారు.. వెంటనే తన వ్యక్తిగత సిబ్బందిని ఆసుపత్రికి పంపించి కిడ్నీ మార్పిడి చికిత్స చేయడానికి కావలసిన ఏర్పాటు చూడాలని ఆదేశించారు. 12.50 లక్షల రూపాయలను కామినేని ఆసుపత్రికి చెల్లించి గణేష్ కు కిడ్నీ మార్పిడి చికిత్స చేయించారు.. చికిత్స అనంతరం ఆదివారం కామినేని ఆసుపత్రికి వెళ్లి గణేష్ బాగోగులు తెలుసుకున్నారు.. గణేష్ కుటుంబ సభ్యులకు నేనున్నాను మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు.. తన కుమారునికి సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించి కార్పొరేట్ వైద్యం అందించిన రాజగోపాల్ రెడ్డికి గణేష్ తల్లిదండ్రులు చేతులెత్తి నమస్కరించారు. నా కుమారునికి పునర్జన్మ ప్రసాదించావన్నారు. నెల్లి గణేష్‌కు సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించడంతో గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉదార స్వభావానికి సహాయం చేసే గుణానికి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### భారత మహిళలు ప్రపంచకప్ గెలుస్తారు : అజరుద్దీన్

భారత మహిళల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంటుందని మాజీ క్రికెటర్ ముహమ్మద్ అజరుద్దీన్ ధైర్యపూరిత అంచనా వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 2025లో భారతదేశంలో జరగనున్న టోర్నీకి సిద్ధమయ్యే జట్టు ఫార్మ్, బ్యాటింగ్-బౌలింగ్ బ్యాలెన్స్ అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. అజరుద్దీన్ ఈ కామెంట్‌ను ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో చేశారు, ఇది క్రికెట్ ప్రియుల్లో ఉత్సాహాన్ని మేల్కొల్పింది. "హర్మాన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో జట్టు ఏకరాగంగా ఆడుతోంది. స్మృతి మండణ, రితు సింగ్ లాంటి స్టార్లు కీలక పాత్ర పోషిస్తారు. ఇండియాలోనే జరిగే ప్రపంచకప్‌కు హోమ్ అడ్వాంటేజ్ ఉంటుంది. మనమే గెలుస్తామని నమ్ముతున్నాను" అని అజరుద్దీన్ తెలిపారు. ఈ అంచనా మహిళల క్రికెట్‌కు పెద్ద బూస్ట్‌గా మారింది. ఇటీవలి సిరీస్‌ల్లో భారత మహిళలు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌పై విజయాలు సాధించి ఆత్మవిశ్వాసంగా ఉన్నారు. బ్యాటింగ్‌లో శఫాలి వర్మ, దేవికా వైట్ ఓపెనింగ్ కాంబో బలపడింది, మిడిల్ ఆర్డర్‌లో జేమిమా రాదర్‌ఫోర్డ్ స్థిరత్వం తీసుకువస్తోంది. బౌలింగ్‌లో రన్-మెషిన్ రాణీ జైస్వాల్, శ్రేయా ఐయర్ స్పిన్ ఆప్షన్లు మరింత మెరుగుపడ్డాయి. అజరుద్దీన్ మాటలు జట్టు ప్రేరణగా మారతాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 2017లో ఫైనల్‌లో ఓటమి తర్వాత భారత మహిళలు 2020, 2023లో సెమీలకు చేరుకున్నారు. ఈసారి టైటిల్ కోసం అందరూ ఆశలు పెట్టు కున్నారు.

# రాణించిన పంత్

- అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు భారీ విజయం!
- తనుష్ కొతియాన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
- మూడో రోజు సఫారీ ఏ జట్టును కుప్పకూల్చిన భారత్
- నవంబర్ 6న మైసూరులో రెండో టెస్టు





**బెంగళూరు, నవంబర్ 2 (జనంసాక్షి) :** గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు సెంచరీతో చెలరేగి, భారత ఏ జట్టును భారీ విజయానికి దారితీసాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన తొలి అనధికారిక టెస్టులో దక్షిణాఫ్రికా ఏ జట్టుపై మూడు వికెట్ల తేడాతో భారత ఏ జట్టు గెలిచింది. 275 పరుగుల లక్ష్యాన్ని ఆరు రోజుల్లో సాధించిన భారత్, రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పంత్ (90) రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికించి హాఫ్ సెంచరీ చేజార్చుకున్నా, తనదైన దూకుడుతో జట్టుకు గెలుపు బాటలు వేశాడు. వెనుదిరిగాక మానవ్ సుతార్ (20 నాటౌట్), అన్షుల్ కంభోజ్ (37 నాటౌట్)లు పట్టుదలగా ఆడి మిగిలిన పరుగులు పూర్తి చేశారు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 8 వికెట్లు తీసిన తనుష్ కొతియాన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. రెండో అనధికారిక టెస్టు నవంబర్ 6 నుండి మైసూరులో జరగనుంది.

చివరి రోజు 156 పరుగులు లక్ష్యంగా పెట్టుకున్న భారత ఏ జట్టు, మూడో సెషన్‌లో కష్టాలు ఎదుర్కొంది. ఓవర్‌నైట్ స్కోర్ 119/4తో ఆరంభించిన జట్టు, తొలి సెషన్‌లోనే మరో మూడు వికెట్లు కోల్పోయింది. పంత్‌ను 90కి తీసిన తియాన్ వాన్ వూరెన్, ఆయుష్ బదోని (34), తనుష్ కొతియాన్ (23)లను కూడా తీసి 216/7కి జట్టును దిగజార్చాడు. అయితే, దాని తర్వాత క్రీజులోకి వచ్చిన మానవ్ సుతార్, అన్షుల్ కంభోజ్‌లు 62 పరుగులు భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు. ప్రెనెలాన్ సుబ్రయేన్ ఓవర్‌లో సుతార్ సిక్స్ కొట్టి విజయాన్ని ఖరారు చేశాడు. పంత్ 113 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులతో 90 పరుగులు చేసి, గాయం నుంచి తిరిగి వచ్చిన తన ప్రతిభను ప్రదర్శించాడు.

తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యాన్ని సాధించుకున్న భారత ఏ జట్టు, మూడో రోజు ప్రత్యర్థిని కుప్పకూల్చింది. ఓవర్‌నైట్ 30/0తో ఆరంభించిన దక్షిణాఫ్రికా ఏ జట్టుకు తనుష్ కొతియాన్ (4/26), అన్షుల్ కంభోజ్ (3/39)లు షాక్ ఇచ్చారు.

ఓపెనర్ లెసెగో సెనోక్వేనె (37), జుబయిర్ హంజా (37)లు టాప్ స్కోరర్లుగా నిలిచినా, మిగిలినవారు విఫలమయ్యా రు. 199కే ఆలౌటైన సఫారీ ఏ జట్టు, 275 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత ఏ జట్టు 32/3కి కుప్పకూలితే, పంత్ దూకుడుతో జట్టును కాపాడాడు.

తొలి ఇన్నింగ్స్‌లో భారత ఏ జట్టు 234 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (32), ఆయుష్ మాత్రే (65)లు మొదటి వికెట్‌కు 91 పరుగులు జోడించారు. కానీ, సఫారీ స్పిన్నర్ ప్రెనెలాన్ సుబ్రయేన్ (5/61) కీలక వికెట్లు తీసి దెబ్బకొట్టాడు.

కెప్టెన్ పంత్ (17) స్వల్ప స్కోర్‌కే ఔటైనా, ఆయుష్ బదోని (38), తనుష్ కొతియాన్ (13)లు కొంచెం పోరాడారు. అంతకు ముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత ఏ జట్టు, తనుష్ కొతియాన్ (4/83), గుర్నూర్ బ్రార్ (2/45)ల విజృంభణతో సఫారీ ఏ జట్టును 309కి ఆలౌట్ చేసింది. జోర్డాన్ (71), హంజా (66), రూబిన్ (54)లు మాత్రమే పెద్ద స్కోర్లు చేశారు. ఈ విజయంతో భారత ఏ జట్టు ఆత్మవిశ్వాసంగా రెండో టెస్టుకు సిద్ధమవుతోంది.

# టీమిండియా ఘన విజయం

### రాణించిన వాషింగ్టన్ సుందర్

- సుందర్ ధనాధన్ ఫిఫ్టీతో ఆసీస్‌కు షాక్
- అభిషేక్, సూర్య దూకుడు.. తిలక్ సపోర్ట్
- సిరీస్‌లో 1-1 సమం.. రేపు నాలుగో టీ20
- ఆసీస్ 186/6.. భారత్ 18.3 ఓవర్లలో ఛేజ్



ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో టీమిండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత్ 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులతో సాధించింది. వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్ 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. తిలక్ వర్మ (29 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), అభిషేక్ శర్మ (25 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (24 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఈ విజయంతో అయిదు టీ20ల సిరీస్‌లో భారత్ బలంగా తిరిగి రావడం గమనార్హం. టీమిండియా బ్యాటింగ్‌ను దూకుడుగా ప్రారంభిం చింది. మొదటి రెండు ఓవర్లలోనే అభిషేక్ శర్మ రెండు సిక్సులు, రెండు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. అయితే 3.3 ఓవర్‌లో నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత 5.3 ఓవర్‌లో శుభ్మన్ గిల్ (15) ఎల్లిస్ బౌలింగ్‌లోనే ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. రెండో మ్యాచ్‌లో విఫలమై న గిల్ మూడో మ్యాచ్‌లోనూ పెద్ద స్కోర్ చేయలేకపో యాడు. మంచి టచ్‌లో కనిపించిన సూర్యకుమార్ యాదవ్ 7.3 ఓవర్‌లో స్టోయినిస్ బౌలింగ్‌లో నాథన్ ఎల్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తిలక్ వర్మ మంచి ఆరంభం లభించినా పెద్ద స్కోర్ మలచలేకపోయాడు. జేవియర్ బార్ట్‌లెట్ బౌలింగ్‌లో జోష్ ఇంగ్లిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ దశలో జట్టు కష్టాల్లో పడినా, వాషింగ్టన్ సుందర్ క్రీజులోకి వచ్చి దూకుడుగా ఆడా డు. తన 23 బంతుల ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 4 సిక్సు లతో ఆసీస్ బౌలర్లను ఉతికేశాడు. చివరి ఓవర్లలో అవ సరమైన పరుగులు సులువుగా పూర్తి చేసి జట్టును గెలిపించాడు. ఈ విజయం టీమిండియాకు ఊపిరి పోసింది.

## స్వదేశానికి కుల్దీప్

ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్వదేశానికి తిరిగి రానున్నాడు. వన్డే, టీ20 సిరీస్ స్క్వాడ్‌కు ఎంపికైన కుల్దీప్‌ను టెస్టు సన్నద్ధత కోసం వెనక్కి పిలిచింది బీసీసీఐ. మూడో టీ20 తుది జట్టులో లేని ఈ మిస్టరీ బౌలర్ త్వరలోనే భారత ఏ జట్టు స్క్వాడ్‌తో కలుస్తాడు. దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ సన్నద్ధతలో భాగంగా రెండో అనధికారిక టెస్టులో ఆడనున్నాడు. దాంతో చివరి రెండు టీ20లకు కుల్దీప్ అందుబాటులో ఉండడు. మూడు ఫార్మాట్లలో సత్తా చాటుతున్న కుల్దీప్ దక్షిణాఫ్రికా సిరీస్‌లో కీలక పాత్ర పోషిస్తాడని బీసీసీఐ భావిస్తోంది. కుల్దీప్‌తో పాటు సీనియర్లు కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కూడా ఈ మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నారు. భారత ఏ, సఫారీ ఏ జట్ల మధ్య తొలి అనధికారిక టెస్టులో రిషభ్ పంత్ (90) హాఫ్ సెంచరీతో చెలరేగగా, తనుష్ కొతియాన్ బంతితో రాణించి 3 వికెట్ల తేడాతో గెలిపించాడు. రెండో మ్యాచ్ నవంబర్ 6 నుంచి మైసూరులో జరగనుంది.

భారత స్క్వాడ్ (నాలుగు, ఐదో టీ20లకు): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి, శివం దూబే, అక్షర్ పటేల్, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా. భారత ఏ స్క్వాడ్ : రిషభ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబే, తనుష్




# ఎస్టీపీ ఏర్పాటు వద్దే వద్దు

**ఉప్పల్ శివారు కాలనీవాసుల ఆందోళన**

**మద్దతు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్ నవంబర్ 02 ( జనం సాక్షి):** ఉప్పల్ శివారు కాలనీవాసుల ఆందోళన కొద్ది రోజులుగా కాలనీలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉప్పల్, కురుమనగర్, లక్ష్మీనర్సింహ్మాకాలనీల సమీపంలో చేస్తున్న మురుగు శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మా ణమే దీనికి ప్రధాన కారణం. స్థానికులు ఎస్టీ పీని తమ కాలనీల సమీపంలో నిర్మించవద్దని ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే రకరకాల కాలు ష్యాలతో ఇబ్బందిపడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అక్కడికి వెళ్లి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలవాసులు, ప్రజాప్రతినిధులుగా మేం ఎవరం అభివృద్ధిని, ఎస్టీపీ నిర్మాణాన్ని వ్యతిరే కించడం లేదు. కాలనీలవాసుల ప్రయోజనం దృష్ట్యా మూసీ సమీపంలో నిర్మించాలని కోరుతున్నాం. రకరకాల కాలుష్యంతో ఇప్పటికే కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దీనిని గుర్తించాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనాల తనిఖీ చేసిన ప్రాజెక్ట్ మేనేజర్



**ములుగు ప్రతినిధి, నవంబర్ 02(జనంసాక్షి) :** 108 వాహనాల ప్రాజెక్టు మేనేజర్ నసీర్ రూద్దీన్, ఇఎంఇ రాజ్ కుమార్ ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలలోని వాజీడు 108, ఏటూరునాగారం వాహనాలను తనిఖీ చేసి పరికరాలను రికార్డులను పరిశీలించారు. అన్ని ఎమర్జెన్సీ కేసులను టేక్ అప్ చేయాలని ఈఎంటిలకు పైలెట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో పైలట్ కోటి, ఇఎంటి లోహిత, షఫీస్, మధు కుమార్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఒక్కసారిగా కురిసిన వర్షం

**హైదరాబాద్ :** ఆదివారం సాయంత్రం పలుచోట్ల ఒక్కసారిగా వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, షాపూర్‌నగర్, జీడిమెట్ల, బాలానగర్, జగద్గిరిగుట్ట, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, సుచిత్రలో వానపడింది. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, జేఎన్టీయూ, మూసాపేట, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, ఆల్విన్ కాలనీ, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బొల్లారంలో వర్షం కురిసింది. అల్వాల్, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, రహమత్‌నగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కృష్ణానగర్, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది.

# కూకట్‌పల్లికి నల్లచెరువు మణిహారం

**అభివృద్ధిని పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**హైడ్రా పనితీరును ప్రశంసించిన స్థానికులు**



**హైదరాబాద్, నవంబర్ 01 (జనంసాక్షి) :** కూకట్‌పల్లికి నల్ల చెరువును మణిహారంగా హైడ్రా రూపుదిద్దింది. ఈ నెలాఖరుకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. చెరువును పూర్తి స్థాయిలో తవ్వి వర్షపు నీటితో నింపిన హైడ్రా.. ఆ పరిసరాలను అభివృద్ధి చేస్తోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం పరిశీలించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సీసీ టీవీ కెమేరాలు ఏర్పాటు చేసి భద్రతను పటిష్టం చేయాలన్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే ఏరియాలు ఒకటికి రెండు ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్దవాళ్లు సేద దీరేలా గజబో (విశ్రాంతి మందిరం)లు నిర్మించాలని.. చెరువుకు నలువైపులా కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువు చుట్టూ మెడిసినల్ ప్లాంట్స్ నాటాలని.. ఇక్కడికి వస్తే ఆరోగ్యం అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఇవన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**6 నెలల్లో ఆహ్లాదంగా..**

ఒకప్పుడు ఎలా ఉండేది...నేడు ఎలా అభివృద్ధి చెందింది అనేది చూడాలనుకుంటే కూకట్‌పల్లి నల్లచెరువును సందర్శించాలని హైడ్రా నగర ప్రజలను ఆహ్వానిస్తోంది. ఆక్రమణలకు గురై నిర్మాణ వ్యర్థాలతో నిండి.. మురికి కూపంగా మారిన చెరువు సరికొత్త జలాశయంగా కనిపిస్తోంది. కూకట్‌పల్లి నల్ల చెరువు ఆరు నెలల్లో ఆహ్లాదంగా మారింది. చెరువు రూపురేఖలు మారిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండలా మారింది. అక్కడ నివాసం ఉన్న వాళ్లే అచ్చెరవొందేలా కూకట్‌పల్లి నల్ల చెరువు తయారయ్యింది. బోటు షికారుకు చిరునామా అయ్యింది. చెరువు అభివృద్ధిపట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారాంతాల్లో ఇది పెద్ద పిక్నిక్ స్పాట్‌లా మారింది. ఉదయం సాయంత్రం వందలాది మంది ఇక్కడకు చేరుకుని సేదదీరుతున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు.



**16 ఎకరాల నుంచి 30 ఎకరాల వరకూ..**

కూకట్‌పల్లి నల్ల చెరువు ఆక్రమణలతో 16 ఎకరాలుగా మిగిలిపోయింది. రెవెన్యూ, గ్రామ రికార్డులు, చెరువుకు సంబంధించిన సమాచారంతో 30 ఎకరాలకు ఈ చెరువును హైడ్రా విస్తరించింది. చెరువలోకి జరిగి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన 16 వ్యాపార షెడ్డులను హైడ్రా తొలగించింది. చెరువులో పోసిన నిర్మాణ వ్యర్థాలతో పాటు దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించడంతో 4 మీటర్ల లోతు పెరిగింది. అప్పుడు కాని దుర్గంధం దూరమవ్వలేదు. కేవలం 6నెలల్లో 30 ఎకరాల మేర చెరువు తయారయ్యిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మురుగు నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చెరువు చెంతనే బతుకమ్మ ఆటలకు ప్రత్యేకంగా వేదికను సిద్ధం చేస్తున్నారు. బతుకమ్మలను గంగలో కలపడానికి ప్రత్యేకంగా చిన్న కుంటను అందుబాటులోకి తెస్తున్నారు.

**ఇలా అభివృద్ధి చేస్తారని తాము ఊహించలేదు: కిరణ్**

కూకట్‌పల్లి నల్ల చెరవును ఇలా అభివృద్ధి చేస్తారని తాము ఊహించలేదు. కబ్జాల చెర నుంచి బయటపడింది. మురుగును వదిలించుకుంది. పేరుకుపోయిన చెత్తను తొలగించుకుంది. ఎన్ని ప్రయాశలో.. ఎన్ని ఎదురు దెబ్బలో.. మరెన్ని విమర్శలో.. వీటన్నిటినీ తట్టుకుని పని చేసిన హైడ్రా సిబ్బందికి అభినందనలు. హైడ్రా పని తనానికి నిదర్శనంగా నిలిచింది.

**ఆహ్లాదంగా మారింది: పెద్ద ఓబులేసు**

దొమలతో దుర్గంధంగా ఉండే ఈ ప్రాంతం ఆహ్లాదంగా మారింది. ఇంట్లోంచి బయటపడితే నేరుగా ఇక్కడికి వచ్చేస్తున్నాం. చెరువు ఆక్రమణలు తొలగించిన నాటి నుంచి పూర్తి స్థాయిలో అభివృద్ధిని కళ్లారా చూశాం. హైడ్రా కమిషనర్ ఇక్కడికి అనేక సార్లు వచ్చారు. చెరువు అభివృద్ధిని దగ్గరగా పరిశీలించారు. హైడ్రా ఈ కార్యక్రమాన్ని ఓయజ్ఞంలా చేసింది. చెరువును చూస్తే చూడ ముచ్చటగా అనిపిస్తోంది.

**భావితరాలకు నల్ల చెరువు బహుమతి: రామచంద్ర రావు.**

భావితరాలకు నల్ల చెరువు ఒక బహుమతి. చెరువును చాలా బాగా తీర్చిదిద్దారు. చెరువులో 4 మీటర్ల లోతు పూడికను తీసి ఎక్కడా దుర్గంధం ఆనవాళ్లు లేకుండా చేశారు. చెరువు చుట్టూ పిల్లలు ఆడుకునేందుకు మంచి ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతానికి ఇది పిక్నిక్ స్పాట్‌లా తీర్చిదిద్దాలని హైడ్రాను కోరుతున్నాం.

# గోడ్డు కారం మాకు.. హాస్టల్ సరుకులు ఇంటికి..

- నేషనల్ హైవే (జాతీయ రహదారిపై) గురుకుల విద్యార్థినుల ధర్నా
- తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్
- అక్రమాలు ఆపి ఆ తరువాత విద్యను అందించండి అంటూ నినాదాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని కమ్మదనం శివారులోనీ నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థినిలు వందలాదిగా గురుకుల కళాశాల నుండి పాదయాత్రగా నడుచుకుంటూ వచ్చి షాద్ నగర్ పట్టణంలోని జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు ప్రిన్సిపల్ శైలజ ప్రభుత్వం నుండి వచ్చే సరుకులను ఇంటికి తీసుకెళ్లి తమకు మాత్రం గొడ్డుకారం పెడుతుందని తమపై అనుచితంగా మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందుల గురి చేస్తుందని ముందు అక్రమాలు ఆపి ఆ తర్వాత విద్యను అందించండి అంటూ ప్లే కార్డ్స్ లను పట్టుకొని విద్యార్థులు ఆందోళనకు దిగారు ప్రిన్సిపల్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ శైలజ తమను వేదిస్తుందని, ప్రభుత్వం నుండి తమకు వచ్చే ఫండ్స్ కేటాయించడం లేదని, ప్రశ్నించిన విద్యార్థులను వేదిస్తుందని, ఇంటర్నల్ పరీక్షలను రాయనివ్వలేదని, పరీక్ష ఫీజులు 3000 చొప్పున తమతోనే కట్టించారాని, కులం పేరుతో దూషిస్తుందని, తమని మానసికంగా హింసిస్తుందని, ప్రభుత్వం నుండి వచ్చిన ఫండ్ ను తానే సొంతానికి వాడుకుంటుందని మీడియాతో తెలిపారు. ప్రిన్సిపల్ ని సస్పెండ్ చేసేవరకు ఇక్కడి నుండి కదిలేది లేదని బీష్మించుకు కూర్చున్నారు విద్యార్థులు దాదాపు మూడు గంటలకు పైగా జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయ్యింది దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థులను పోలీసులు స్టేషన్ కు తరలించారు..



**ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు**

గత కొంతకాలంగా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు ప్రిన్సిపల్ శైలజ ను సస్పెండ్ చేస్తున్నట్టు జోనల్ అధికారి నిర్మల తెలిపారు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

## ఐఐటీ ఫౌండేషన్ పరీక్షల్లో పోతిరెడ్డిపల్లి విద్యార్థుల ప్రతిభ




**చేర్యాల (జనంసాక్షి) నవంబర్ 02 :** చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రంగు రాజమల్లు కుమార్తె రంగు తన్విత, కుమారుడు సాయి చంద్రహాస్ ఇటీవల నిర్వహించిన పీడబ్ల్యూఎన్ఎస్ఏటీ–2025 ఐఐటీ ఫౌండేషన్ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి అభినందించారు.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే..

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి**



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 2(జనం సాక్షి ):** జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమైందని మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని వెంగల్ రావు నగర్, బోరబండ లో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రతీ గల్లీ, ప్రతీ గడపకు తిరుగుతూ చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎక్కడ చూసిన నవీన్ యాదవ్ పేరు పలుకుతున్నారని. జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ గెలుపు ఎప్పుడో ఖాయమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో పాటు స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలం యాదవ్, హీరో సుమన్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, వైరా ఎమ్మెల్యే రాందాస్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, పీజేఆర్ కూతురు విజయ రెడ్డి, మహిపాల్ రెడ్డి, సావిత్రి రెడ్డి, రాజు, చందు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్

- రైతులు కోరుకున్న రోజే కొనుగోలు కేంద్రాలకు తేవొచ్చు
- కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలసి పత్తి, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నెక్కొండ, నవంబర్ 2 (జనంసాక్షి) :** నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తో కలిసి పత్తి,మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు వారు కోరుకున్న రోజే స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తి తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా ధ్యానం, మొక్కజొన్న రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను, వ్యాపారులను ఆదేశించారు. రైతులు కూడా తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని రైతులను కోరారు కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు నమోదు చేస్తున్నారని, పంట నష్టపోయిన రైతులు అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ రాంరెడ్డి,ఆర్డీవో ఉమారాణి , డీసీఓ నీరజ ,డీఎం సివిల్ సప్లయర్ సంధ్యారాణి , డీసీఎస్ఓ కిష్టయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ ఛైర్మన్లు పాలాయి శ్రీనివాస్, హరీశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కాకపోతే.. బీసీ ఉద్యమం విజయవంతం కాదు

**అన్ని పార్టీలతో కలిసి ఉంటేనే సక్సెస్**

**నిక్కచ్చిగా నడిపేవారే బీసీ జేఏసీ నాయకులుగా ఉండాలి**

**మల్కాజిగిరి ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీ జేఏసీ పొలిటికల్ లీడర్ నాయకత్వంలో ఉండకూడదని, నిక్కచ్చిగా నడిపేవారు నాయకత్వం వహించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో రాజకీయ పార్టీలు ఇన్వాల్వ్ కాకపోతే ఉద్యమం సక్సెస్ కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. అందుకే అన్ని పార్టీలను భాగస్వాములను చేసి జేఏసీ అందరిదిగా ఉండాలని సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక కోసం బంజారాహిల్స్ లోని కళింగ భవన్‌లో జరిగిన బీసీ జేఏసీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు కేవలం స్థానిక సంస్థల్లో మాత్రమే కాదు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలన్నారు. మంత్రివర్గంలో మన వాటా మనకు దక్కాల్సిందేనన్నారు.

ఉద్యమ సమయంలో తెలంగాణ జేఏసీ కూడా వందల సార్లు ఇచ్చుక పోయేదని కానీ ఓపిక పట్టి కలిపి ఉంచామని ఈటల చెప్పారు. బీసీ జేఏసీ వేదిక ఎవరికి వారు పార్టీ ఉపన్యాసాలు ఇచ్చుకునేందుకు, ఎవరి సిద్ధాంతం వారు చెప్పడానికి కాదన్నారు. మనదంతా రాజ్యాధికారం అనే ఒకటే సిద్ధాంతం ఉండాలన్నారు. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ళు అయినా తెలంగాణలో బీసీ సీఎం ఎందుకు కాలేదని ప్రశ్నించారు. బీసీ జనాభా ఎక్కువ ఉన్నా బీసీ సీఎం ఎందుకు కాలేదో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి తప్ప వేరే వారిని దూషణలు అవసరం లేదన్నారు. రిజర్వేషన్ల సాధనతో పాటు బీసీ జేఏసీ మరో పని చేయాలని ఈటల సూచించారు. డబ్బులతో ఓట్లు కొనుక్కొనే వ్యవస్థను ధ్వంసం చేయాలని పెట్టుబడి దారులు, డబ్బులు ఎరవేసి వారు ఉన్నంత కాలం మనం గెలవలేమన్నారు. ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. ఉద్యమాలకు పుట్టినిల్లు తెలంగాణ అని మన సమాజం ఎప్పుడు యాక్టివ్ గా ఉంటుందన్నారు. చైతన్యం మన లక్షణం. తెలంగాణ మట్టి ప్రజలు అన్యాయంను సహించరని చెప్పారు. మనది గొంతెమ్మ కోరిక కాదని న్యాయమైన కోరిక అన్నారు. ఈ దేశంలో బ్రాహ్మణ, వైశ్యులతో సహా అన్ని కులాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని మనం న్యూనత భావనతో ఉండాల్సిన అవసరం లేదన్నారు. అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తు పొందారని కులం మతం పేదరికం విజ్ఞానికి అడ్డం కాదని గుర్తు చేశారు.

**తొందర పడకండి : ఈటల**

డబ్బులతో సీట్లు కొనుక్కున్న వారి వల్ల నాణ్యత కోల్పోతున్నాం తప్ప రిజర్వేషన్ల వల్ల కాదని ఈటల అన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ రాదనే ఆలోచన తెలంగాణ సమాజం, బీసీ జాతుల్లో వచ్చింది. తొందరపడకండి ఈ రిజర్వేషన్లు ఎక్కడికి పోవని అందుకే మొన్న బంద్ విజయవంతం అయ్యిందని చెప్పారు. మీలాంటి సంఘాల పుణ్యమే బీసీ లీడర్ల గెలుపు అన్నారు. జేఏసీ అంటేనే ఒక్కటే జెండా ఒక్కటే ఎజెండా అని చెప్పారు. ప్రజల ఆశయాలకి అనుగుణంగా మనం పని చెయ్యాలన్నారు. మంద కృష్ణ ఉద్యమం చూసి మోడీ ఒక మాట అన్నారు. 30 ఏళ్లుగా జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమం అణిచి వేసే అధికారం ఎవరికీ లేదు అని చెప్పారని గుర్తు చేశారు. మనకు అసాధ్యమైంది ఏమీ లేదాని కావాల్సింది కమిట్మెంట్ మాత్రమేనన్నారు. ఆశయాన్ని ముద్దాడే వరకు ఆగవద్దని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor: M.M.RAHMAN RNINO. APTEL/2013/50370